ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 108 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శుక్రవారం, 18 జనవరి 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940

శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం,
తిథి: శుద్ధ ద్వాదశి సా.5.13
నక్షత్రం: రోహిణి ఉ.9.32
వర్జ్యం: మ.2.56 నుండి 4.28 వరకు
దుర్ముహూర్తం: ఉ.08.24 నుండి 09.12 వరకు, తిరిగి మ.12.24 నుండి 01.12 వరకు
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు



గులాబి గూటికి వంటేరు?

- కేసీఆర్ సమక్షంలో చేరుతారని ప్రచారం
- వస్తానన్నా చేర్చుకునేది లేదన్న మెదక్ ఎంపీ
- ఇదే బాటలో మరికొందరు ముఖ్యులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సొంత నియోజకవర్గం గజ్వేల్ నుంచి రెండు పర్యాయాలు ప్రత్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరికకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. సీఎం కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబి కండువ కప్పుకోనున్నట్టు గురువారం శాసనసభ ఆవరణలో ప్రచారం గుప్పుమంది. అయితే టీఆర్ఎస్ వర్గాలు ధ్రువీకరించకపోయినప్పటికీ వంటేరు కుమారుడే ఈ విషయాన్ని మీడియాకు లీక్ చేసినట్టు తెలిసింది. ఇలా ఉండగా వంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరుతామన్నా చేర్చుకునేది లేదని ఆ పార్టీకి చెందిన మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. టీఆర్ఎస్‌లో వంటేరు చేరబోతున్నట్టు ఆయనంతట ఆయనే పుకార్లు పుట్టించారు తప్ప ఈ అంశంపై తమ పార్టీలో ఎలాంటి చర్చ జరుగలేదనీ, పార్టీలోకి ఎవరూ ఆహ్వానించలేదని ప్రభాకర్‌రెడ్డి ఖండించడం కొసమెరుపు.

ఫిబ్రవరిలోగా పేర్లు సిఫార్సు చేయండి

లోక్‌పాల్ సెర్చ్ కమిటీకి సుప్రీంకోర్టు గడువు

న్యూఢిల్లీ, జనవరి 17: ఉన్నత స్థాయిలో అవినీతిని నిరోధించేందుకు ఉద్దేశించిన లోక్‌పాల్ నియామకానికి సంబంధించి సుప్రీం కోర్టు ఫిబ్రవరి చివరి వరకూ అన్వేషణ ప్యానల్‌కు గడువు ఇచ్చింది. ఈ పదవిలో నియమించేందుకు వీలుగా తమకు ఈ గడువులోగా పలుపేర్లను సిఫార్సు చేయాలని మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్ సారధ్యంలోని కమిటీకి స్పష్టం చేసింది. ఈ కమిటీ తన బాధ్యతను గడువులోగా పూర్తి చేయడానికి వీలుగా అవసరమైన సదుపాయాలు, సిబ్బందిని కల్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. మార్చి 7న మళ్లీ ఈ అంశాన్ని విచారణకు చేపడతామని ప్రధాన న్యాయమూర్తి సారధ్యంలోని సుప్రీం బెంచి ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

ఘనగామా





శాసనసభలో ఎమ్మెల్యేగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు

కొలువుదీరిన సభ

114 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

- తొలుత ప్రమాణం చేసిన సీఎం కేసీఆర్
- 130 నిమిషాలపాటు జరిగిన శాసనసభ
- హాజరుకాని ఐదుగురు సభ్యులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: తెలంగాణ రెండో శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేలు గురువారం పదవీప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం కోసం అసెంబ్లీని గురువారం ప్రత్యేకంగా సమావేశపరిచారు. ప్రోటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ సమక్షంలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ప్రమాణం చేశారు. గురువారం ఉదయం సరిగ్గా 11.30 గంటలకు జాతీయగీతంతో సమావేశం ప్రారంభమైంది. స్పీకర్ స్థానంలో కూచున్న ముంతాజ్ అహ్మద్ ఖాన్ సభ్యులను ఉద్దేశించి తొలుత రెండు నిమిషాలపాటు మాట్లాడారు. సభ్యులు ఒక్కొక్కరే వచ్చి ప్రమాణ స్వీకారం చేయాలని ప్రోటెం స్పీకర్ ఈ సందర్భంగా ఆదేశించారు. తొలుత సీఎం కే. చంద్రశేఖరరావు ప్రమాణం స్వీకరించాలని, ఆ తర్వాత మహిళా సభ్యులు ప్రమాణం చేయాలని, ఆ తర్వాత వరుస క్రమంలో సభ్యులను పిలుస్తామని, ఒక్కొక్కరు వరుసగా వచ్చి ప్రమాణ స్వీకారం చేయాలని ఆదేశించారు. ప్రమాణ స్వీకారం కోసం ప్రత్యేకంగా ఒక వేదిక ఏర్పాటు చేసి అందంగా అలంకరించారు. సాధారణంగా ఆర్థిక శాఖ మంత్రి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సమయంలో ఈ తరహా వేదికను ఆర్థికమంత్రి టేబుల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తుంటారు. ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు మొట్టమొదట 11.35 గంటలకు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మహిళా సభ్యులు అజ్మీరా రేఖానాయక్, డి. అనసూయ, గొంగిడి సుజాత, బానోతు హరిప్రియ, పద్మాదేవేందర్‌రెడ్డి, పట్లోళ్ల సబితారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.


ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను మినహాయించి మొత్తం 119 మంది సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా, 114 మంది మాత్రమే ప్రమాణం చేశారు. ఐదుగురు సభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీ, మాధవరం కృష్ణారావు, సండ్ర వెంకటవీరయ్య, టి. రాజా సింగ్, జాఫర్ హుస్సేన్ సభకు హాజరు కాలేదు. వాస్తవంగా ప్రజలు ఎన్నుకున్న 119 మంది సభ్యులతో పాటు, గవర్నర్ నామినేట్ చేసిన ఆంగ్లో-ఇండియన్ స్టీఫెన్‌సన్ కూడా ప్రమాణ స్వీకారం చేయాలి. ప్రోటెం స్పీకర్‌గా ఎంపికైన ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో ముందుగానే గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికైన జీ. సాయన్న సభలోకి వీల్‌చైర్‌లో వచ్చారు. దాంతో సాయన్న పదవీప్రమాణ స్వీకారానికి నియమావళిలో మార్పు చేస్తున్నట్టు ప్రోటెం స్పీకర్ ప్రకటించారు. ప్రమాణ స్వీకారం చేసిన ఆయన వద్దకే సిబ్బంది రిజిస్టర్ తీసుకువచ్చి సంతకం చేయించారు. అలాగే ఖైరతాబాద్ నుండి ఎన్నికైన దానం నాగేందర్ కాలు నొప్పిగా ఉండటంతో సరిగ్గా నడవలేకపోవడంతో ఆయనకు అసెంబ్లీ సిబ్బంది ఒకరు సహాయంగా ఉండి, ప్రమాణ స్వీకారం పూర్తి చేయించారు. వేములవాడ నుండి ఎన్నికైన చెన్నమనేని రమేష్ - మిగతా 6వ పేజీలో

సభాపతిగా పోచారం

- ఎన్నిక ఏకగ్రీవమే
- మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, ఎంఐఎం
- నేడు బాధ్యతల స్వీకరణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: తెలంగాణ రాష్ట్ర శాసనసభకు రెండో స్పీకర్‌గా మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ ఎన్నికపై శుక్రవారం అధికారికంగా ప్రకటించిన అనంతరం పోచారం బాధ్యతలు స్వీకరిస్తారు. స్పీకర్ ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ వెలువడగానే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ కూడా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిపాదించిన పోచారం అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించగా, పాలకపక్షానికి మిత్రపక్షమైన ఎంఐఎం బలపరిచింది. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి సహకరించాలని ప్రతిపక్షాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే చేసిన విజ్ఞప్తి మేరకు అన్ని పక్షాలు కూడా మద్దతు పలికాయి. స్పీకర్ ఎన్నికకు నామినేషన్ దాఖలుకు గడవు ముగిసే వరకు పోచారం ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు శుక్రవారం అధికారికంగా ప్రొటెం స్పీకర్ ముంతాజ్ ఖాన్ ప్రకటిస్తారు. ఆ తర్వాత సభా నాయకుడు, సీఎం కేసీఆర్‌తో పాటు ఇతర పక్షాల నేతలు స్వయంగా పోచారంను స్పీకర్ సీట్లో - మిగతా 6వ పేజీలో



స్పీకర్ ఎన్నికకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో సీఎం కేసీఆర్, భట్టి విక్రమార్క తదితరులు

సీబీఐలో మరో కలకలం

ముగ్గురు సీనియర్లపై బదిలీ వేటు

వేరే శాఖలకు రాకేష్ ఆస్థానా, సిన్హా, ఏకే శర్మ



న్యూఢిల్లీ, జనవరి 17: సీబీఐలో సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. వివాదాస్పద అధికారిగా పేరుతెచ్చుకున్న స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానా, జాయింట్ డైరెక్టర్ అరుణ్ కుమార్ శర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మనీషా కుమార్ సిన్హాలను సీబీఐ నుంచి బదిలీ చేశారు. సీబీఐలో వీరి నిర్ణీత పదవీ కాలం పూర్తి కాకుండానే బదిలీ వేటు వేశారు. స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాను సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ విభాగానికి బదిలీ చేశారు. పదవి నుంచి తొలగించబడిన మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ, రాకేష్ ఆస్థానా మధ్య తలెత్తిన విభేదాలు తారాస్థాయికి చేరుకోవడంతో, గత ఏడాది అక్టోబర్ 23వ తేదీన ఈ ఇద్దరు ఉన్నతాధికారులను బలవంతంగా సెలవుపై వెళ్లాలని కేంద్రం ఆదేశించిన విషయం విదితమే. బదిలీ వేటుపడిన మరో అధికారి సిన్హా కూడా వివాదాస్పద అధికారిగా ముద్ర ఉంది. ఆస్థానాపై చేపట్టిన దర్యాప్తులో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, కేంద్ర మంత్రి హరిభాయ్ పత్రీభాయ్ చౌదరి, కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి జోక్యం చేసుకుంటున్నారంటూ సుప్రీంకోర్టులో సిన్హా పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. బదిలీ అయిన మరో జేడీ ఏకే శర్మ సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ సన్నిహితుడనే ప్రచారం ఉంది. ఆస్థానా, శర్మ ఇద్దరూ కూడా గుజరాత్ కేడర్ ఐపీఎస్ అధికారులు కావడం గమనార్హం. సిన్హా 2000 సంవత్సరం ఏపి కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి.

ఇక రాహుల్‌దే నిర్ణయం

- సీఎల్పీ నేత ఎంపికపై కాంగ్రెస్ తీర్మానం
- అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడతామని స్పష్టీకరణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: శాసనసభా కాంగ్రెస్ పక్షం నాయకుడిని (సీఎల్పీ) ఎంపిక నిర్ణయాన్ని పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏకవాక్య తీర్మానం చేశారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పష్టం చేశారు. సీఎల్పీ నాయకుడి ఎంపికపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు వచ్చిన విషయం తెలిసిందే. శాసనసభ ప్రారంభానికి ముందు గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ పరిశీలకుడు వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆర్‌సి కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. పార్టీకి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలతో పార్టీ పరిశీలకుడు వేణుగోపాల్ విడివిగా సీఎల్పీ నేతగా ఎవరుండాలనే అంశంపై - మిగతా 6వ పేజీలో



హైదరాబాద్‌లో విలేఖరులతో మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కుంతియా, ఉత్తమ్ తదితరులు

డేరాబాబాకు యావజ్జీవ శిక్ష

- జర్నలిస్టు హత్య కేసులో తీర్పు
- మరో ముగ్గురికి కారాగారం



5

ఎన్ఐఏ దర్యాప్తుపై కోర్టుకు?

- కోడికత్తి కేసుపై ఏపీ సీఎంతో డీజీపీ భేటీ
- సహకరించడం లేదంటూ సిట్‌పై ఎన్ఐఏ పిటిషన్
- ముగిసిన నిందితుడు శ్రీనివాసరావు కస్టడీ
- నేడు కోర్టులో హాజరుపర్చనున్న అధికారులు


విజయవాడ (క్రైం), జనవరి 17: వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసు మరో మలుపు తిరిగింది. కోడికత్తి కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేయడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా గురువారం డీజీపీ ఆర్పీ ఠాకూర్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ కావడం దీనికి బలం చేకూరుస్తోంది. మరోవైపు విచారణలో తమకు సహకరించడం లేదని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ ఏపీ సిట్ బృందంపై ఆరోపణ చేసింది. ఈ మేరకు విజయవాడలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేసింది. జగన్‌పై కోడికత్తి దాడి కేసును హత్యాయత్నం కేసు కింద నమోదు చేసిన విశాఖ పోలీసుల చేతి నుంచి విచారణాధికారం ఎన్ఐఏకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడైన శ్రీనివాసరావును ఇప్పటికే కోర్టు ఆదేశాలతో వారం రోజుల పాటు తమ కస్టడీకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు విశాఖ, హైదరాబాద్, తదితరచోట్లకు తరలించి ప్రశ్నించారు. కాగా శుక్రవారంతో కస్టడీ ముగియనున్నందున నిందితుడు శ్రీనివాసరావును విజయవాడలోని ఎన్ఐఏ కోర్టులో హాజరుపరచనున్నారు. ఇదిలావుండగా.. కేసుకు సంబంధించిన ఆధారాలు ఇచ్చేందుకు ఏపీ సిట్ నిరాకరించిందంటూ ఎన్ఐఏ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సిట్ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేయగా, దీనిపై ఇరువర్గాల వాదనలు కొనసాగాయి. సిట్ పోలీసులు రికార్డులు ఇవ్వడం లేదని, సహకరించడం లేదని ఎన్ఐఏ ఆరోపించింది. వాదనలు విన్న న్యాయస్థానం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. అయితే ఎన్ఐఏ - మిగతా 6వ పేజీలో

సరైన పంథాతోనే శాంతి

విదేశాంగ విధానానికి ఇదే గీటురాయి • పుస్తకావిష్కరణలో వెంకయ్య ఉద్ఘాటన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: విదేశీ విధానంలో సరైన పంథాను అనుసరించడం ద్వారా అన్ని దేశాల సహకారం, స్నేహపూర్వక ఒప్పందాలు, శాంతి సాధ్యమవుతుందని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు అభివృద్ధి వేగాన్ని పెంచుతాయని, ఇందుకోసం అన్ని దేశాలూ ఒకే తాటిమీదకు వచ్చి సమిష్టిగా ముందుకు నడవాల్సిన అవసరం ఉందని ఉప రాష్ట్రపతి చెప్పారు. కేరళ సెంట్రల్ యూనివర్శిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ సర్వేపల్లి వెంకట శేషగిరిరావు రాసిన 'ఇండియన్ ఓషన్ నైబర్‌హుడ్-నరేంద్రమోదీ స్ట్రాటజీ ఇనిషియేటివ్' పుస్తకాన్ని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శేషగిరిరావు ఎంతో పరిశోధించి ఈ పుస్తకాన్ని సమగ్రంగా అందించారని చెప్పారు. భారతదేశ సముద్ర తీరానికి చుట్టూ ఉన్న దేశాలు, వాటితో సత్సంబంధాలు విషయంలో ప్రధాని నరేంద్రమోదీ వ్యూహాలు, చేపడుతున్న చొరవ గురించి ఈ పుస్తకంలో ఉందని, భారతదేశం శాంతి కాముక దేశమే అయినా మన రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లో రాజీపడకూడదని, మన బలాన్ని పెంచుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. పురాతన కాలం నుండి సముద్ర మార్గం ద్వారా భారతదేశం వాణిజ్యాన్ని నిర్వహిస్తోందని, స్వాతంత్ర్యం తర్వాత కూడా ఇదే వేగాన్ని కొనసాగిస్తోందని అయితే వాణిజ్యం, రక్షణ విషయంలో మారుతున్న ప్రాధాన్యతలకు అనుగుణంగా మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్థికాభివృద్ధిపరంగానే కాకుండా జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న చర్యలతో పాటు తీర సరిహద్దుల విషయంలో భారతదేశ వ్యూహాలు, మిగతా దేశాలతో - మిగతా 6వ పేజీలో



హైదరాబాద్‌లో గురువారం కేరళ సెంట్రల్ వర్సిటీ వీసీ ప్రొ. శేషగిరిరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ ఎంపీ దత్తాత్రేయ తదితరులు





సచివాలయానికి ఎదురుగా ఉన్న గుడిలో అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటున్న సీఎం కేసీఆర్. స్పీకర్‌గా ఎంపిక చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి వేదాంతాచారి ఉన్నారు. ప్రొటెం స్పీకర్ ముంతాజ్ ఖాన్, కాంగ్రెస్ నేత ఉత్తమ్‌తో కేసీఆర్ కరచాలనం

గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళి

అసెంబ్లీ ఆవరణలోని గుడిలో పూజలు.. అనంతరం సభలోకి వెళ్లిన సీఎం కేసీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు కూడా నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలతో కలిసి శాసనసభ ఆవరణలోకి అడుగుపెట్టిన సీఎం కేసీఆర్‌కు శాసనసభ కార్యదర్శి డాక్టర్ వేదాంతాచారి స్వాగతం పలికారు. అనంతరం శాసనసభ సచివాలయానికి ఎదురుగా ఉన్న గుడిలో అమ్మవారికి స్పీకర్‌గా ఎంపిక చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి వేదాంతాచారితో కలిసి కేసీఆర్ పూజలు నిర్వహించారు. సరిగ్గా 11.05 ఐదు నిమిషాలకు శాసనసభ మందిరంలోకి వెళ్లిన సీఎం కేసీఆర్‌తో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రమాణం ఇలా..

తెలంగాణ శాసనసభకు ఎన్నికైన సభ్యులు గురువారం పదవీ ప్రమాణం చేశారు. పదవీ ప్రమాణం రెండు విభాగాలుగా చేశారు. ఒకటి (ఓత్-1) శాసనసభ సభ్యునిగా/సభ్యురాలిగా ప్రమాణం చేయగా, రెండోది (ఓత్-2) సభా నియమావళికి కట్టుబడి ఉంటానని చేశారు.

∴ ఓత్-1 ఇలా ఉంది..‘‘........అనే నేను శాసన సభ సభ్యునిగా/సభ్యురాలిగా ఎన్నిక అయినందున, శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని, దైవసాక్షిగా ప్రమాణం/పవిత్ర హృదయంతో ప్రతిజ్ఞ చేస్తున్నాను.’’

∴ ఓత్-2 ఇలా ఉంది..‘‘తెలంగాణ శాసనసభ సభ్యుడనైన / సభ్యురాలినైన ....అనే నేను సభ నియమాలకు, కట్టుబడి ఉంటానని, వాటిని అనుసరిస్తానని, సభా మర్యాదలు పాటిస్తానని, సంప్రదాయాను గౌరవిస్తానని దైవ సాక్షిగా ప్రమాణ / పవిత్ర హృదయంతో ప్రతిజ్ఞ చేస్తున్నాను. ప్రమాణ స్వీకారం కొంత మంది ఇంగ్లీషులో, చాలా మంది తెలుగులో చేయగా మరికొందరు ఎమ్మెల్యేలు ఉర్దూలో చేశారు.

దైవభక్తి - హృదయప్రీతి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: తండ్రికి దైవభక్తి ఉంటే పిల్లలు కూడా అదే బాటలో పయనిస్తారని చెప్పలేం. శాసనసభకు ఎన్నికైన అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ‘దైవసాక్షి’ పేరుతో ప్రమాణం చేయగా, ఆయన కుమారుడు కేటీఆర్ ‘పవిత్రహృదయం’ పేరుతో ప్రమాణం చేశారు. సాధారణంగా దేవుడంటే నమ్మకం లేని వారు, ఇతరత్రా అభిప్రాయాలు ఉన్నవారు పవిత్రహృదయం పేరుతో ప్రమాణం చేయడం పరిపాటి. సభ్యులు ప్రమాణం చేసేందుకు ఈ రెండే అప్షన్లు ఉన్నాయి. అందుకే 101 మంది దైవసాక్షిగా ప్రమాణం చేయగా, 13 మంది పవిత్ర హృదయంతో అంటూ ప్రమాణం చేశారు. ఆసిఫాబాద్ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన అత్రం సక్కు గిరిజన ఆరాధ్య దైవమైన ‘పెర్సాఫెన్’ సాక్షిగా అంటూ ప్రమాణం చేయబోయారు. దాంతో అసెంబ్లీ సిబ్బంది కలగచేసుకుని దైవసాక్షిగా అనాలని సూచించడంతో ఆయన ప్రమాణ స్వీకారాన్ని సవరించుకుని ‘దైవసాక్షి’గా అంటూ ప్రమాణం చేశారు.



అసెంబ్లీ స్పీకర్‌గా నామినేషన్ల కార్య క్రమం ముగిసిన తరువాత జూబ్లీహాల్‌లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు, పోచారం శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్క వివిధ పార్టీల నాయకులు.

ఆకాశవాణి చిన్నమ్మ ఇక లేరు

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 17: హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం నుండి ప్రతి రోజూ ప్రసారమయ్యే పాడి- పంట కార్యక్రమంలో చిన్నమ్మగా ఆబాలగోపాలాన్ని అలరించిన నిర్మలా వసంత్ (72) గొంతు అనారోగ్యంతో మూగబోయింది. గత 8వ తేదీన ఆకాశవాణి కేంద్రంలో నిర్వహించిన పూర్వ ఉద్యోగుల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న ఆమె అనంతరం స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. ఈ నెల 13వ తేదీన ఆమె కన్నుమూశారని ఆకాశవాణి సిబ్బంది తెలిపారు. పూర్వీకులు తమిళనాడుకు చెందినవారైనా కుటుంబం కడపకు వలస రావడంతో ఆమె తండ్రి కడపలో మున్సిపల్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారని, హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్శిటీ ఇంగ్లీషు శాఖకు చెందిన వసంత్‌ను వివాహం చేసుకున్నారని ఆకాశవాణి సిబ్బంది తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, పదవీవిరమణ అనంతరం ఆమె కుటుంబం అడ్డగుట్టలో నివాసం ఉంటున్నారు. వ్యవసాయ కార్యక్రమమే అయినా అన్ని వర్గాల శ్రోతలను తమవైపునకు ఆకర్షించి అందరినీ ఆశ్చర్యపరిచేలా కార్యక్రమాలను నిర్వహించారు. పల్లెటూరి అమాయక మహిళా రైతు మనస్సును ఒడిసిపట్టుకుని వారి సందేహాలను తన గొంతుతో వినిపిస్తూ, పెద్దయ్య ద్వారా సమాధానాలు రాబడుతూ అందరినీ మెప్పించగలిగారు. నిర్మలా వాసంత్ జీవిత నేపథ్యానికి భిన్నమైన పాత్రలో తన గొంతు ద్వారా కార్యక్రమాలకు ప్రాణం పోశారు. వారి సేవలను గుర్తు చేసుకుని ఆకాశవాణి సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు.

ఎంఐటీలో పొలిటికల్ లీడర్‌షిప్‌పై మాస్టర్స్ కోర్సు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: ఎంఐటీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పొలిటికల్ లీడర్‌షిప్‌పై రెండేళ్ల మాస్టర్స్ కోర్సు నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు, డీన్ రాహుల్ కరాడ్ తెలిపారు. శక్తివంతమైన రాజకీయ నాయకుడిగానూ, ధృడమైన నిర్మాణాత్మకమైన ఆలోచనలను మెరుగుపరుచుకునేందుకు ఈ కోర్సు దోహదం చేస్తుందని ఆయన చెప్పారు. కాగా ఈ నెల 18వ తేదీ నుండి ఎంఐటీ డబ్ల్యుపీయూ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు 9వ భారతీయ ఛాత్ర సంసద్ సదస్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు జాతి నిర్మాణానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు యువతను ఆ దిశగా మళ్లించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని అన్నారు.

విశ్వవిద్యాలయాల్లో కాషాయ ఉన్మాదులు

★ రోహిత్ వేముల వర్థంతి సభలో నేతలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: ఉన్నత విద్యాలయాల్లో కాషాయ మతోన్మాదులు విషపురుగులుగా మారి భావి మేధావులను, యూనివర్శిటీల్లో భావ ప్రకటనా స్వేచ్ఛనూ, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు పేర్కొన్నారు. మత సామరస్యం, ప్రగతి శీల భావాలను అభివృద్ధి చేయడం మతోన్మాదులను ప్రతిఘటించడం ద్వారానే రోహిత్ వేముల ఆశయాలు ముందుకు వెళ్తాయని ఆయన చెప్పారు. గురువారం నాడు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం, టీపీఎస్‌కే హాలులో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రోహిత్ వేముల 3వ వర్థంతి సభను నిర్వహించారు. రోహిత్ వేముల చిత్ర పటానికి చర్చల ప్రతినిధి చంద్రన్న పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు కేవీపీఎస్ అధ్యక్షుడు కాడిగల్ల భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే దళితులు,మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయని అన్నారు. భావి మేధావులు, జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతులను బీజేపీ ప్రభుత్వం మట్టుబెట్టిందని అన్నారు. 2016 జనవరి 17 హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో అంబేద్కర్ భావాలకు ప్రతినిధిగా ఉన్న భావి మేధావి రోహిత్ వేములతో పాటు నలుగురిని అకారణంగా వీసీ సాంఘిక బహిష్కరణ చేశారని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో వంటేరు కలకలం

★ గులాబీ గూటికి చేరిక వార్తపై గందరగోళం
★ గజ్వేల్ భవిష్యత్ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డినా?!
★ అంతుచిక్కని వ్యూహంతో అంతా బేజార్



ఆంధ్రభూమి బ్యూరో


సంగారెడ్డి, జనవరి 17: గడచిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో గులాబి దళపతి కేసీఆర్‌తో ఢీ అంటే ఢీ అని తలపడిన కాంగ్రెస్ నాయకుడు బూర్గుపల్లి ప్రతాప్‌రెడ్డి టీఆర్‌ఎస్ పార్టీలో చేరతారన్న వార్త పెద్ద చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు కేంద్ర రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో గజ్వేల్ నియోజకవర్గానికి భవిషత్ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డియే కావచ్చన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ యేతర పార్టీల నేతృత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు కావాలని, అందుకుగాను కొత్త ఫ్రంట్‌ను నెలకొల్పాలన్న సీఎం సంకల్పంతో ఉండగా ఇదే నేపథ్యంలో ప్రతాప్‌రెడ్డి గులాబి గూటికి చేరబోతుండటం ఇందుకు బలమైన కారణమని చెప్పవచ్చు. మరో మూడు నెలల్లో పార్లమెంటు ఎన్నికలు రానుండటం, కేసీఆర్ కేంద్ర రాజకీయాలపై పదే పదే మాట్లాడుతుండటంతో రాష్ట్రంలోని ఏదేని పార్లమెంటు స్థానం నుండి పోటీ చేసి కేంద్రానికి వెళ్లిపోతే అప్పుడు గజ్వేల్ స్థానానికి అనివార్యం కానున్న ఉప ఎన్నికలో ప్రతాప్‌రెడ్డి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగవచ్చన్న చర్చకు తెరలేచింది. భవిషత్ సీఎం కేటీఆర్ అన్న ప్రచారం ఉండటం, కేసీఆర్ కేంద్రం పెత్తనంపై మాట్లాడుతుండటం మరిన్ని ఊహాగాహనాలకు తావిస్తోంది. ఇదిలావుండగా గజ్వేల్ నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ పార్టీకి రెండు దపాలుగా బలంగా ఎదుర్కొనేందుకు ప్రతాప్‌రెడ్డి శాయశక్తుల కృషి చేసిన విషయం తెలిసిందే. ఇందుకుగాను ప్రతాప్‌రెడ్డిని టీఆర్‌ఎస్‌లో చేర్చుకుంటే ప్రతిపక్షం బలహీనపడుతుందన్న ఉద్దేశంతోనే ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ కొత్త ఎత్తుగడను రూపొందించి ఫలితాన్ని రాబట్టుకుంటున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి ఓడిపోయిన ప్రతాప్‌రెడ్డి ఆర్థికంగా దెబ్బతినడం, భవిషత్తును తీర్చిదిద్దుకునేందుకు తన పంథాను మార్చుకోవచ్చన్న మరో ఆలోచన రేకెత్తిస్తోంది. ప్రతాప్‌రెడ్డి గులాబి తీర్థం పుచ్చుకుంటే త్వరలోనే జిల్లా పరిషత్ ఎన్నికలు రానుండగా చైర్మన్ పదవి కట్టబెట్టే అవకాశం లేకపోలేదు. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్, ఎమ్మెల్సీ పదవితో సముచిత స్థానం కల్పించవచ్చని ప్రతాప్‌రెడ్డి అనుచరులు పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక నాలుగున్నర సంవత్సరాలు టీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన ప్రతాప్‌రెడ్డిపై పోలీసు కేసులు కూడా నమోదై ఉన్నాయి. ఉన్నట్లుండి కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి టీఆర్‌ఎస్ పార్టీలో చేరుతూ ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయ వర్గాలను ప్రతాప్‌రెడ్డి ఆశ్చర్యానికి గురి చేయబోతున్నాడని చెప్పవచ్చు. ముందస్తు ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన పలువురు ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం అటుంచితే తన నియోజకవర్గం నుండే కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బ తీస్తూ హెచ్చరికలు పంపిస్తున్నారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఒక్కసారిగా తగ్గిన చింతపండు ధర

క్వింటాలుకు రూ.10 వేలు తగ్గింపు ★ ఈనామ్‌కు వ్యతిరేకంగా రైతుల నిరసన ★ హిందూపురం మార్కెట్‌లో ఉద్రిక్తత

హిందూపురం, జనవరి 17: గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒక్కసారిగా చింతపండు ధరలు గణనీయంగా తగ్గడంతో అనంతపురం జిల్లా హిందూపురంలో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. గత వారంతో పోల్చితే క్వింటాలుకు దాదాపు రూ.10 వేలకు పైగా ధర పడిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. రైతుల నిరసనకు ట్రేడర్లు మద్దతు పలికారు. దీంతో ఈనామ్‌కు స్వస్తి పలకాలంటూ నినదించారు. దీనికి టీడీపీ నాయకులు వత్తాసు పలకడంతో వ్యవసాయ మార్కెట్‌యార్డులో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఇటు చింతపండు అటు ఎండుమిర్చి లావాదేవీలకు ఆసియాలోనే పేరుగాంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చింతపండు ఉత్పత్తులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు గిట్టుబాటు ధర కోసం ఎంతోఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో గురువారం ఉన్నఫళంగా క్వింటాలుకు రూ.10 వేలు నుంచి రూ.12 వేల వరకు ధర పడిపోవడం రైతులను ఆందోళనకు గురిచేసింది. ఈనామ్ లావాదేవీల్లో తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ రైతులు నిరసనకు దిగారు. చింతకాయలు దులిపేందుకు అయిన ఖర్చులు కూడా గిట్టుబాటు కావని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరుగుతున్న ఈనామ్ పద్ధతి అస్తవ్యస్తంగా తయారైందంటూ రైతులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. దీనికి ట్రేడర్లు వత్తాసు పలకడంతో మార్కెట్‌యార్డు బయట ప్రధాన రహదారికి అడ్డంగా ఆయా వర్గాలు ఆందోళనకు దిగాయి. గత వారం పేరెన్నికగన్న చింతపండు కరిపులి రకం క్వింటాలు ధర రూ.25 వేలు నుంచి రూ.27 వేల దాకా పలుకగా గురువారం జరిగిన ఈనామ్ పద్ధతిలో రూ.7 వేల నుంచి రూ.10 వేలకు పడిపోయింది. అదే విధంగా ఫ్లవర్ రకం చింతపండు గత వారం రూ.12 వేల నుంచి రూ.16 వేలు పలకగా ప్రస్తుతం కేవలం రూ.3 వేల నుండి రూ.4 వేలు మాత్రమే రావడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తమకు గిట్టుబాటు ధర కల్పించాలని, అస్తవ్యస్తంగా తయారైన ఈనామ్ పద్ధతిని మార్చాలంటూ నినాదాలు చేశారు. రైతుల ఆందోళన సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు ఏ.నాగరాజు తదితరులు మార్కెట్‌కు చేరుకుని చర్చించారు. ఈనామ్ పద్ధతిపై రైతులు, ట్రేడర్లు అభ్యంతరం చెప్పడంతో టీడీపీ నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. రైతులకు న్యాయం చేయాల్సిన ఈనామ్ పద్ధతిపై స్పష్టమైన విధివిధానాలు లేకపోవడం, సాంకేతికపరమైన సౌలభ్యం లోపభూయిష్టంగా ఉండటంతో ఇలాంటి గందరగోళ పరిస్థితి నెలకొంటోందని అన్నారు. ఈనామ్ పద్ధతిని మార్చి గతంలో తరహాలో లావాదేవీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని టీడీపీ నాయకులు భరోసా ఇవ్వడంతో రైతులు శాంతించారు.

ఇదిలాఉండగా రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం అమలు పరుస్తున్న ఈనామ్ పద్ధతిని అటు రైతులు ఇటు ట్రేడర్లతో పాటు అధికార పార్టీ నాయకులు వ్యతిరేకించడంతో వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు డైలమాలో పడ్డారు. వ్యూహాత్మకంగా ట్రేడర్లు తమ సౌలభ్యం కోసం ఈనామ్ పద్ధతిని వ్యతిరేకిస్తూ రైతుల మద్దతు కూడగట్టడంలో సఫలం కావడం చర్చనీయాంశమవుతోంది.




★ చింతపండు ధర అమాంతం పడిపోవడంతో అనంతపురం జిల్లా హిందూపురం వ్యవసాయమార్కెట్‌లో ఆందోళనకు దిగిన రైతులు..
★ హిందూపురం మార్కెట్‌కు రైతులు తెచ్చిన చింతపండు



నష్టాల నుంచి ఆర్టీసీని గట్టెక్కించేందుకు ఆదాయ వనరులపై ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో చర్చిస్తున్న ఈడీ పురుషోత్తం

ఆదాయం పెంపుపై ఆర్టీసీ దృష్టి

★ ఐవోసీఎల్ అధికారులతో ఈడీ మంతనాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: తెలంగాణలో ఆర్టీసీకి ఉన్న ఆస్తులను ఆదాయాలుగా మార్చుకోవాలని యాజమాన్యం యోచిస్తోంది. నష్టాల నుంచి ఆర్టీసీని గట్టెక్కించడానికి ఆదాయ మార్గాలను పరిశీలిస్తున్నారు. ఆర్టీసీని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన అంశాలపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. గురువారం ఆర్టీసీ అధికారులు బస్ భవనంలో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్ సంస్థలను ఆహ్వానించారు. తెలంగాణలో ఉన్న ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో వాణిజ్య, వ్యాపారాలను ప్రోత్సహించాలని సంస్థ అధికారులు ఒక నివేదికను పెట్టబడి సంస్థలకు అందించారు. ఆర్టీసీ అధికారులు పెట్టుబడుల సంస్థల యాజమాన్యాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చించారు. ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో ఆయిల్ అవుట్‌లెట్స్ ప్రదేశాల్లో మౌలిక సదుపాయాల కల్పిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సేల్స్ రూం, టాయిలెట్స్, షెడ్లు వంటి వాటిని సమకూర్చడంపై అధికారులు సమాలోచన చేశారు. ఇంధన అవుట్‌లెట్స్ నిర్వహణ ద్వారా వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రయాత్నాలు వేగవంతం చేయాలన్న అంశాలు దృష్టికి వచ్చాయి. సర్వీస్ ప్రొవైడర్స్, అకౌంట్స్ అధికారులు, డిపోమేనేజర్లు అందిరితో కలసి ఓ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ ఈడీ పురుషోత్తం ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. త్వరలో సంస్థకు ఆదాయాలు వచ్చే అంశాలపై ఒక నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని పురుషోత్తం వెల్లడించారు.

మార్చి 31కల్లా కాళేశ్వరం పనులు పూర్తి

కూలీలు, వాహనాల సంఖ్య పెంచండి ★ పంపుహౌస్ పనుల్లో వేగం పెరగాలి ★ గ్రావిటీ కెనాల్ పనులపై దృష్టి సారించండి

★ ప్రాజెక్టు పనులు పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశం



ప్రాజెక్టు నిర్మాణ పనులపై అధికారులకు సూచనలు ఇస్తున్న సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, పనుల తీరును వివరిస్తున్న అధికారులు

భూపాలపల్లి/మహదేవ్‌పూర్, జనవరి 17: మార్చి 31 వరకు కాళేశ్వరం ప్రాజెక్టు సివిల్ వర్క్స్ అన్ని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డీ శ్రీధర్‌దేశ్ పాండే, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లుతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌజ్, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్, అన్నారం బ్యారేజీ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్దేశిత మార్చి 31 వరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయడం కోసం తీసుకుంటున్న చర్యలను ప్రాజెక్టు ఇంజనీర్ల ద్వారా తెలుసుకున్నారు. రోజుకు ఎంతమంది కార్మికులను ఉపయోగిస్తున్నారని, ఎన్ని వాహనాలను పెంచాలని అడిగారు. అలాగే కన్నెపల్లి పంపుహౌస్‌లో పైప్‌లైన్ నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి మోటార్ల బిగింపు వేగంగా చేపట్టాలని అన్నారు. ప్రతిరోజూ 150 మీటర్ల గ్రావిటీ కెనాల్ లైనింగ్ పూర్తి చేయాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో పనిచేసే ప్రతి అధికారి, ఇంజనీరు, కార్మికులు అంకిత భావంతో పనిచేయడం వలననే ఇంత త్వరగా ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నందున ప్రాజెక్టు పూర్తి నిర్మాణం అయ్యే వరకు ఇదే అంకితభావంతో పని చేయాలని, వేగం తగ్గకుండా ఇలాగే పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు సిఇ వెంకటేశ్వర్లు, భూపాలపల్లి, ఆర్‌డీవో వెంకటాచారి, ప్రాజెక్టు ఈఈ రమణారెడ్డి, ఎల్అండ్‌టీ, మెగా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దుబాయిలో మరో యువకుడి ఆత్మహత్య

★ నిండు ప్రాణాలను బలిగొంటున్న గల్ఫ్ మోజు

★ వారం వ్యవధిలోనే ఇద్దరు ఇందూరు బిడ్డల బలవన్మరణం

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, జనవరి 17: ఎడారి దేశాలకేగి ఎక్కువ డబ్బులు సంపాదించాలనే యువకుల తపన వారి నిండు ప్రాణాలను బలిగొంటోంది. ఇటీవలి కాలంలో గల్ఫ్ దేశాలలో పరిస్థితులు ఏమాత్రం అనుకూలించకపోవడంతో, పుట్టెడు అప్పులు చేసి అక్కడికి వెళ్తున్న యువకులు తారుమారైన తమ అంచనాలతో మానసిక వ్యధ చెందుతూ, ఆర్థిక ఇబ్బందులను తట్టుకుని పరాయి దేశాల్లోనే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ పరిణామం కాస్త బాధిత కుటుంబీకులను దుఃఖ సాగరంలో కూరుకుపోయేలా చేస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే ఈ తరహాలో ఇద్దరు యువకులు గల్ఫ్ దేశాల్లో తనువులు చాలించడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అనికేశ్ అరుణ్(28) వారం క్రితమే దుబాయ్ దేశానికి సంపాదన నిమిత్తం వెళ్లాడు. కంపెనీ వీసా కోసం ఏజెంట్‌కు భారీ మొత్తంలోనే డబ్బులు చెల్లించి దుబాయ్‌లోని అల్‌కుష్ ప్రాంతంలో గల ఓ కంపెనీలో కొలువులో చేరాడు. ఈ క్రమంలోనే అరుణ్ గురువారం ఉదయం తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ దుఃఖసాగరంలో మునిగిపోయారు. అరుణ్‌కు మూడు నెలల కిందటే పెళ్లి జరుగగా, ఇదివరకు కూడా ఆయన గల్ఫ్‌లో నాలుగేళ్లు పని చేసి వచ్చాడని కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది.

తాజాగా పెళ్లి చేసుకుని వారం క్రితమే దుబాయ్‌కు వెళ్లిన అరుణ్, అంతలోనే ఆత్మహత్య చేసుకోవడం వెనుక ఆర్థిక సమస్యలే కారణమై ఉంటాయని భావిస్తున్నారు. అక్కడి కంపెనీలో జీతం అతి తక్కువగా చెల్లిస్తామని పేర్కొనడంతో వీసా కోసం చేసిన అప్పులు ఎప్పటికి తీర్చాలనే ఆందోళనతో బలవన్మరణానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.

కారణం ఏదైనప్పటికీ నిండు ప్రాణం బలికావడంతో బాధిత కుటుంబం కన్నీటి పర్యంతం అవుతోంది. ఇదిలాఉండగా, ఈ నెల 10వ తేదీన ఇందల్వాయి మండలం కొత్త కోరుట్ల తండాకు చెందిన బదావత్ గణేష్ అనే యువకుడు కూడా బెహ్రాయిన్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. వారం వ్యవధిలోనే ఈ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు గల్ఫ్ దేశాలకు వెళ్లి తనువులు చాలించడం విషాదాన్ని మిగిల్చినట్లయ్యింది.



యాదాద్రీశునికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

వైభవంగా పుష్పార్చన

యాదాద్రిలో నేత్రపర్వంగా లక్ష పుష్పార్చన ★ ఏకాదశి ప్రత్యేక పూజలు

యాదగిగుట్ట, జనవరి 17: శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు నిత్యారాధనలు, అభిషేకాలు, ఆర్జిత సేవలు, ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని లక్ష పుష్పార్చన శాస్త్రయుక్తంగా సాగాయి. లక్ష్మీనరసింహుల ఆలయంలో వేకువ జామున సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి హారతి నివేదన చేశారు. బిందె తీర్థం, బాలబోగంతో ఆలయ పూజాధికాలు ప్రారంభించారు. ముందుగా స్వయంభూవులను ఆరాధించిన పూజారులు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో కొలిచారు. వివిధ సుగంధ ద్రవ్యాలతో, పూలమాలలతో పట్టు వస్త్రాలతో, ఆభరణాలతో సుందరంగా అలంకరించి అర్చించారు. కవచ మూర్తులను స్వర్ణ పుష్పాలతో ఆరాధించారు. ఆలయ కల్యాణ మండపంలో అర్చక బృందం వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి ముందు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీ సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవోత్సవాలు నిర్వహించారు.

శుక్రవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని లక్ష్మీనరసింహులకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. పుష్పార్చనలో, బాల ఆలయంలో ఉదయ నుండి సాయత్రం వరకు కొనసాగిన సహస్రనామార్చన, అష్టోత్తర పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

తిరుగు ప్రయాణమూ అవస్థే..!


చౌటుప్పల్, జనవరి 17: సంక్రాంతి పండుగను ముగించుకోని హైదరాబాద్‌కు చేరుకుంటున్న ప్రయాణికులు గురువారం ట్రాఫిక్‌లో చిక్కుకుని అనేక అవస్థలు పడ్డారు. జాతీయ రహదారిపై అడుగడుగునా ట్రాఫిక్ జామైంది. సాయంత్రం సమయంలో జాతీయ రహదారికి వాహనాల తాకిడి పెరిగింది. హైదరాబాద్‌కు వాహనాలు ఒక్కసారి పెరగడంతో చౌటుప్పల్ పట్టణంలో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. చౌటుప్పల్ సీఐ వెంకటేశ్వర్లు పోలీసు బలగాలతో తంగడపల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సుమారు గంట సేపు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులుతీరకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ వైపునకు 11 టోల్ గేట్లను తెరిచి ఎప్పటికప్పుడు వాహనాలను పంపిస్తున్నారు. రద్దీ పెరిగితే మరిన్ని టోల్‌గేట్లను తెరిచేందుకు ఏర్పాట్లు చేసారు.

కాంగ్రెస్‌లో సీఎల్పీ చిచ్చు..!

ఉత్తమ్‌ను వ్యతిరేకించిన రాజగోపాల్‌రెడ్డి, చిరుమర్తి

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, జనవరి 17: ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు మరోసారి భగ్గుమంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పైకి ఐక్యతగా కనిపించిన జిల్లా కాంగ్రెస్ సీనియర్లు ఎన్నికల్లో పార్టీ ఘోర ఓటమి పిదప పరస్పరం విమర్శల పర్వం తిరిగి ప్రారంభించారు. పీసీసీ చీఫ్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యలు సీఎల్పీ నేత ఎన్నిక భేటీలో మరోసారి ఉత్తమ్ పట్ల తమ వ్యతిరేకతను వెళ్లగక్కారు. సీఎల్పీ నేతగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా పాత బ్యాచ్‌లో ఎవరు వద్దంటూ, పార్టీ పదవుల్లో, సీఎల్పీ పదవుల్లో కొత్త వారికే అవకాశమిస్తేనే పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం పది సీట్లైనా గెలుస్తామంటు చిరుమర్తి బాహాటంగా తన అభిప్రాయాలు వినిపించారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనకు ఈ దఫా సీఎల్పీనేతగా అవకాశమివ్వాలంటూ కోరారు. ఈ పదవి కోసం సీనియర్ ఎమ్మెల్యేలు ఉత్తమ్, భట్టీ విక్రమార్క, సుధీర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, డి.శ్రీధర్‌బాబు, టి.జగ్గారెడ్డిలు రేసులో నిలిచారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజగోపాల్‌రెడ్డి సీఎల్పీ పదవి కోసం గట్టి పట్టు పడుతు పార్టీలోని పలువురు ఎమ్మెల్యేల మద్దతు సైతం కూడగట్టారు. చివరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, సీఎల్పీ ఎన్నిక పరిశీలకులు వేణుగోపాల్‌ల పర్యవేక్షణలో సాగిన సీఎల్పీ సమావేశం వాడివేడిగా సాగింది. దీంతో ఈ సమావేశంలో సీఎల్పీ నేత ఎన్నిక ప్రక్రియ తేల్చకుండానే పార్టీ అధిష్టానానికే సీఎల్పీనేత ఎంపిక బాధ్యత అప్పగించడంతో అధిష్టానం సీఎల్పీనేతగా ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తం మీద సీఎల్పీ ఎన్నిక సందర్భంగా మరోసారి ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు రచ్చకెక్కడంతో ఈ పరిణామాలు స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల తరుణంలో పార్టీకి ఎలాంటి వ్యతిరేక ఫలితాలు అందిస్తుందోనన్న ఆందోళన కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యకమవుతుంది.



చిరుమర్తి..కోమటిరెడ్డి..ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఓటమి భయంతోనే బాబు విమర్శలు

రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, ఎంపీ గుత్తా

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, జనవరి 18: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్.జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణతో టీడీపీ ఓటమి ఖాయమన్న భయంతోనే ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తెలంగాణ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలను విమర్శిస్తున్నారని రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి విమర్శించారు. గురువారం నల్లగొండలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతు జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణంలో భాగంగా కేసీఆర్ ఆదేశాల మేరకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పొరుగు తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిపక్ష వైస్సార్‌సీపీ పార్టీ అధినేత జగన్‌తో చర్చలు జరిపారన్నారు. ఫెడరల్ ఫ్రంట్ దిశగా టీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ పార్టీల చర్చలు సాగితే ఆ రెండు పార్టీల మధ్య పొత్తు అంటు, ఆంధ్ర, తెలంగాణ మోదీల పొత్తు అంటు ఏపీ సీఎం చంద్రబాబు సహా ఆ పార్టీ మంత్రులు, తెలుగు రాష్ట్రాల నాయకులు అవగాహన రాహిత్య విమర్శలు చేస్తున్నారని గుత్తా దుయ్యబట్టారు. ఎన్నికల్లో పొత్తులకు, జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటు చర్చలకు మధ్య తేడా తెలియకుండా టీడీపీ మంత్రులు, నాయకులు తలతోక లేకుండా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీఆర్ఎస్ ఆంధ్రలో, వైఎస్సార్‌సీపీ తెలంగాణలో పోటీ చేసే ప్రశ్నేలేనప్పుడు ఇక రెండు పార్టీల మధ్య పొత్తు ఎలా సాధ్యమవుతుందని గుత్తా ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు సమాన దూరంగా, రాష్ట్రాల హక్కుల సాధన లక్ష్యంగా లౌకికవాద ప్రాంతీయ పార్టీల వేదికగా ఫెడరల్ ఫ్రంట్ నిర్మితమవుతుందని ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం టీడీపీ గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని, నాలుగేళ్లు ప్రధాని మోదీతో కాపురం చేసి ఇప్పుడు మోదీని తిడుతు, తనకు గిట్టని పార్టీలను మోదీకి మద్దతుపలికే పార్టీలంటూ చంద్రబాబు తన రాజకీయ దిగజారుడును చాటుకుంటున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్-టీడీపీల మహాకూటమికి పట్టిన గతే ఏపీలో సైతం టీడీపీ, కాంగ్రెస్‌లకు పడుతుందన్నారు. చంద్రబాబు అవకాశవాద, నీచ రాజకీయాలకు ఈ దఫా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడబోతున్నారన్నారు.

ఏడుపాయల జాతరకు విస్తృత ఏర్పాట్లు

అధికారులతో కలెక్టర్ సమీక్ష

మెదక్, జనవరి 17: ఏడుపాయల వనదుర్గాభవాని జాతర ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన ఏడుపాయల జాతర-2019 నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాట్లను ఆయా శాఖలు సమన్వయం చేసుకోవాలన్నారు. ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం ప్రత్యేకంగా హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. తరచూ ఏడుపాయలకు వచ్చే భక్తుల కోసం నాలుగైదు ప్రాంతాల్లో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం చేయాలన్నారు. వీటికి ఏడాది పొడవునా నీటికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. తగినంత పోలీస్ బందోబస్తు కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

గ్రామపంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

పెద్ద గ్రామపంచాయతీలకు అదనపు సిబ్బంది ★ కలెక్టర్ రోనాల్డ్‌రోస్

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 17: మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే పంచాయతీ ఎన్నికలు పకడ్బంధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రోనాల్డ్‌రోస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులతో ఏర్పాటు చేసి సమావేశంలో కలెక్టర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ పెద్ద గ్రామపంచాయతీకి అదనపు సిబ్బంది ఏర్పాటు చేస్తామని అన్నారు. అంబ్లీ ఎన్నికల తరహాలోనే పంచాయతీ ఎన్నికలు పక్కాగా నిర్వహించాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలయి మధ్యాహ్నం 1గంట వరకు క్లోజ్ అవుతుందని తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. గెలుపొందిన వారికి సర్పంచ్‌గా ధృవీకరణపత్రం అందజేసిన అనంతరం , ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. ప్రతి గ్రామంలో వందశాతం వార్డుమెంబర్స్ ఉంటే రిటర్నింగ్ అధికారులు ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. మొదటి ఫెస్ ఎన్నికలలో పాల్గొనే సిబ్బంది మూడవ ఫెస్ ఎన్నికలలో పాల్గొనాల్సి ఉంటుందని అన్నారు. రెండవ విడత ఎన్నికలకు కొత్తగా ఏర్పాటు చేస్తామన్నారు. 20వ తేదిన ఉదయం 8గంటలకు ఎన్నికల సామాగ్రిని తీసుకుని ఎన్నికల సిబ్బంది బస్సులలో బయలుదేరుటకు పక్కాగా ప్లాను తయారు చేసుకోవాలని అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారి పేర్ల లిస్టు ఎంపిడిఓలకు పంపించాలని అన్నారు. పెద్ద గ్రామపంచాయతీలోపోలింగ్ ఏటషన్ వారిగా ఓటర్లు 200 కంటే ఎక్కువగా ఉంటే అదనపు కౌంటింగ్ స్టాఫ్ కింద నాలుగు టేబుల్స్ అరెంజ్ చేయాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ మొదలు పెట్టేటప్పుడు సర్పంచ్‌లని, వార్డు మెంబర్స్‌ల ఓట్లు విడివిడిగా ఏసి 2-3టేబుల్స్ కలిపి 25 బెండల్స్ చేసి ముందుగా వార్డు మెంబర్‌లని లెక్కింపు చేసిన తర్వాతనే సర్పంచ్‌ల ఓట్లు లెక్కించాలని అన్నారు. అయిన తర్వాత సింబల్ అలాట్‌మెంట్ ఉంటుందని అన్నారు. నామినేషన్స్, స్క్రూటిని అంతా అసెంబ్లీ ఎన్నికల ప్రకారమే చేయాలన్నారు. స్పెషల్ అధికారులు ప్రతిరోజు రిపోర్టు ఇవ్వాలని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట్రావ్, డిఆర్‌ఓ స్వర్ణలత, ఆర్డిఓలు శ్రీనివాసులు, సిహెచ్ శ్రీనివాసులు, డిపిఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జింకను బలిగొన్న వేటగాళ్లు

కొల్లాపూర్, జనవరి 17: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిల అడవులలో జింకను వేటాడినట్లు సమాచారం రావడంతో అటవీశాఖాధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి జంతువుల వేటగాడైన బోయ శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. అటవీశాఖ క్షేత్రాధికారి మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం. సోమశిల మర్లబావి సమీపంలో ఈతవనంలో జింకను వేటాడినట్లు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఇవ్వగా తన సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లినట్లు అక్కడ సోమశిలకు చెందిన బోయ శ్రీనివాసులు మాంసాన్ని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టుకొని తీసుకొని పోతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతమంతా రక్తంతో పాటు జంతువు వెంట్రులతో ఉందని చుట్టు ఉర్లుతో కంచె ఉందని తెలిపారు. నిందితుడైన బోయ శ్రీనివాసులుతోపాటు ఆయన వద్ద ఉన్న మాంసం కవర్‌ను స్వాదీనం చేసుకొని కొల్లాపూర్ రెంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. మాంసాన్ని పశు సంవర్ధక శాఖ వైద్యశాలకు పరీక్షల నిమిత్తం తీసుకొని పోగా అక్కడ డాక్టర్లు లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. నిందితుడైన బోయ శ్రీనివాసులు విలేఖరులతో మాట్లాడుతూ తాను వేటాడింది కొండగొర్రె అని, చుక్కల దుప్పి అని పెర్కొన్నారు. తాను ఒక్కడే ఉర్లు వేసి దానిని వేటాడినట్లు తెలిపారు. నిందితుడివెంట ఐదుకిలోల మాంసం పట్టుబడింది. మిగతా మాంసం ఎక్కడికి పోయింది, ఎంత మంది నిందితులు ఉన్నారనే దానిపై సరైన సమాధానం రావడంలేదు. ప్రజలేమో కృష్ణ జింకను వేటాడినారని అనుకుంటున్నారు.

మొత్తానికి వణ్యప్రాణి ఏదో గుర్తించి అసలైన వేటగాళ్లను శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.ఇది ఇలా ఉంటే కేసును ఎలాగైనా నీరుగార్చాలని కొంతమంది నాయకులు ప్రయత్నిస్తున్నారు.

తిరుగులేని శక్తిగా టీఆర్ఎస్

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు



తనను కలిసిన టీఆర్ఎస్ నేతలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

గజ్వేల్, జనవరి 17: రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా టీఆర్ఎస్‌ను సీఎం కేసీఆర్ తీర్చిదిద్దగా, మెజార్టీ గ్రామపంచాయతీలలో టీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్‌లే ఏకగ్రీవమవుతున్నట్లు మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు స్పష్టం చేశారు. గురువారం వర్గల్ మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు దేవగనిక నాగరాజు నేతృత్వంలో పార్టీ శ్రేణులు హరీష్‌రావును కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జరిగిన ప్రతిఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తుండగా, 90 శాతం పంచాయతీలలో టీఆర్ఎస్ సత్తా చాటుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పార్టీ పటిష్టతను దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలు ఐఖ్యమత్యంగా ఉంటూ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని, అలాగే టీఆర్ఎస్ సర్కార్ అమలు చేసిన వివిద సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెల్లి చైతన్యం చేయాలని సూచించారు.

అంతేగాకుండా త్వరలో జరగనున్న ఎంపీ, మున్సిపల్, ఎంపీటీసీ, సహకార ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలని కోరారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
శుక్రవారం, 18 జనవరి 2019

'నిష్క్రమణ' నీడ..

ఐరోపా సమాఖ్య నుంచి 'బ్రిటన్ నిష్క్రమణ'- బ్రెక్జిట్- ప్రహసనం ప్రకంపనలను సృష్టిస్తోంది. ఈ వాణిజ్య, రాజకీయ ప్రకంపనలు ఇరవై తొమ్మిది దేశాల 'ఐరోపా సమాఖ్య'- యూరోపియన్ యూనియన్ -ఇయు- పరిధిని దాటి అంతర్జాతీయ సీమలలో హోరెత్తుతుండడం నడుస్తున్న చరిత్ర. బ్రిటన్ ప్రధాని, అధికార 'కన్సర్వేటివ్ పార్టీ' నాయకురాలు థెరిసా మేయ్‌కు ఎదురౌతున్న వైఫల్య పరంపర ఈ నడుస్తున్న చరిత్రలోని ప్రధాన వైపరీత్యం. బ్రిటన్ పార్లమెంటు 'సామాన్యుల సభ'లో బుధవారం రాత్రి ఆమె సభ్యుల విశ్వాసం పొందడం మాత్రమే ఈ పరాజయ పరంపరకు అపవాదం- ఎక్సెప్షన్-! మంగళవారం నాడు సామాన్యుల సభ- హౌస్ ఆఫ్ కామన్స్- మన లోక్‌సభ వంటిది-లో నిష్క్రమణ ఒప్పందాన్ని ఘోరంగా తిరస్కరించడం థెరిసా మేయ్‌కు తగిలిన తీవ్రమైన ఎదురుదెబ్బ. ఈ ఒప్పందాన్ని బ్రిటన్ ప్రభుత్వం ఐరోపా సమాఖ్యతో కుదుర్చుకుంది. దాదాపు మూడేళ్ల క్రితం బ్రిటన్‌లో జరిగిన 'జనవాక్య సేకరణ- రెఫరెండమ్- లో వెలువడిన ఫలితం మేరకు బ్రిటన్ రానున్న మార్చి ఇరవై తొమ్మిదవ తేదీలోగా 'ఐరోపా సమాఖ్య' నుంచి నిష్క్రమించాల్సి ఉంది. 'నిష్క్రమణ' తరువాత బ్రిటన్‌కూ మిగిలిన ఐరోపా సమాఖ్య దేశాలకు మధ్య కొనసాగవలసిన దౌత్య, వాణిజ్య, రాజకీయ, ప్రజా సంబంధాల గురించి 'మేయమ్మ' ప్రభుత్వం 'సమాఖ్య'తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని 'సామాన్యుల సభ' ప్రతినిధులు తిరస్కరించారు. థెరిసా సొంత పార్టీకి చెందిన అనేకమంది సభ్యులు ఆమె ప్రతిపాదనలను తిరస్కరించారు. సామాన్యుల సభలో అధికార కన్సర్వేటివ్ పార్టీకి మూడువందల పద్నాలుగు మంది సభ్యులుండగా, నూట పద్దెనిమిది మంది 'నిష్క్రమణపై కుదిరిన ఒప్పందాన్ని తిరస్కరించారు! ప్రధాన ప్రతిపక్షమైన లేబర్ పార్టీలో సైతం 'నిష్క్రమణ' ఒప్పందంపై ఏకాభిప్రాయం వ్యక్తం కాలేదు. ఫలితంగా 'ఒప్పందానికి అనుకూలంగా రెండువందల ఇద్దరు, వ్యతిరేకంగా నాలుగు వందల ముప్పయి ఇద్దరు సభ్యులు వోటు వేశారు. 'ఒప్పందం' ధ్రువీకరణ- రాటిఫికేషన్-కు నోచుకోకపోవడంతో ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్- ఎలాంటి ద్వైపాక్షిక అంగీకారం కుదరకుండానే- నిష్క్రమించవలసిన దుస్థితి ఏర్పడింది. తాను ప్రతిపాదించిన ఒప్పందం 'సభ' తిరస్కరణకు గురైన వెంటనే థెరిసా ప్రధాని పదవికి రాజీనామా చేసి ఉండాలి. అలా చేసి ఉండినట్టయితే గతంలో 'నిష్క్రమణ' వివాదం ప్రాతిపదికగా పదవి నుంచి తప్పుకున్న మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్ వలె ఈమె కూడా 'చారిత్రక గరిమ'ను గడించి ఉండేది. ప్రధాన ప్రతిపక్షం 'లేబర్ పార్టీ' నాయకుడు జెరిమీ కోర్బిన్ ప్రధాని పదవి నుంచి మేయ్ రాజీనామా చేయాలని సూచించాడు కూడా! ఆమె తప్పుకోలేదు. ప్రతిపక్షం వారు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించవచ్చునని ఆమె సూచించింది. కోర్బిన్ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మూడువందల ఆరుగురు తీర్మానాన్ని సమర్థించగా మూడువందల ఇరవై ఐదు మంది థెరిసా మేయ్ ప్రభుత్వాన్ని సమర్థించారు! అందువల్ల ఆమెకు గండం గడిచింది..

గండం గడిచినప్పటికీ థెరిసా మేయ్ విధాన వైఫల్యం 'గొప్పగా గోచరిస్తోంది!'. ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ నిష్క్రమణ తప్పదు. కానీ నిష్క్రమణ 'తీరు'కు, 'నిష్క్రమణ' తరువాతి పరిణామాలకు సంబంధించి ఆమె సమాఖ్యతో కుదుర్చుకున్న ఒప్పందం మాత్రం 'జాతీయ వైపరీత్యం'అని ప్రతిపక్ష నాయకుడు జెరిమీ కోర్బిన్ వ్యాఖ్యానించడం ప్రస్ఫుటిస్తున్న 'ఐరోపా అంతర్గత వైరుధ్యానికి' నిదర్శనం. ఐరోపా సమాఖ్యలో పెరుగుతున్న విభేదాలు,వైరుధ్యాలు 'ప్రపంచీకరణ'- గ్లోబలైజేషన్-వల్ల పుట్టలు పగిలిన వాణిజ్య వైపరీత్యాలకు ప్రతిబింబాలు. అందువల్ల 'మేయమ్మ' రచించిన నిష్క్రమణ ఒప్పందం నీరుకారిపోవడం కేవలం వైయక్తిక వైఫల్యం కాదు, బ్రిటన్ జాతీయ వైఫల్యం.. 'సమాఖ్య' వైరుధ్యాలకు ప్రతిబింబం. 'సమాఖ్య'లోని బీటలు 'ప్రపంచీకరణ' కుడ్యాలకు ఏర్పడిన ఛిద్రాలకు ప్రతిరూపాలు.. సమాఖ్య నుంచి బ్రిటన్ వైదొలగుతుండడానికి పూర్వరంగం బ్రిటన్‌లో కొనసాగుతున్న అంతఃకలహం! 2014 సెప్టెంబర్‌లో బ్రిటన్ నుండి విడిపోయి ప్రత్యేక దేశంగా ఏర్పడాలని 'స్కాట్‌లాండ్' ప్రజలు యత్నించారు. స్కాట్‌లాండ్‌లో జరిగిన జనాభిప్రాయ సేకరణలో యాబయి ఐదు శాతం ప్రజలు తమ ప్రాంతం బ్రిటన్‌లోనే ఉండాలని కోరడంతో ఆ 'విభజన' ప్రమాదం తృటిలో తప్పింది. దేశాలను, ఖండాలను విభజించి 'దొంగలు ఊళ్లను పంచుకున్నట్టు' కొల్లగొట్టిన దోపిడీ చరిత్ర బ్రిటన్, ఫ్రాన్స్ తదితర ఐరోపా దేశాలది. ఆ చరిత్ర ఇప్పుడు 'ఐరోపా సమాఖ్య'లోను బ్రిటన్‌లోను స్పెయిన్‌లోను, ఐరోపా దేశాలలోను ''పునరావృత్తం'' అవుతుండడం కాలమహిమ! 'సమాఖ్య' నుంచి విడిపోవాలని బ్రిటన్ ప్రజలు నిర్ణయించిన తరువాత స్కాట్‌లాండ్‌లో 'స్వాతంత్య్ర ఉద్యమం' పుంజుకొంది. స్కాట్‌లాండ్ ప్రజలు మరోసారి 'అభిప్రాయ సేకరణ' జరగాలని ఉద్యమిస్తున్నారు..

'ఐరోపా సమాఖ్య' నుంచి విడిపోవాలని 2016 జూన్ 23న జరిగిన 'అభిప్రాయ సేకరణ'లో బ్రిటన్ ప్రజలు నిర్ణయించారు. 'యాబయి రెండు శాతం' ప్రజలు నిష్క్రమణను కోరగా నలబయి రెండు శాతం సమాఖ్య భాగస్వామ్యాన్ని కొనసాగించాలని కోరారు. అప్పటి బ్రిటన్ ప్రధాని, కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు డేవిడ్ కామెరాన్ 'నిష్క్రమణ'ను వ్యతిరేకించాడు. తన విధానం వీగిపోయినందుకు 'ప్రతి క్రియ'గా ఆయన ప్రధానమంత్రి పదవి నుంచి తప్పుకున్నాడు. నిజానికి ఆ 'జనాభిప్రాయం' ప్రాతిపదికగా కామెరాన్ తన పదవికి రాజీనామా చేయవలసిన పనిలేదు. కానీ పదవి కంటె 'జాతీయ హితం' తనకు ప్రధానమని కామెరాన్ చాటగలిగాడు, ప్రధానమంత్రి పదవి నుంచి మాత్రమే కాక, రాజకీయాల నుంచి నిష్క్రమించడం ద్వారా తన రాజకీయ నైతిక నిష్ఠను నిలబెట్టుకున్నాడు. అంతకు పూర్వం 1970వ దశకం చివరిలోను, 1980వ దశకంలోను కన్సర్వేటివ్ పార్టీలో తిరుగులేని నాయకురాలిగా చెలామణి అయిన మార్గరెట్ థాచర్ కూడ అర్థాంతరంగా ప్రధాని పదవికి రాజనామా చేసింది.. అందుకు కారణం 'పరాజయం' కాదు, తన విధానాలకు విఘాతం కలుగుతోందని ఆమె భావించడం! మేయ్ కూడ 'నిష్క్రమణ' ఒప్పందం వీడిపోయిన తరువాత ''నిష్క్రమించి'' ఉండనట్టయితే ఈ 'పరంపర' నిలబడి ఉండేది. కానీ 'పదవిని పట్టుకుని వేళ్లాడడం'అన్న సామెతకు మేయ్ గత రెండేళ్లుగా ప్రతిరూపంగా మారి ఉంది..

అంతర్జాతీయ సమాజాన్ని బ్రిటన్ తదితర ఐరోపా దేశాలు దాదాపు నాలుగు శతాబ్దులపాటు దోపిడీ చేయడం చరిత్ర. ఐరోపా దేశాల 'శక్తి' దుర్మార్గుడి చేతిలోని 'కత్తి'వలె ఈ నాలుగు శతాబ్దులపాటు పనిచేసింది. ఇంగ్లాండు, వేల్స్, స్కాట్‌లాండ్ కలిసి 'గ్రేట్ బ్రిటన్'గాను, 'బ్రిటన్' ఉత్తర 'ఐర్‌లాండ్' కలసి 'ఐక్య రాజ్యం'- యునైటెడ్ కింగ్‌డమ్- యుకె గాను అవతరించడం సమాంతర పరిణామం. బ్రిటన్, పోర్చుగల్, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలవారు ఐరోపానుంచి 'ఓడ దొంగలు'గా మారి వివిధ దేశాల వాణిజ్య నౌకలను కొల్లగొట్టడం క్రీస్తు శకం పదహారవ శతాబ్ది వరకు నడచిన చరిత్ర. అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాలలోని అనాది జాతులను 'తుపాకుల బలం'తో మూక ఉమ్మడిగా హత్యచేసిన చరిత్ర బ్రిటన్‌ది. ఈ 'ఐరోపా దేశాలు' ఇతర ఖండాలను పంచుకొని కొల్లగొట్టడం చరిత్ర. ఈ పంపిణీలో పైచేయి సాధించిన 'బ్రిటన్' ప్రపంచంలో రవి అస్తమించని సామ్రాజ్యాన్ని స్థాపించగలిగింది. 'ఐరోపా హితం ప్రపంచ హితంగా' ''ఐరోపా వారి స్నానం చేయని నాగరికత ప్రపంచ సంస్కృతి'గా విపరిణామం చెందడం ఈ సామ్రాజ్య విస్తరణ కథ.. ఐరోపా దేశాల మధ్య సాగిన పోరాటాలు, ఆధిపత్య సంఘర్షణలు 'రెండు ప్రపంచ యుద్ధాలు'గా పేరుమోయడం చరిత్ర! ఇలా ప్రపంచాన్ని దోపిడీ చేసి శతాబ్దులపాటు తెగ బలిసిన 'బ్రిటన్'కు ఇప్పుడు 'దోపిడీకి గురికాగలనన్న' భయం పట్టుకుంది. ''విధాత అక్కటా! ఎవ్వరినెట్లు సేయడు..?' అన్నది మహాకవి మాట.. ఈ భయం 'బ్రిటన్ ఐరోపా' హంతక సంతతి అయిన అమెరికాను సైతం పట్టుకొనడం నడుస్తున్న చరిత్ర. అందువల్ల ఐరోపాలోని ఇతర దేశాల ప్రజలు తమ దేశానికి వచ్చి స్థిరపడిపోతారని, తమ వాణిజ్యం, పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థ బలహీనమైపోతుందని బ్రిటన్ సమాజం భయపడుతోంది! అందువల్లనే సమాఖ్య నుంచి ఈ 'నిష్క్రమణ'.. కానీ ద్వైపాక్షిక అంగీకారం కుదరకపోతే ఐరోపాలోని ఇతర దేశాలవారు బ్రిటన్‌లోకి రావడానికి 'వీసా'లు తీసుకోవలసి వస్తుంది. బ్రిటన్ పౌరులు కూడ ఐరోపాలోని ఇతర దేశాలకు వెళ్లాలంటే మళ్లీ ఆంక్షలు తప్పవు! విస్తరించిన 'శక్తి' కుంచించుకొనిపోతోంది..

వృత్తివిద్యలో కోర్సును ఎన్నుకునే విధానం

ప్రపంచంలోనే అమెరికా వైద్యవిద్యకు చాలా పటిష్టమైనదని కీర్తి వచ్చింది. అలా ఎలా వచ్చింది? ఈ ప్రశ్నకు ఏ మాత్రం విచారించకుండానే- వైద్య విద్యను కోరుకునే పిల్లల శ్రమే దీనికి కారణం అని చెప్పాలి. వైద్య విద్యను కోరే పిల్లలు నాలుగు దశల్లో పరీక్షలు ఎదుర్కోవలసి వస్తుంది. అవి.. 1. సాట్ స్కూల్ 2. స్కూలులో విద్యార్థి రికార్డు 3. వేసవిలో విద్యార్థి చేసే ఇంటర్న్‌షిప్ చేసిన విధానం, 4. విద్యార్థుల సామాజిక స్పృహ.

పైన చెప్పిన దాంట్లో ఇంటెర్న్‌షిప్ ప్రభావం అత్యంత కీలకమట! చాలా మంది విద్యార్థులు స్కూల్ సెలవుల్లోనే ఏ దవాఖానాలోనో సేవ చేస్తారు లేదా ఏ వృద్ధాశ్రమంలోనో పనిచేస్తారు. ఏ ఫార్మసీలోనో, కంపెనీల్లోనో పనిచేసి ఉంటారు. ఈ నేపథ్యం విద్యార్థి మెంటల్ మేకప్‌కు తోడ్పడుతుంది. హాస్పిటల్‌లో పనిచేస్తే లాభమేమిటి? విద్యార్థులు రోగి మానసిక స్థితితో మమేకమౌతారు. అది గొప్ప ప్రతిభ. రోగిపై సహానుభూతివేరు. రోగి బాధను పంచుకోవటం వేరు. అది 'సింపతీ' కాదు.. అది 'ఎంపతీ'. అంటే రోగి బాధను పంచుకోవటం.

ఆ రోగానికి సంబంధించిన అంశాలను విచారిస్తే రోగికి కొంత సంతృప్తి కలుగుతుంది. రోగంలో వివిధ దశలుంటాయి. ఒక్కొక్క దశ రోగి మానసిక స్థితిపైన ప్రభావం చూపిస్తుంది. వైద్యంలో అభిరుచి ఉన్నవాడే గుచ్చిగుచ్చి ప్రశ్నలు అడుగుతాడు. రోగిపై విద్యార్థులు చూపే ఈ పరామర్శ ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. రోగానికి సంబంధించి, రోగి అనుభవించే సమస్యలను విద్యార్థి క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటాడు. రోగి నుంచి ఈ సమాచారాన్నంతా తీసుకుంటే ఆ విద్యార్థిపై రోగికి విశ్వాసం కలుగుతుంది. రోగం పూర్వ చరిత్రను ఈ



విధంగా ప్రాక్టికల్‌గా అధ్యయనం చేస్తారు. కాబట్టి రోగికి ధైర్యాన్ని కలిగిస్తారు. ఈ జ్ఞానం, వైద్య విద్య చదువుతున్నప్పుడు విద్యార్థులు చూపే ఆసక్తి అమెరికా వైద్య విద్యకు బలం. దీనివల్ల విద్యార్థికి ఇది ఇష్టమైన చదువుగా మారుతుంది. ఇలాంటి నేపథ్యం ఉండడంతో వైద్య విద్య చాలా ప్రతిష్టగలది అయ్యింది. ప్రాథమిక విషయాలు పిల్లలకు తెలిసి ఉంటాయి కాబట్టి ఆ చదువు పరిశోధనకు ఉపయోగపడుతుంది.

ఇంటర్న్‌షిప్ ద్వారా, టెస్ట్‌మోనియల్స్ ద్వారా ఆ విద్యార్థి కెరీర్ నిర్ధారణ జరుగుతుంది. సామాజిక దృక్పథంలో వైద్య వృత్తిలోకి విద్యార్థి వస్తాడు. దేశంలో ఏ రోగాలున్నాయో, వాటివల్ల ఆర్థిక వ్యవస్థకు జరిగే నష్టాల గురించి చెబుతాడు. యాక్సిడెంట్ల వల్ల వచ్చే నష్టం గురించి, ఆ ప్రభావాన్ని అంచనా వేస్తాడు. ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఏయే రోగాలున్నాయో? చెప్పగలుగుతాడు. ఇంటెర్న్‌షిప్ అన్నది వైద్య విద్యకే ఊపిరి. అదే ఆక్సిజన్. కాబట్టి ఇష్టమున్న వారికి చదువు చెప్పటం అధ్యాపకులకు సులభమైపోతుంది. విద్యార్థి ఎన్నడు తరగతులకు గైర్హాజరు కాడు. వైద్య విద్యలో పరిశోధన బాగా జరుగుతుంది. వైద్య కళాశాలకు పరిశోధన వల్లనే పేరుప్రతిష్ఠలు వస్తాయి.

విద్యార్థులు చేసే ఇంటెర్న్‌షిప్‌నే వైద్య కళాశాలకు బలం. అదే విధంగా ఇంజనీరింగ్ చదివే పిల్లలు ఏదో ఒక ఫ్యాక్టరీలో పనిచేసి వస్తారు. అలా చేయటం వల్ల కార్మికుల మనస్తత్వం తెలుస్తుంది. ఫ్యాక్టరీలో పనిచేసే వారు ప్రత్యేక దుస్తులు వేసుకుంటారు. వృత్తి కళాశాలల ప్రవేశంలో విద్యార్థి నేపథ్యం ఇంటర్న్‌షిప్‌లో బయట పడుతుంది.

(నా మనుమలు అభిజిత్, ఆనంద్‌లతో మాట్లాడాక)

★★★

జ్ఞానానికి సేంద్రియత...

ఉపాధ్యాయుడు చెప్పే పాఠాలను విద్యార్థులు మేధోమథనం చేస్తారు. నేను నెల రోజుల క్రితం తరగతి గదిలో పైథాగరస్ సిద్ధాంతానికి ఒక రకమైన నిరూపణ ఇచ్చాను. కానీ ఈనాడు తరగతి గదిలో ఉన్న తెలివిగల విద్యార్థి ఆ పాఠాన్ని ఆధారం చేసుకుని అదే పైథాగరస్ సిద్ధాంతానికి మరొక నిరూపణ ఇచ్చాడు. మేధోపరమైన కార్యక్రమం కొత్త మేధస్సును ఉత్పత్తి చేస్తుంది. చెట్టు పెరిగిన కొద్దీ కొత్త మొలకలొస్తాయి. అదే మాదిరిగా జ్ఞానానికి కూడా సేంద్రియ (ఆర్గానిక్) లక్షణం ఉంటుంది. ప్రతిజ్ఞానం కొత్త జ్ఞానాన్ని సృష్టిస్తుంది. మనం ఒక పాఠాన్ని వచనంలో చెబితే అదే జ్ఞానాన్ని విద్యార్థి పద్యంలో చెబుతాడు. లేక కథాపూర్వకంగా చెబుతాడు. ఇది తెలివిగల పిల్లల మేధోపరమైన లక్షణం. మార్క్స్ 150 సంవత్సరాల క్రితం చెప్పిన సిద్ధాంతాన్ని ఎంతోమంది ఈనాడు సమీక్ష చేస్తూ పునర్విమర్శిస్తున్నారు కదా! ఒక పెట్టుబడి నుంచి 21వ శతాబ్దం వచ్చేసరికి 10 క్యాపిటల్స్ పుట్టాయి. ద్రవ్యానికి సేంద్రియ లక్షణం ఉందని మార్క్స్ చెప్పాడు. జ్ఞానం జ్ఞానాన్ని కూడా సృష్టిస్తుంది. అది తరగతి గదిలో చురుకైన విద్యార్థి చేసే పని. జ్ఞానం నిశ్చలమైనది కాదు. జ్ఞానం పెరగటానికి కారణమది. అందుకు కొత్త మేధస్సే కారణం. ఉపాధ్యాయుడు నిప్పురవ్వలను సృష్టిస్తే విద్యార్థి దాన్ని జ్వాలగా మార్చుతాడు. అది తరగతి గది మేధస్సు లక్షణం. కాబట్టే కొన్ని స్కూళ్లు జ్ఞాన ఉత్పత్తి కేంద్రాలవుతాయి.

మూల్యాంకనం ఒక వంతెన...

ఉపాధ్యాయుడు కేవలం పిల్లలనే మూల్యాంకనం చేయడు. తన బోధనను కూడా మూల్యాంకనం చేసుకోవాలి. తాను పాఠం చెబుతున్నప్పుడు విషయ సంగ్రహణను ఏ పుస్తకాల నుంచి తీసుకున్నాడో బేరీజు వేసుకోవాలి. కేవలం ప్రభుత్వం ఇచ్చిన పాఠ్య పుస్తకాలను చదివితే సరిపోతుందా? లేక వేరే ఏమైనా పుస్తకాలు దానికి సంబంధించినవి చదవాల్సిన అవసరం ఉందా? అని ఎసెస్‌మెంట్ చేసుకోవలసిన అవసరం ఉంది. ఇతర పుస్తకాలు చదవాల్సిన అవసరం ఉన్నదా? అని ఆలోచించుకునే సదావకాశం అది. తన టీచింగ్‌లో ఏమైనా తప్పులు దొర్లాయా? దాన్ని కూడా సరిచేసుకోవాలి. మొత్తం మీద తన టీచింగ్‌ను మార్చుకోవాలా? ఎలా కొనసాగించాలి? అన్న దానిపై ఉపాధ్యాయుడు తనకు తాను మూల్యాంకనం చేసుకోవాలి. ప్రతి మూల్యాంకనం ఒక వంతెన లాంటిది. దీన్ని ఎంతగా సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు అంతగా ఎదుగుతారు. తనను తాను సంస్కరించుకునే అవకాశం టీచర్‌కు లభిస్తుంది. మార్కులు వేసి సంతోషపడితే విద్యార్థులు జ్ఞాన ప్రవాహంలో కొట్టుకుపోతారు. కాబట్టి అసెస్‌మెంట్ లెర్నింగ్‌కు ఎంత ముఖ్యమో టీచింగ్‌కు కూడా అంతే ముఖ్యం.

-చుక్కా రామయ్య

'చక్రం తిప్పే నేతకు' చిక్కులు..!

భాస్కరవాణి
bhaskarayogi.p@gmail.com

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు మరణించడానికి పదిరోజుల ముందు కొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చివరి రోజుల్లో తాను విడుదల చేసిన ఓ క్యాసెట్టుకు 'జామాతా దశమగ్రహం' అని పేరు కూడా పెట్టారు. మరణించడానికి కొన్ని రోజుల ముందు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో- '1994 ఎన్నికల ముందే కొంతమంది కాంగ్రెస్ నాయకులతో చంద్రబాబు సంప్రదింపులు జరపడమేగాక, మా పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసిన చాలామందికి డబ్బు పంపిణీ చేశారు.. తెలుగుదేశం పార్టీకి 140 మేరకు మాత్రమే సీట్లు లభిస్తే తనవర్గం ఎమ్మెల్యేలతో పార్టీనుండి బయటపడి కాంగ్రెస్‌తో చేతులు కలిపి ముఖ్యమంత్రి పదవిని బేరమాడి సాధించాలనేదే అతని ఉద్దేశమని తర్వాత తెలిసింది' అన్నారు. ఆరోపణల్లా కాకుండా ఎన్టీఆర్ ఏకపక్షంగా చెప్పిన మాటలివి. ఈరోజు తెదేపా అధినేత అయిన చంద్రబాబు, ఎన్టీఆర్ వారసులమని పూటకు వందసార్లు చెప్పే బాలకృష్ణ, లోకేశ్ కూడా ఎన్టీఆర్‌ను- నటనా కౌశలంలోగాని, రాజకీయ చాతుర్యంలోగాని గొప్పగా పొగిడేస్తుంటారు. ఎన్టీఆర్ గొప్పవాడా? ఆయన చెప్పిన మాటలు గొప్పవా? అన్నది ఈ వీరవిధేయులు ఇప్పుడు తేల్చాలి.

ఆనాటి నుండి అధికారం కోసం తన మాతృసంస్థ అయిన కాంగ్రెస్‌తో కలవాలని చంద్రబాబు పడ్డ తపనను ఎన్టీఆర్ చివరి రోజుల్లో చెప్పారు. కానీ, ఇటీవల మోదీ పుణ్యాన చంద్రబాబు కాంగ్రెస్ పంచన చేరడం జరిగిపోయింది. గత ఏడాది ఫిబ్రవరి నుండి 'కేంద్రంపై యుద్ధం' పేరుతో చంద్రబాబు ప్రతిరోజూ నరేంద్ర మోదీని తన అనుచర గణంతో తిట్టిస్తున్నాడు, తిడుతున్నాడు. లేని శత్రువుతో యుద్ధం చేయడం చంద్రబాబుకు ఆదినుండి అలవాటే. ఒకప్పుడు లక్ష్మీపార్వతి అనే లేని శత్రువుపై యుద్ధం చేసి విజయం సాధించాడు. తనకు అపుడు అవసరమైన ఆయుధాలుగా దగ్గుబాటిని, హరికృష్ణను ఉపయోగించుకున్నాడు. తనకు ఇష్టం లేనివాళ్లను ఎలా బయటకు పంపాలో, తనకు ఇష్టమైన వాళ్లను ఎలా దగ్గరకు తీసుకోవాలో ఆయనకు బాగా తెలుసు. ఉపేంద్ర, జానారెడ్డి, చింతా మోహన్, నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముద్రగడ పద్మనాభం, దగ్గుబాటి, హరికృష్ణ వంటి హేమాహేమీలను పొమ్మనకుండా ఆయన ఎలా పొగబెట్టించాడో తెలుగుదేశం పార్టీ చరిత్ర చదివితే ఎవరికైనా తెలుస్తుంది. సరిగ్గా ఇన్నేళ్లకు ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి బలంలేని భాజపాను, మోదీని విలన్లుగా చూపిస్తూ ఆంధ్ర ప్రజల మనస్సుల్లో విద్వేషం నింపాడు.

ఇటీవల తెలంగాణ ఎన్నికల సమయానికి అది పరిపక్వత పొందిన బాబు కాంగ్రెస్‌తో జతగట్టాడు. కర్నాటక ఎన్నికల తర్వాత భారత రాజకీయాలకు తానే దిక్సూచినని, అన్ని పార్టీలనూ తానే ఒకే వేదికపైకి తెచ్చానని చెప్పాడు. నిజానికి బాబుతో కలవడం కాంగ్రెస్‌కు ఇష్టం వుందో లేదో కొన్నాళ్లయితే వీహెచ్ లాంటి నేతలు ఎలాగూ చెబుతారు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినా ఒక్క ఛత్తీస్‌గఢ్‌లో తప్ప మిగతా రెండు రాష్ట్రాల్లో దినదినగండం నూరేళ్ల ఆయుష్షులా ఉంది. ఇక మరోవైపు బిఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండ్లతో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రులకు నిద్రపట్టడం లేదు. ఇక ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ,బిఎస్పీ కూటమిగా ఏర్పడి కాంగ్రెస్‌ను దూరం పెట్టినా వినయంగా రాహుల్ గాంధీ వారి పొత్తును స్వాగతించాడు తప్ప ఒక్క మాట మాట్లాడలేని స్థితి నెలకొంది. లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో తేజస్వీ, బెంగాల్‌లో మమత కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లిస్తారో చూడాలి. తెలంగాణలో కాంగ్రెస్ ఓటమికి పరోక్షంగా బాబు కారణమైనా, ఆంధ్రాలో కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు ఇస్తాడో తెలిస్తే ఆ రెండు పార్టీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఎంతటిదో తెలిసిపోతుంది.

చంద్రబాబు రాజకీయ పాఠశాలలో పిహెచ్‌డి చేసిన కేసీఆర్ కనుమ రోజున కేటీఆర్‌ను వైకాపా అధినేత జగన్ దగ్గరకు పంపి చర్చలకు తెరతీయడంతో రేపటి తెలుగు రాజకీయాలు ఎలా వుంటాయో వేచి చూడాల్సిందే. గత పది నెలలుగా మోదీ, కేసీఆర్, జగన్, పవన్ అంటూ రోజూ ఒకే పల్లవితో పాట పాడితే కొంత భాగానికి తథాస్తు దేవతలు ఆశీర్వాదం ఇచ్చారు. ఇదంతా చంద్రబాబుకు అసహనం, అశుభాన్నే కలిగించేవే.

లేని శత్రువులతో యుద్ధం చేసిన ప్రతిసారీ బాబుదే విజయం. కానీ వై.ఎస్., కేసీఆర్, మోదీలను అలాంటి దృష్టితో చూడకూడదు. గతంలో వైఎస్ చంద్రబాబును పదేళ్లు అధికారానికి దూరం పెట్టాడు. ఆ సమయంలో కేసీఆర్ కూడా పరోక్షంగా, ప్రత్యక్షంగా చంద్రబాబును అధికారం నుండి దూరం పెట్టేందుకు వ్యూహం చేశాడు. తెలంగాణ వచ్చాక కేసీఆర్‌కు తన చుట్టూ ఉన్నవాళ్ళలో కన్పించిన మొదటి శత్రువు చంద్రబాబే. దానితో తెలివిగా 'ఓటుకు నోటు కేసు'ను బాగా ఉపయోగించుకోవడమే గాక చంద్రబాబు ఛాయలు తెలంగాణ ప్రజలపై ఉండకూడదని సిద్ధాంతపరమైన వ్యూహంతో దెబ్బగొట్టాడు. ప్రభుత్వ పనితీరు, పరిపాలనా దక్షత చంద్రబాబు స్వంతం కాదని నిరూపించే ప్రయత్నమే మొన్నటి తెలంగాణ ఎన్నికల ఫలితాలు.

ఈ క్రమంలో గుణాత్మక మార్పుతో దేశాన్ని ఏకం చేస్తానంటున్న కేసీఆర్ రాజకీయ రణనీతి చంద్రబాబు అవునన్నా కాదన్నా ఆయనను నిలువరించడమే. ఈ పరిణామాలను ముందే ఊహించిన బాబు సహనం కోల్పోయి మోదీని అకారణంగా తిట్టడం మొదలుపెట్టాడు. కల్లు త్రాగించిన కోతికి నిప్పు తొక్కించి దయ్యం పట్టినట్లు, తేలు కరిచినట్లు ప్రధాన స్రవంతి తెలుగు మీడియాను మోదీపైకి ఉసిగొల్పాడు. తెలుగు జాతి పేరుతో, ఉత్తర - దక్షిణ వాదం పేరుతో, సమాఖ్య స్ఫూర్తి పేరుతో రోజూ అడ్డగోలు వాదనలు చేస్తున్న ఓ వర్గం మీడియా ఇప్పటికైనా దీనికి తెరదించకపోతే విద్వేషాలు పెరిగే అవకాశం ఉంది.

కేంద్ర మంత్రులుగా పనిచేసినపుడు లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్‌లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని రైల్వే ప్రాజెక్టులు ఇచ్చారో చెప్పి సమాఖ్య స్ఫూర్తి గురించి బాబు మాట్లాడితే మంచిది. బాబ్లీ ప్రాజెక్టు, అల్మట్టి ప్రాజెక్టుల ఎత్తు పెంచి దిగువకు నీళ్లురాకుండా చేసిన మహారాష్ట్ర, కర్నాటక నాయకుల చేత క్షమాపణ చెప్పించి ఫెడరల్ స్ఫూర్తి గురించి మాట్లాడాలి. ఐటీ మాత్రమే అన్నం పెడుతుంది, మిగతాదంతా దండుగ అని ప్రపంచానికి చాటిన మహానేతలు, తెలుగు భాష గురించి చెప్తే ప్రజలు వింటారు. రోజూ ఉత్తరాది నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ దక్షిణాదిపై పెత్తనం గురించి ప్రజలకు చెప్పాలి. ఏనాడూ ప్రజలను కలవకుండా తమకు తామే రాజ కుటుంబీకులమనుకునే సోనియా, రాహుల్ గాంధీల అహంకారం గురించి మాట్లాడి తర్వాత మోదీ నిరంకుశత్వం గురించి ప్రజలకు వివరించాలి. కామన్‌వెల్త్, బొగ్గు, 2జీ, 3జీ, అగస్టా వెస్ట్‌ల్యాండ్, అండర్సన్.. వంటి కుంభకోణాలను గురించి మొదట వివరణ ఇచ్చి రాఫెల్ గురించి ప్రశ్నించాలి. ఏ వ్యవస్థలను ఉపయోగించుకొని ఈ అరవై ఏళ్లు పాలన జరిగిందో మొదట ఓ శ్వేతపత్రం ప్రకటించి ఇపుడు నీరుగారుతున్న వ్యవస్థలను గురించి చర్చ మొదలుపెట్టాలి. ఇవన్నీ గాలికి వదలిపెట్టిన చంద్రబాబు ఒకే దెబ్బతో మోదీ, జగన్, పవన్‌లను కొట్టాలనుకుంటే- మొత్తానికి 'సీన్' రివర్సవుతుంది!

ఆంధ్రప్రదేశ్ రాజధానికి 'అమరావతి' అని పేరు పెట్టడం, బౌద్ధాన్ని గొప్పగా చూపించడం వెనుక పెద్ద వ్యూహం ఉంది. వై.ఎస్.జగన్‌కు ఓటు బ్యాంకుగా వున్న దళితులను తనవైపు తిప్పుకోవడమే గాక, జపాన్, సింగపూర్ దేశాలను ఆకర్షించడం, రాజధాని పేరుతో చేసిన 'నీళ్లుకారే' నిర్మాణాల గురించి జగన్, కేసీఆర్‌లు చెప్పడం, కేంద్రం ఇచ్చిన డబ్బులు, వాటిని ఖర్చుపెట్టిన వైనం గురించి ఇపుడిపుడే ప్రజలకు నిజం తెలుస్తుంది. రాజధాని భూముల వెనుక జరిగిన ల్యాండ్ పుల్లింగ్ పెద్ద కుంభకోణం అని ప్రతిపక్షాలు ఆరోపించడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. రేపు మళ్లీ కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వస్తే అక్కడ పెట్టుబడులు పెట్టిన నాయకుల పరిస్థితి ఏంటి? అని తెలుగుదేశం వర్గాలే అసంతృప్తితో లోలోపల రగులుతున్నాయి. ఇదంతా ముందే గ్రహించిన మోదీ మెల్లమెల్లగా అన్నిదారులు మూసేశాడు. అది తెదేపా నేతలకు ఇంకా అర్థం కావడం లేదు. ఈవిషయాలను గ్రహించిన వ్యాపారవేత్తలైన ఎంపీలు మురళీమోహన్, సీఎం రమేశ్, సుజనా చౌదరి లాంటివారు కక్కలేక మింగలేక కుమిలిపోతున్నారు. తాడూ బొంగరం లేని ఎంపీ శివప్రసాద్ లాంటి నాయకులు ఇవన్నీ తెలియక రోజూ ప్రధానిని దూషిస్తూ పగటి వేషాలేస్తున్నారు. మిగతా ఎంపీలంతా ఈ వింత వేషాలను చూసి సరదాగా నవ్వుకొంటున్నారు.

అభద్రతాభావంతో రోజూ మీడియా సమావేశం పెట్టి తన అస్తిత్వం ప్రకటిస్తున్న చంద్రబాబుపై ప్రజలు వ్యతిరేకత చూపుతున్నట్లు ప్రతిపక్షాలు గ్రహించాయి. తిత్లీ, హుదూద్ తుపాన్లు వచ్చినపుడు సీఎంగా విశేష సేవ చేశానని చంద్రబాబు చెప్పడం ప్రచారంలో అతి అని కేటీఆర్ అన్నాడు. సీఎంగా అధికారంలో ఉన్నవారు తప్ప ఇంకొకరు అలాంటి సేవ చేయలేరు కదా? మరోవైపు చంద్రబాబుతో వేలు విడిచిన చుట్టరికం వున్న కమ్యూనిస్టులు పవన్‌ను మెల్లగా తెదేపా వైపు మళ్లిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. పాదయాత్రతో మంచి ఊపులో వున్న జగన్‌ను కేసీఆర్ దగ్గరకు లాక్కోవడం బాబుకు అపశకునం. ఇన్ని సంఘర్షణల మధ్య 'పార్టీ ఇయర్స్ ఇన్ ఇండస్ట్రీ'గా చెప్పుకొంటున్న చంద్రబాబు తన అవకాశవాద రాజకీయాలతో అందరికీ శత్రువు అవుతున్నాడు. తెలంగాణ ఎన్నికల ఫలితాలతో ఛాంపియన్‌గా నిల్చిన కేసీఆర్‌ను ఇపుడు మోదీ సహా మమత, మాయా, అఖిలేశ్, జగన్, నవీన్ పట్నాయక్‌లు నమ్ముతున్నారు. ఇదంతా చంద్రబాబుకు చిరాకు కలిగిస్తున్నది. ఎన్నికలు దగ్గరవుతున్నవేళ బాబును ఎల్లప్పుడూ కాపాడుతున్న మీడియా, ధనం, జ్యుడీషియరీ కుల వర్గాలు, తెలుగు జాతి సెంటిమెంట్, లేని శత్రువులు.. వీటిలో ఏది గడ్డిపరకలా అందుతుందో చూడాలి. ఇప్పటి పరిస్థితులు చూస్తుంటే ''ఆపరేషన్ ఎన్టీఆర్ డిమాలిషన్'' ఫలితాలు వెంటాడుతున్నట్లే ఉన్నాయి. మరోసారి అదే ప్రశ్న- ఎన్టీఆర్ గొప్పా! ఆయన అభిప్రాయాలు గొప్పా!

-డా.పి.భాస్కర యోగి

బయోపిక్‌లు-ఆత్మకథలు

జనాంతికం
బుద్ధా మురళి
buddhamurali2464@gmail.com

''ఎన్టీఆర్ బయోపిక్‌పై ఏమంటావు?''

''నేను చూడలేదు.. చూసే ఉద్దేశం కూడా లేదు''

''ఓహో.. లక్ష్మీస్ ఎన్టీఆర్ చూస్తావన్నమాట''

''అదీ చూడను..''

''రెండింటినీ తప్పనిసరిగా చూడాల్సి వస్తే ఏది ముందు చూస్తావ్?''

''చాలా రోజుల క్రితం తిరుపతి వెళ్లి అటు నుంచి శ్రీకాళహస్తికి బస్సులో వెళుతున్నప్పుడు పక్కనున్న ప్రయాణికుడు నా సామాజిక వర్గం గురించి తెలుసుకోడానికి తెగ తంటాలు పడ్డాడు. చివరకు ఆ సమయంలో వచ్చిన గౌతమీ పుత్ర శాతకర్ణి, ఖైదీనంబర్ 150లో ఏది ముందు చూస్తారని అడిగాడు. అలాగైనా కనీసం ఏ వర్గమో తెలుస్తుందని..''

''మరి నువ్వేమన్నావ్?''

''రెండింటిలో ఏది ముందుగా టీవీలో వస్తే దాన్ని కొద్దిసేపు చూస్తానన్నా.. ఇప్పుడు నీ ప్రశ్నకూ ఇదే సమాధానం. థియేటర్‌లో మూడు గంటల సమయం వెచ్చించేంత ఓపిక లేదు. మొదటి రోజే చూడాలనుకునే కుర్రతనం లేదు.''

''నువ్వు చూస్తే ఎంత? చూడకపోతే ఎంత? కానీ- ఎన్టీఆర్ బయోపిక్ ఎలా ఉందంటావు''

''ఓషో రజనీష్ చెప్పిన ఒక మాటలో జీవిత సారం దాగుంది. ప్రతి ఒక్కరూ మనిషే. మనిషికి ఉండే లక్షణాలన్నీ మనిషికి ఉంటాయి. ఇది అర్థం అయితే ఒక మనిషిని దేవుడు అని మొక్కం, రాక్షసుడు అని విమర్శించం. మనకు అద్భుతంగా అనిపించిన వ్యక్తి ఇతరులకు నచ్చకపోవచ్చు. వారికి నచ్చిన వాళ్లు మనకు సామాన్య వక్తి అనిపించవచ్చు. ''

''ఔను.. మనం వెంకన్నను దర్శించుకోవడానికి అష్టకష్టాలు పడి వెళ్లి కొన్ని క్షణాలు ఆయన విగ్రహాన్ని చూసి జీవితం ధన్యం అయిందనుకుంటాం. కానీ, గర్భగుడిలోనే సేవ చేసే పూజారులకు అలాంటి భావనే ఉండాలని లేదు''

''బాగా చెప్పావ్! ట్రంప్‌ను ప్రపంచం తన్మయంగా చూసినట్టు అతడి సహాయకుడిని చూడాలని లేదు''

''ఇలాంటి మాటే తనికెళ్ల భరణి ఓసారి చెప్పారు. అమితాబ్‌ను మనం అద్భుతంగా చూస్తాం, ఆయన కారు డ్రైవర్ అంత ఆశ్చర్యంగా ఏమీ చూడడని మహానుభావులను ఎప్పుడో ఒకసారి దూరం నుంచి చూస్తేనే బాగుంటుంది కానీ దగ్గరి నుంచి రోజూ చూస్తే అంత గొప్పగా ఏమీ అనిపించదట!''

''ఎన్టీఆర్ ఎందరికో దేవుడిలా కనిపించారు. కానీ కుటుంబ సభ్యులకు మాత్రం భరించలేని వ్యక్తిగా అనిపించారేమో అనిపిస్తుంది.. ఆయన జామాతా దశమ గ్రహం సీడీ విన్నాక, చివరి దశ గురించి తెలిశాక''

''మనం అసలు చర్చను పక్కన పెట్టాం. ఇంతకూ ఎన్టీఆర్ గురించి బాలకృష్ణ తీసిన కథానాయకుడు సినిమాలో నిజం చెప్పారా? లేక వర్మ తీస్తున్న లక్ష్మీస్ ఎన్టీఆర్‌లో నిజం చెబుతారా? ఈ రెండూ కాకుండా నాదెండ్ల భాస్కర రావు యూ ట్యూబ్ చానల్‌లో చెబుతున్నది నిజం అంటావా?''

''ఆ మూడే ప్రస్తావించా వేం? అప్పటి ఘటనలకు పాత్రధారిగా ఉన్న దగ్గుబాటి వెంకటేశ్వరరావును వదిలేశావేం?''

''మూడింటిలో నిజమేదో తెలుసుకోలేక చస్తుంటే ఇక నాలుగోదా? ఆయన కూడా సినిమా తీస్తున్నారా?''

''ఆయనకూ సినిమాలతో సంబంధం ఉంది. భగత్‌సింగ్ సినిమా తీయాలనుకున్నారు. 1995 నాటి వెన్నుపోటుపై సినిమా తీస్తానని ప్రకటన చేసినా ఎందుకో తీయలేదు. కానీ అప్పుడేం జరిగిందో పుస్తకంలో రాశారు, ఇంటర్వ్యూల్లో చెప్పారు. ''

''సరే.. ఈ నాలుగులో ఇంతకూ ఎవరి మాట నిజమంటావు''

''నాలుగుకే పరిమితమయ్యావేంటి? ఏది నిజమో ఎన్టీఆర్ చెప్పారు కదా? అది వద్దా? జామాతా దశమ గ్రహం అని ఏం జరిగిందో తనకు ఎలా ద్రోహం చేశారో, వెన్నుపోటుకు తానెలా బలయ్యానో స్వయంగా ఆయనే తన స్వరంతో చెప్పారు. ఆ సీడీకి రచన, దర్శకత్వం, నటన అన్నీ ఆయనే''

''నిజంగా విచిత్రమేనోయ్! ఏం జరిగిందో ఆయనే తన స్వరంతో తానే చెప్పినా ఏది నిజం? అని మనం ఆలోచిస్తున్నాం. ''

''పోనీ.. నేను చెప్పనా?''

''ముందు నిన్నే అడిగాను కదా? ఏది నిజమో చెప్పుమని''

''అన్నీ నిజాలే.. అన్నీ అబద్ధాలే''

''అర్థం కాలేదు..''

''ప్రతి సంఘటనను ఎవరి కోణంలో వారు చూస్తారు. టీడీపీ ఎన్టీఆర్ రెక్కల కష్టం కదా? 1994లో ప్రతిపక్ష స్థానానికి అవసరమైన సీట్లు కూడా మిగల్చకుండా ఏకపక్షంగా విజయం సాధించి పెడితే, తన నుంచి సీటు లాగేసుకుని అవమానకరంగా దించేయడం ఎన్టీఆర్ కోణంలో జామాతా దశమ గ్రహం సీడీని విడుదల చేయించింది. ఎన్నో ఆశలతో అధికారం కోసం కాచుకుని కూర్చుంటే మధ్యలో లక్ష్మీపార్వతి వచ్చి తన్నుకుపోయేట్టు ఉంది. ఈ అన్యాయాన్ని సహించక ఎన్టీఆర్‌ను దించేయాలనుకోవడం బాబు కోణంలో న్యాయం. సంఘటన ఒకటే- కోణాలు వేరువేరు. ఎవరి కోణంలో వారిదే న్యాయం. ఇతరుల కోణంలో అది అన్యాయం.''

''ఆ ఒక్క అంశమే కాదు. మిగిలిన విషయాల గురించి?''

''మన క్లాస్‌మేట్ పాండు వాళ్ల ఆవిడ మా వారు శ్రీరాముడు పరాయి ఆడవారిని కన్నెత్తి చూడడు అనుకుంటుంది కదా? నీ అభిప్రాయం చెప్పు''

''వాడు కాలేజీలో చదివే రోజుల్లో వాడి షోకిల్లా రాయుడి జీవితం మనం ఎన్నిసార్లు చూడలేదు. వద్దు రా అని ఎన్నిసార్లు చెప్పాం''

''అప్పటి సంగతి వదిలేయ్.. ఇప్పుడు..''

''వాడికా అలవాట్లు ఇప్పటికీ పోలేదు. ఎప్పుడూ క్యాంపులే''

''పాతికేళ్ల నుంచి కాపురం చేస్తున్నా పాండుగాడి గురించి వాళ్ల ఆవిడకే నిజాలు తెలియదు. ప్రత్యక్షంగా చూసే అవకాశం లేనపుడు- వారి జీవితంలో ఏం జరిగిందో ఎవరికేం తెలుసు? తెరపై కనిపించే నటుడి, నాయకుడి జీవితం గురించి ఎవరికైనా ఎంతవరకు తెలుస్తుంది?''

''ఎన్టీఆర్ స్వయంగా వచ్చి తన గురించి ఇప్పుడు తాను చెప్పాలంటావా?''

''అలా చెప్పినా అన్నీ నిజాలే చెప్పారని ఒప్పుకుంటామా?''

''అంటే...''

''ఎక్కువగా ఊహించకు. నేనే అభిప్రాయం చెప్పడం లేదు, ఏ అభిప్రాయాన్ని ఖండించడం లేదు..''

''మరేం చెబుతున్నావ్?''

''వాళ్ల గురించి, వీళ్ల గురించి ఎందుకు? నీ గురించి నీకు తెలుసా? నా గురించి నాకు తెలుసా?''

''తెలియదా?''

'' శ్రీరాముడు వశిష్టుని ఇంటికి వెళ్లి తలుపు తడితే ఎవరు? అని వశిష్టుడు ప్రశ్నిస్తాడు. 'అది తెలుసు కోవడానికే వచ్చాను' అని శ్రీరాముడు సమాధానం చెబుతాడు. మహామహా తత్వవేత్తలంతా నిన్ను నువ్వు తెలుసుకో- అన్నారు. మనకు మనమే తెలియనప్పుడు ఇతరుల గురించి అది నిజమా? కాదా? ఏది నిజం? అని ఎలా నిర్ధారిస్తాం''

''ఇప్పుడు నా గురించి నన్ను తెలుసుకోమంటావా?''

★

కుల రిజర్వేషన్లు దేశానికి చేటు

ఉత్తరాయణం

కులపరమైన రిజర్వేషన్ల పేరుతో రాజకీయాలాడే పార్టీలు దేశానికి ప్రమాదకరం. కులం పేరిట రిజర్వేషన్లు దేశంలో ప్రజల ఐకమత్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రజల్లో ఐకమత్యాన్ని లేకుండా చేయడానికే రిజర్వేషన్లను మన నాయకులు ఓ ఆయుధంగా వాడుకుంటున్నారు. కొన్ని కులాలకు కొంత కాలం రిజర్వేషన్లు కొనసాగించి, ఆ తర్వాత రద్దుచేయమని భారత రాజ్యాంగంలోనే డా.బి.ఆర్.అంబేద్కర్ సెలవిచ్చారు. బీద కుటుంబాలకు ఈ సౌకర్యాన్ని కొంత కాలముంచి, ఆ తర్వాత వాటిని తొలగించాలి. రిజర్వేషన్ల వల్ల కులాల పేరిట దేశ ప్రజల్లో విభేదాలు పొడసూపుతాయి. ఇదే రాజకీయ పార్టీలకు కావాలి. 'విభజించి పాలించు..' సిద్ధాంతమిదే! మన రాజ్యాంగం నుండి కులాన్ని, మతాన్ని పూర్తిగా రద్దు చేయాలి. ప్రపంచంలో ఏ దేశంలోను మనకున్న లోపాల మయమైన రాజ్యాంగం లేదు. ప్రజలందరూ సమానమనే రాజ్యాంగాన్ని మనం తయారు చేసుకోవాలి. భారతదేశానికి 'కులాతీత, మతాతీత రాజ్యాంగం' ఉండాలి. దేశ ప్రజలు ఐకమత్యంగా వుండాలంటే మన రాజ్యాంగాన్ని తిరగ వ్రాయాలి. మన రాజకీయవేత్తలు పదవుల కోసం దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారు. దేశ ప్రజలందరినీ సమానంగా చూడాలనే రాజకీయ పార్టీనే ప్రజలు ఎన్నుకోవాలి. అలాకాకపోతే దేశం భ్రష్టుపడుతుంది. దేశ ప్రజలను కీలుబొమ్మలను చేసి తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకునే రాజకీయ పార్టీలను జనం తరిమికొట్టాలి. ప్రస్తుత తరుణంలో ఇదే దేశానికి ముఖ్యం.

- జి.శ్రీనివాసులు, అనంతపురము


ఇదీ.. మా రాజకీయ చిత్తశుద్ధి

❑ పది శాతం కోటాపై ప్రధాని మోదీ
❑ ఈ ఏడాది నుంచే 900 వర్శిటీల్లో రిజర్వేషన్లు అమలు
❑ అన్ని సంస్థల్లో సీట్లు పెంచుతామని ప్రకటన

అహ్మదాబాద్, జనవరి 17: ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లను విద్య, ఉద్యోగాల్లో కల్పించేందుకు నిర్దేశించిన బిల్లుకు రాజ్యాంగ సవరణను రాజకీయ సంకల్పం వల్లనే సాధ్యమైందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలిపారు. బలమైన రాజకీయ సంకల్పం వల్లనే ఇంతటి గొప్ప బిల్లును పార్లమెంటులో ఆమోదించుకున్నామన్నారు.

రాజ్యాంగ సవరణతో పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ చట్టాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తామన్నారు. గురువారం ఇక్కడ ఆయన సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 1500 పడకల ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న సామాజిక వర్గాల రిజర్వేషన్లకు విఘాతం కలగకుండా ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లను కల్పించామన్నారు. ఈబీసీ రిజర్వేషన్లను ఈ ఏడాది దేశంలో 900 విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న 40వేల కాలేజీల్లో అమలు చేస్తామన్నారు. అలాగే సీట్లను పదిశాతం పెంచుతున్నట్లు చెప్పారు. అన్ని వర్గాలకు సమానంగా రిజర్వేషన్ల ఫలాలు అందిస్తామన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఆసుపత్రిలో ఆరోగ్యబీమా పథకాన్ని అమలు చేస్తామన్నారు. వంద రోజుల్లో దేశంలో ఏడు లక్షల మందికి ఆరోగ్య బీమా ఫలాలను అందించినట్లు చెప్పారు. హెలిపాడ్ సదుపాయం ఉన్న తొలి ఆసుపత్రి ఇదేనని ఆయన అన్నారు. పరిశుభ్రత, హెల్త్‌కేర్ అనే రెండు లక్ష్యాలతో అహ్మదాబాద్ నగరపాలక సంస్థ మొదటి నుంచి పనిచేస్తోందన్నారు. 2012 లో ఈ ఆసుపత్రికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. దేశంలో నాలుగున్నరేళ్లలో పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పించామని ప్రధాని మోదీ చెప్పారు. ఇక్కడ షాపింగ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటక రంగం, తయారీ రంగం, సేవా రంగంలో మంచి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. దేశంలో 2017లో ప్రవేశపెట్టిన వస్తుసేవా పన్ను వల్ల మంచి ఆదాయం వస్తోందన్నారు.

పరోక్ష పన్నుల విధానంలో కూడా సంస్కరణలు తేనున్నట్లు చెప్పారు. ఇక్కడ ఇస్రో వ్యవస్థాపక చైర్మన్ విక్రమ్ సారాభాయ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.


అహ్మదాబాద్‌లో గురువారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 1500 పడకల ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

మీకు నైతిక విలువలు ఉన్నాయా?

❑ విమర్శించేందుకు పద్ధతీ, పాడూ లేదా? ❑ నోటికెంత వస్తే అంత మాట్లాడుతారా?
❑ ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తారా? ❑ ఫేస్‌బుక్‌లో దీటైన బదులిచ్చిన అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ, జనవరి 17: కేంద్రంలో ప్రజాభీష్టంమేరకు ఎన్నికైన ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు విపక్ష పార్టీలు, కొంత మంది నేతలు అప్రజాస్వామిక రీతిలో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ధ్వజమెత్తారు. అధికార దాహంతో ఈ నేతలు అవాకులు చవాకులు వాగుతూ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం అమెరికాకు వెళ్లిన మంత్రి జైట్లీ తన అభిప్రాయాలను ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించారు. కేంద్రం అసలేమీ చేయలేదని, ప్రజల మనసుల్లో విషం నింపుతున్నారన్నారు. ప్రతికూల ఆలోచనా వ్యక్తిత్వం ఉన్న ఈ నేతలు కేంద్రంలో మోదీ ప్రభుత్వంపై అపనిందలు వేస్తూ ప్రచారం చేయడం దినచర్యగా మారిందన్నారు. వీరికి దేశ ప్రయోజనాలు కూడా కాభట్టవన్నారు. ద్వంద్వ ప్రమాణాలతో ప్రతిపక్ష నేతలు పనిచేస్తున్నరన్నారు. ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లు, రాఫెల్ డీల్ తదితర అంశాలపై ఎంతకాలమని అవాస్తవాలను ప్రతిపక్షనేతలు మాట్లాడుతారన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం, చర్యను వ్యతిరేకించడమే పనిగా పెట్టుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ తరహా చేష్టలు ప్రజాస్వామ్యానికి హానికలిగిస్తాయన్నారు. జస్టిస్ లోయా కేసు, సీబీఐ అంశం, ఆర్‌బీఐ , న్యాయ వ్యవస్థ క్రియాశీలత ఇలా అనేక అంశాలపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని దుష్టసంకల్పంతో పరస్పర విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాము పాలించడం కోసమే పుట్టామని భావించే వారి వల్ల వ్యవస్థకు ప్రమాదమన్నారు. కొంత మంది సిద్ధాంత భావజాల చట్రంలో చిక్కుకుని బాధపడుతున్నారన్నారు. వీరందరూ కలిసి ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ మధ్య కాలంలో జీఎస్టీ నుంచి ఈబీసీ రిజర్వేషన్ల వరకు అన్ని అంశాలపై వీరు ప్రభుత్వంపై నీలాపనిందలు వేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఒక దురదృష్టకర సమయంలో జస్టిస్ లోయా మృతి చెందితే ఆ అంశాన్ని కూడా వివాదస్పదం చేసి రాజకీయంగా లాభపడేందుకు విపక్షాలు ప్రయత్నించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. సీబీఐ లాంటి వ్యవస్థలో అంతర్గత పోరు జరుగుతుంటే సార్వభౌమాధికార పరిరక్షణలో భాగంగా కేంద్రం రంగంలోకి దిగి వ్యవస్థను బాగు చేసిందన్నారు. ఈ నేతల అత్యుత్సాహంతో న్యాయ వ్యవస్థకు కూడా హాని చేస్తున్నారన్నారు. అడ్డూ అదుపులేకుండా మాట్లాడే పద్ధతిని మానుకోవాలన్నారు.

విదేశీ పెట్టుబడులపై దర్యాప్తు చేయించాలి

❑ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ డిమాండ్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 17: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2016 నవంబర్‌లో పెద్ద నోట్లను రద్దు చెసిన తరువాత, ఒక ఏడాది కాలంలో గేమిన్ ద్వీపం నుండి మన దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లపై దర్యాప్తు చేయించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేష్ డిమాండ్ చేశారు. పెద్ద నోట్ల రద్దుకు సంబంధించిన డబ్బే మొదట దేశం నుండి బైటికి వెళ్లి, ఆ తరువాత ఎఫ్‌డీఐ రూపంలో మన దేశంలోకి తిరిగి వచ్చిందని గురువారం ఏఐసీసీలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఆరోపించారు. దేశ భద్రతా వ్యవహారాల సలహాదారు అజీత్ దోవాల్ కుమారులు వివేక్ దోవాల్, శౌర్య దోవాల్ పన్నుల స్వర్గం గేమిన్ ద్వీపంలో జీఎన్‌వై ఆసియా ఫండ్, జీయూస్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్స్ సంస్థలను ప్రారంభించారని అన్నారు. అనంతరం కేవలం ఒక్క సంవత్సరంలో ఎనిమిది వేల మూడు వందల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మన దేశంలోకి రావడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. 2000 నుండి 2017 వరకు గేమిన్ ద్వీపాల నుండి మన దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐలు దాదాపు ఎనిమిది వేల కోట్లుకాగా, పెద్ద నోట్ల రద్దు అనంతరం కేవలం ఒక్క సంవత్సరంలో ఎనిమిది వేల మూడు వందల కోట్ల రూపాయలు రావడం ఆశ్చర్యంగా ఉన్నదని జైరామ్ రమేష్ చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2016 నవంబర్ 8 తేదీ నాడు పెద్ద నోట్లను రద్దు చేసిన తరువాత కేవలం 8 రోజులకు వివేక్ దోవాల్ గేమిన్ ద్వీపంలో జీఎన్‌వై ఆసియా ఫండ్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆ తరువాత నాలుగు నెలల నుండి ఈ ద్వీపం నుండి మన దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావటం ప్రారంభమైందని పేర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దు తరువాత ఒక్క సంవత్సరంలో గేమిన్ ద్వీపం నుండి మన దేశంలోకి వచ్చిన ఈ పెట్టుబడుల వివరాలను రిజర్వు బ్యాంకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. వివేక్ దోవాల్ ప్రారంభించిన జీఎన్‌వై ఆసియా ఫండ్‌లో డైరెక్టర్‌గా నియమితులైన డాన్ బ్యాంక్స్ పేరు పనామా పేపర్లు, ప్యారడైజ్ పేపర్లలో ఉన్నదనేది మరిచిపోరాదని జైరాం రమేష్ అన్నారు. పనామా పేపర్ల మూలంగా పొరుగుదేశం ప్రధాన మంత్రి రాజీనామా చేయవలసి రావడాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. వివేక్ దోవాల్ ప్రారంభించిన జీఎన్‌వై ఆసియా ఫండ్‌కు శౌర్య దోవాల్‌కు చెందిన జీయూస్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్స్‌కు మధ్య ఉన్న సంబంధం ఏమిటనేది కూడా వెల్లడించాలని జైరాం రమేష్ డిమాండ్ చేశారు. తాము నిజాయితీకి, పారదర్శకతకు మారుపేరు అని చెప్పుకునే నరేంద్ర మోదీ ప్రభుత్వం గేమిన్ ద్వీపం నిధులకు సంబంధించిన అన్ని వివరాలు బైట పెట్టాలని ఆయన అన్నారు. జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు అజీత్ దోవాల్ 2010లో బీజేపీకి ఇచ్చిన ఒక నివేదకలో పన్నుల స్వర్గంలో జరిగే వాలాదేవీలను వెళ్లడించాలని డిమాండ్ చేయటాన్ని జైరాం రమేష్ ఉటంకిస్తూ, ఇప్పుడైనా ఈ వివరాలు వెళ్లడిస్తారా? అని ప్రశ్నించారు. అజీత్ దోవాల్ రాజీనామా చేయాలని కోరుతున్నారా? అన్న ప్రశ్నపై స్పందిస్తూ, మొదట వివరాలు వెల్లడిస్తే ఆ తరువాత రాజీనామా డిమాండ్ గురించి ఆలోచిస్తామన్నారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడు జయ్‌షా, ఆ పార్టీకి చెందిన నాయుకులు కుమారులు కూడా చాలా గొప్పవారంటూ జైరాం రమేష్ వ్యంగ్య బాణాలు విసిరారు.

డేరాబాబాకు యావజ్జీవ శిక్ష

❑ జర్నలిస్టు హత్యకేసులో తీర్పు ❑ మరో ముగ్గురికి కారాగారం

పంచకుల (హర్యానా), జనవరి 17: పదహారేళ్ల క్రితం ఓ పాత్రికేయుడ్ని హత్య చేసినట్టు నేరం రుజువు కావడంతో గుర్మీత్ రామ్ రహీం సింగ్ (డేరా బాబా)కు స్థానిక సీబీఐ ప్రత్యేక కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. డేరాబాబాతోపాటు మరోముగ్గురికి న్యాయస్థానం శిక్ష విధించింది. మహిళలపై అత్యాచారం కేసులో శిక్ష అనుభవిస్తున్న డేరాబాబాను గత శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు విచారించింది. 2002లో రామ్‌చందర్ ఛత్రపతిని డేరాబాబా హత్యచేశాడు.'గుర్మీత్ సహా నలుగురిపై నేరం రుజువైంది. అందరికీ కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది'అని సీబీఐ తరపున్యాయవాది హెచ్‌పీఎస్ వర్మ వెల్లడించారు. ఈనెల 11న సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్దీప్‌సింగ్ నలుగుర్నీ దోషులుగా నిర్ధారించారని ఆయన చెప్పారు. డేరాబాబా ప్రస్తుతం రోహ్‌తక్‌లోని సునారియా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అతడిని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కోర్టు విచారించింది. మిగతా ముగ్గురు నిర్మల్‌సింగ్, కుల్దీప్‌సింగ్, కిషన్‌లాల్ అంబాలా జైలు నుంచి విచారణకు హాజరయ్యారు. 2002లో హర్యానాలోని సిర్సాలో జర్నలిస్టు ఛత్రపతి దారుణ హత్యకు గురయ్యారు. సిర్సాలోని డేరా ప్రధాన కేంద్రంలో మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయంటూ ఆయన వార్తలు రాశారు. సంచలనం రేపిన ఈ కేసులో డేరాబాబానే సూత్రధారిగా ఉన్నాడు. 2003లో ఛత్రపతి కుటుంబ సభ్యులు పంజాబ్, హర్యానా కోర్టును ఆశ్రయించారు. కేసును సీబీఐకు అప్పగించాలని వారు అభ్యర్థించారు. కోర్టు ఆదేశాల మేరకు విచారణ ప్రారంభించిన సీబీఐ 2007 జూలైలో చార్జిషీట్ దాఖలు చేసింది.

'సాయ్' డైరెక్టర్ అరెస్టు

❑ అవినీతి ఆరోపణలపై విచారిస్తున్న సీబీఐ

న్యూఢిల్లీ, జనవరి 17: భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) డైరెక్టర్ ఒకరిని సీబీఐ గురువారం అరెస్టు చేసింది. మొత్తం నలుగురిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక డైరెక్టర్ కూడా ఉన్నాడు. సాయ్‌లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, భారీ మొత్తంలో నిధులు అన్యాక్రాంతం అవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో సీబీఐతో విచారణ జరిపిస్తున్నారు. విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో నలుగురిని సీబీఐ అరెస్టు చేసింది. వారిని ప్రశ్నించిన తర్వాత, దర్యాప్తును మరింత ముమ్మరం చేయనుంది. ఇలావుంటే, అవినీతిని ఎట్టి పరిస్థితిల్లోనూ సహించబోమని, ఎంతటి స్థాయిలో ఉన్నాసరే, దోషులని తేలిన మరుక్షణం కఠిన చర్యలు తప్పవని సాయ్ మేనేజింగ్ డైరెక్టర్ నీలం కపూర్ తెలిపారు. సీబీఐ విచారణతో అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణల్లో నిజానిజాలు బయట పడతాయని వ్యాఖ్యానించారు.


గురువారం త్రివేణి సంగమంలో జరిగిన గంగా పూజల్లో పాల్గొన్న రాష్ట్రపతి కోవింద్

మాకు భద్రత కల్పించండి

❑ సుప్రీంను ఆశ్రయించిన బిందు, కనకదుర్గ



న్యూఢిల్లీ, జనవరి 17: కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలోకి ప్రవేశించి చరిత్ర సృష్టించిన ఇద్దరు మహిళను తమకు భద్రత కల్పించాలని సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ మహిళల తరఫున సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని జస్టిస్ ఎల్‌ఎన్ రావు, ఎస్‌కే సిక్రీతోకూడిన బెంచ్ వద్ద పిటిషన్ లిస్టయింది. బిందు అమ్మిణీ (40) కేరళలోని కన్నూర్ యూనివర్శిటీలో లా అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. అలాగే కనకదుర్గ (39) కూడా ఉద్యోగే. అయ్యప్ప ఆలయంలోని మహిళల ప్రవేశాన్ని కల్పిస్తూ సుప్రీం కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఈ నేపథ్యంలో ఆలయ ప్రవేశానికి అనేక మహిళా సంఘాల కార్యకర్తలు ప్రయత్నించారు. ఈ సందర్భంగా శబరిమలలో నిరసనలు వెల్లువెత్తాయి. అయితే బిందు, కనకదుర్గ ఉద్రిక్తతల మద్యే శబరిమల ఆలయంలో ప్రవేశించి చరిత్ర సృష్టించారు. ఆలయ ప్రవేశం తరువాత భక్తుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. కనకదుర్గపై కుటుంబ సభ్యులే దాడికి దిగారు. మలప్పురం జిల్లా పెరింతలమన్నా ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందింది. కాగా తమకు ప్రాణ హాని ఉన్నందున రేయింబవళ్లూ భద్రత కల్పించాలని మహిళలు ఇద్దరూ సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు రానుంది.

రాజస్థాన్ అసెంబ్లీలో గలాభా

❑ పోడియం వద్దకు దూసుకెళ్లిన లోక్‌తాంత్రిక్, బీజేపీ ఎమ్మెల్యేలు


జైపూర్, జనవరి 17: రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక రంగంలో గత తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటుందని గవర్నర్ కల్యాణ్ సింగ్ అన్నారు. యూపీ ముఖ్యమంత్రిగా పనిచేసిన సీనియర్ బీజేపీ నేత కల్యాణ్ సింగ్ రాజస్థాన్ గవర్నర్‌గా ఉన్నారు. ఆయన గురువారం శాసనసభ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సభలో గలాభా చోటు చేసుకుంది. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీకి చెందిన హనుమాన్ బెనివాల్, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగా అంతరాయం కల్పించేందుకు ప్రయత్నించారు. గవర్నర్ ప్రసంగం ముగుస్తుండగా, బీజేపీ ఎమ్మెల్యేలు కూడా పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. లోక్ తాంత్రిక్ ఎమ్మెల్యేలు పోడియంలోకి ఈ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు దూసుకెళ్లి అసెంబ్లీ సెక్రటరీ పక్కన ఉన్న ప్లాట్‌ఫారంను ఎక్కి నినాదాలు చేశారు. గవర్నర్ కల్యాణ్ సింగ్ మాట్లాడుతూ వసుంధర రాజే ప్రభుత్వ హయాంలో ఆర్థికాభివృద్ధి రేటు తగ్గిందన్నారు. వ్యవసాయ రంగంలో సంక్షోభం నెలకొందని, ఈ రంగంలో అభివృద్ధి గణనీయంగా తగ్గిందన్నారు. రాష్ట్రంలో రుణాలు గత ఐదేళ్లలో రూ.1.29 లక్షల కోట్ల నుంచి రూ.3.08 కోట్లకు పెరిగాయన్నారు. గత ప్రభుత్వానికి దార్శనికత, అభివృద్ధి అజెండా లేవని ఆయన వసుంధర రాజే ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశారు. వచ్చే వంద రోజులకు చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణాలను మాఫీచేసిందన్నారు. రైతులు ఆర్థికంగా సాధికారత సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పశుసంవర్ధక రంగంలో ఉపాధిని రెట్టింపు చేస్తామన్నారు. జాతీయ ఉపాధి హామీపథకాన్ని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. ప్రజలకు వైద్య రంగంలో నాణ్యమైన సేవలు అందిస్తామని, ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు.

ఉద్యోగుల వేతనాల్లో 10 శాతం వృద్ధి!

న్యూఢిల్లీ, జనవరి 17: ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల వేతనాల్లో పది శాతం వృద్ధి ఉంటుందని ఓ నివేదికలో స్పష్టమైంది. ద్రవ్యోల్బణం కీలక పాత్ర పోషిస్తుందని, ఐదు శాతం పెరుగుదల ఉంటుందని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ 'కార్న్ ఫెర్రీ' వెల్లడించింది. ఆసియాలో మొత్తంగా చూసే భారత్‌లోనే ఉద్యోగుల వేతనాలు మెరుగ్గా ఉన్నాయని సంస్థ పేర్కొంది. 'గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2019లో వేతనాల పెంపులో పదిశాతం వృద్ధి ఉంటుంది. గత ఏడాది తొమ్మిది శాతం ఉండేది. అలాగే ద్రవ్యోల్బణం 4.7 శాతం నుంచి 5 శాతానికి పెరుగుదల ఉంటుంది'అని కార్న్‌ఫెర్రీ ఇండియా చైర్మన్, రీజనల్ మేనేజింగ్ డైరెక్టర్ నవ్‌నీత్ సింగ్ వెల్లడించారు. కంపెనీ యాజమాన్యాలు అత్యాధుని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యాపార మెళకువలు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకోవల్సి ఉందని సింగ్ పేర్కొన్నారు.

సంక్షోభం కొలిక్కి?

❑ తిరిగొచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
❑ పార్టీకి విధేయులమేనని ఉద్ఘాటన
❑ బీజేపీని ప్రజలు క్షమించరు
❑ కర్నాటకలో కేంద్రం ఆటలు సాగవు
❑ సీఎం కుమారస్వామి ఆరోపణ



బెంగళూరు, జనవరి 17: కర్నాటక కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో ఏర్పడ్డ సంక్షోభం ఓ కొలిక్కి వచ్చినట్టు కనిపిస్తోంది. బీజేపీ ఎరలో ఉన్నట్టుగా భావిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గురువారం తిరిగిరావడంతో కుమరస్వామి సారథ్యంలోని సంకీర్ణ సర్కార్‌కు కొంత ఊరట కలిగినట్టయింది. ముఖ్యంగా శుక్రవారం అత్యంత కీలకమైన కాంగ్రెస్ శాసన సభా పక్ష సమావేశం జరుగనున్న తరుణంలో ఈ ఎమ్మెల్యేలు తిరిగిరావడంతో సంక్షోభం నుంచి గట్టెక్కినట్టేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. తిరిగొచ్చిన ఎమ్మెల్యేలు తాము పార్టీకి విధేయంగా ఉంటామని చెప్పడం గమనార్హం. దీనితో సంక్షోభ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రభుత్వానికి కొంత ఊరట కలిగినట్టయింది.కర్నాటకలో జేడీఎస్, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరత్వం పాలు చేసేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలు ఫలించవని ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యేలను హర్యానా హోటల్‌లో బందీలుగా ఉంచారన్నారు. బీజేపీ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందన్నారు. గురువారం ఇక్కడ ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపరిచేందుకు అన్ని కుట్రలకు బీజేపీ పాల్పడుతోందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అన్ని రకాలుగా బీజేపీ దిగజారిందన్నారు. కేంద్రం పాల్పడుతన్న నీచమైన ఎత్తుగడలకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. మీడియాను దుర్వినియోగం చేసి తమ పబ్బం గడుపుకుందామని చూస్తున్నారన్నారు. అధికారంలోకి రావాలన్న భ్రమల్లో బీజేపీ కొట్టుమిట్టాడుతున్నారన్నారు. సంక్రాంతికి ప్రభుత్వం పడిపోతుందని ప్రచారం చేశారన్నారు. ప్రతిపక్ష నేత యడ్యూరప్ప అధికారం దాహంతో సతమతమవుతున్నారన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం పనిచేయడాన్ని చూసి ఓర్వలేక 24 గంటలు ఏ విధంగానైనా ప్రభుత్వాన్ని కూలదోయాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో కరవుతీవ్రత ఉందని, సహాయక చర్యలను ముమ్మరం చేశామన్నారు. ప్రభుత్వానికి అండగా ఉండకుండా కూలదోసే ప్రయత్నాలు దారుణమన్నారు. ఎమ్మెల్యేలను ఐదు నక్షత్రాల హోటల్లో ఉంచారన్నారు. రైతుల సంక్షేమమే పనిచేస్తున్నామని బీజేపీ చెబుతున్న మాటల్లో నిజం లేదన్నారు. హర్యానాలో కరవుపై చర్చలా, ఐదు నక్షత్రాల హోటళ్లలో ఎమ్మెల్యేలను ఉంచడానికి కారణమేంటి అని ఆయన ప్రశ్నించారు. మీ ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారని బీజేపీ తరచుగా తమ పార్టీని విమర్శిస్తుంటుందని, కాని బీజేపీ ఎందుకు ఎమ్మెల్యేలను దూరంగా ఉన్న రాష్ట్రానికి తరలించి బందీలుగా ఉంచిందన్నారు. మా పార్టీ ఎమ్మెల్యేలను వలవేసి పట్టుకునేందుకు నానా రకాల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజలు బీజేపీని క్షమించరన్నారు.

వైభవంగా అర్థకుంభమేళా

❑ రాష్ట్రపతి దంపతుల ప్రత్యేక పూజలు
❑ భారీగా తరలివచ్చిన భక్తులు

అలహాబాద్, జనవరి 17: ప్రయాగ్‌రాజ్ అర్థ కుంభమేళా వైభవంగా సాగుతోంది. దేశం నలు మూలల నుంచి యాత్రికులు తరలివస్తున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, సవితా కోవింద్ గురువారం త్రివేణి సంగంలో జరిగిన గంగా పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 9.30 గంటలకు భారత వైమానిక దళ ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి దంపతులు బామ్‌రౌలీ విమానాశ్రయానికి చేరుకున్నారు. గవర్నర్ రాంనాయక్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, పలువురు మంత్రులు రాష్ట్రపతికి ఘన స్వాగత పలికారు. రామ్‌నాథ్ కోవింద్, సవితా కోవింద్ ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం తదిరులు వెంట ఉన్నారు. త్రివేణి సంగమం వద్ద రాష్ట్రపతి దంపతులు అర్థగంట సేపుగడిపారు. సాయంత్రం ఢిల్లీ బయలుదేరే ముందు సాధువులతో రాష్ట్రపతి భేటీ అయ్యారు. మాఘమేళకు రాష్ట్రపతి కోవింద్ కుటుంబ సభ్యులు రెండేళ్లుగా వస్తున్నారు.

సమాచారానికి అడ్డంకులుండరాదు

కృత్రిమ మేధస్సే భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానం ❖ యాంత్రికభాషానువాద ప్రాజెక్టును పరిశీలించిన ఉప రాష్ట్రపతి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: భారతీయ పౌరులను సాధికారికంగా రూపుదిద్దాలంటే సమాచారాన్ని అందుకోవడంలో వారు ఎదుర్కొంటున్న అడ్డంకులను తొలగించాలని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యాంత్రికభాషానువాద ప్రాజెక్టును ఉప రాష్ట్రపతి పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు పనిచేసిన 'సార' బృందాన్ని ఉప రాష్ట్రపతి అభినందించారు. మనం ఎవరో, మన చరిత్ర ఏమిటో, మన సమాజం ఏమిటో తెలియజెప్పేది మన భాషలేనని వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రాచీన భాషలు మృత భాషలుగా మారే ముప్పు ఏర్పడిందని, భాషలు క్షయం అయితే దాంతో పాటు మన చరిత్ర కూడా కనుమరుగైపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో భిన్నత్వం, వైవిధ్యాన్ని , సంక్లిష్టతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు వారి సొంత భాషల్లో, మాండలికాల్లో సమాచారాన్ని విజ్ఞానాన్ని చేరువ చేయాలని ఉప రాష్ట్రపతి సూచించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ 'సార' ప్రాజెక్టుతో ముందుకు వచ్చినందుకు ఉప రాష్ట్రపతి వర్శిటీ బృందాన్ని ప్రశంసించారు. సాంస్కృతిక పురోగతికి స్థానిక భాషలను ఎంతైనా ప్రోత్సహించాల్సి ఉంటుందని అన్నారు. యాంత్రిక అనువాదం రానున్న రోజుల్లో గొప్ప మలుపుకానుందని, యంత్రాలను మనం యంత్రాల్లా చూసే రోజులు పోయాయని, యంత్రాలు సైతం గతిశీలకంగా ఆలోచించడం, కొత్త విషయాలు నేర్చుకోవడంలోనూ ముందుండబోతున్నాయని పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో మరింత సమర్థంగా యాంత్రిక అనువాదం సాధ్యం కాబోతోందని అన్నారు. ఇప్పటికిపుడు ఇదంతా సవాలుగా ఉన్నా, పరిశోధన దశ నుండి వాస్తవరూపంలోకి తీసుకురాగలిగితే సాధ్యమని అన్నారు. అది కూడా అంత తేలికైన పనికాదని చెప్పారు. కృత్రిమ మేధస్సే భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానం అవుతుందని వెంకయ్యానాయుడు పేర్కొంటూ ప్రపంచంలో ఎక్కడా లేని భాషా వైవిధ్యం భారత్‌లో ఉందని పేర్కొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కేవీ రమణాచారి

అనసూయా మాతకు తులాభార మహోత్సవం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: మాతృశ్రీ అనసూయా మాత సహస్ర పూర్ణ చంద్రదర్శన తులాభార మహోత్సవాన్ని ఈ నెల 22 న సంగారెడ్డి జిల్లా జరాసంఘం మండలంలోని బర్దిపూర్‌లో నిర్వహిస్తున్నారు. బర్దీపూర్‌లోని శ్రీ దత్తగిరి మహరాజ్ ఆశ్రమం-భాగ్యనగర్‌లో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ. రమణాచారి గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దత్తగిరి మహరాజ్ ఆశ్రమం-భాగ్యనగర్ కమిటీ అధ్యక్షుడు అల్లాడి వీరేశం, ట్రస్టీలు బి. సంగయ్య, ఆర్. సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తవారు 25

❖ గత సభనుండి 76 ❖ ఉమ్మడి సభలో పనిచేసిన వారు 16
❖ వయసులో మిన్న వనమా ❖ పిన్న హరిప్రియ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: తెలంగాణ శాసనసభకు సభ్యులుగా ఎన్నికైన వారిలో కొత్తగా మొట్టమొదటి సారి ఎన్నికైన వారు 25 మంది ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు 16 మంది ఉన్నారు. తెలంగాణ తొలి శాసనసభలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన 76 మంది మళ్లీ రెండో శాసనసభకు కూడా ఎన్నికయ్యారు. పార్లమెంట్ సభ్యులుగా పనిచేస్తున్న బాల్కసుమన్, సిహెచ్. మల్లారెడ్డి ఇప్పుడు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న మైనంపల్లి హన్మంతరావు, పట్నం నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పుడు ఎమ్మెల్యేలుగా పదవీ ప్రమాణం చేశారు. ప్రస్తుత శాసనసభకు ఎన్నికైన వారిలో ముఖ్యమంత్రి కేసీఆర్ సీనియర్ సభ్యుడు. ఆయన ఎనిమిదో పర్యాయం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, ముంతాజ్ అహ్మద్ ఖాన్ సీనియర్ శాసనసభ్యులని రికార్డులు చెబుతున్నాయి. వయస్సు రీత్యా పరిశీలిస్తే కాంగ్రెస్ నుండి కొత్తగూడెం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వనమా వెంకటేశ్వరరావు 73 సంవత్సరాలతో అందరికంటే వయస్సులో పెద్దవారు. అలాగే ఇల్లందు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన భానోతు హరిప్రియ (29) అందరికంటే వయస్సులో చిన్నవారు. పార్టీల వారీగా పరిశీలిస్తే టీఆర్‌ఎస్ నుండి ఎన్నికైన వారు 88 మంది కాగా, కాంగ్రెస్ నుండి 19 మంది ఎన్నికయ్యారు. ఎంఐఎం నుండి ఏడుగురు, టీడీపీ నుండి ఇద్దరు, బీజేపీ నుండి ఒకరు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుండి ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు ఎన్నికయ్యారు. ఆంగ్లో-ఇండియన్ ప్రతినిధిగా స్టీఫెన్‌సన్ రెండోసారి నియామకం అయ్యారు. తెలంగాణ తొలి శాసనసభకు కూడా స్టీఫెన్‌సన్ నియామకం అయ్యారు.

సింగపూర్ పెట్టుబడులకు
తెలంగాణ అనుకూలం

సీఎం కేసీఆర్‌కు సింగపూర్ మంత్రి ఈశ్వరన్ లేఖ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: సింగపూర్ కంపెనీల పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమని సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. సింగపూర్-తెలంగాణ ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తోన్నట్టు ఈశ్వరన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఈశ్వరన్ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ రెండోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల ఈశ్వరన్ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ పనితీరుకు రెండోసారి విజయమే నిదర్శనమని ఈశ్వరన్ కొనియాడారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి అనుకూలంగా ఉందని ఈశ్వరన్ పేర్కొన్నా రు. భవిష్యత్‌లో తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో సింగపూర్ కంపెనీలు భాగస్వాములు అవుతాయన్నారు.

జంతువులపై ప్రయోగాలకు మంగళం

ఐసీఎంఆర్ ప్రత్యామ్నాయ మార్గాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: మనుష్యుల ఆరోగ్య రక్షణకు మందులను రూపొందించే క్రమంలో కోతులు, శునకాలు, ఇతర జంతువులపై ప్రయోగాలు చేయడం నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించేందుకు ఐసీఎంఆర్ మార్గదర్శకాలను జారీ చేసింది.

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఐసీఎంఆర్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. జీవవైద్య రంగంలో ఎదురవుతున్న ప్రమాదాల అంచనాకు మానవీయ మార్గం అన్వేషించడానికి ఈ కేంద్రం దోహదం చేస్తుంది. గత కొద్ది సంవత్సరాలుగా హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్ అండ్ పీపుల్ ఫర్ ఏనిమల్ సంస్థ చేస్తున్న నిరంతర కృషి ఫలితంగా ఐసీఎంఆర్ ఈ కేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చింది.

ఈ సందర్భంగా హెచ్‌ఎస్‌ఐ డిప్యూటీ డైరెక్టర్ అలోక్‌పర్ణ సేన్‌గుప్త మాట్లాడుతూ ఐసీఎంఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వైద్య ఉత్పత్తుల పరీక్షల నిమిత్తం జంతువులపై ప్రయోగాలు చేయడం నిలిపివేయాలని హెచ్‌ఎస్‌ఐ చేసిన విజ్ఞప్తిని పరిగణించిన ఐసీఎంఆర్ ఈ నిర్ణయాన్ని తీసుకుందని ఆయన వివరించారు.

భయం గుప్పిట కథువా బాధిత కుటుంబం

అంతులేని ఆవేదన ❖ విషాదానికి ఏడాది

న్యూఢిల్లీ, జనవరి 17: కథువా సంఘటన అందరికీ గుర్తుండే ఉంటుంది. ఏడాది క్రితం ఇదే రోజు జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో ఒక మైనార్టీ గిరిజన తెగకు చెందిన ఒక అభం శుభం తెలియని ఎనిమిదేళ్ల పసిపాపపై కామాంధులు ఒక మందిరంలో బంధించి అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఆ పాపను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఈ కేసును పంజాబ్‌లోని పఠాన్‌కోట కోర్టు విచారిస్తోంది. ఈ కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఆలయ పర్యవేక్షకుడు, ఇద్దరు పోలీసులు కూడా ఉన్నారు. ప్రపంచం మర్చిపోయినా, ఈ ఉదంతం ఇప్పటికీ కథువా గ్రామస్తులను వెంటాడుతోంది. కుటుంబ సభ్యులు ఇప్పటికీ ఆ బాధ నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఆ షాక్ నుంచి కుటుంబం ఇంకా తేరుకోలేదు. ఇంత జరిగిన తర్వాత నా పిల్లలను ఎలా బయటకు పంపించాలని ఆ బాలిక తండ్రి ప్రశ్నించారు. కోర్టు కేసు ఎంత వరకు వచ్చిందని అడిగారు. సుప్రీం కోర్టు ఆదేశంతో ఈ కేసును పఠాన్‌కోట కోర్టు విచారిస్తోంది. క్రైమ్ బ్రాంచి పోలీసులు రంగంలోకి దిగి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసింది. అరెస్టయిన వారిలో ఒక బాలుడుకూడా ఉన్నాడు. పోలీసులు ఐపీసీ 120-బీ, 302, 376-డీ, 328 కింద కేసులు నమోదు చేశారు. గత ఏడాది జనవరి 10వ తేదీన బాలికను దుండగులు కిడ్నాప్ చేసి 14వ తేదీన హత్య చేశారు. ఈ కేసులో నిందితుడు సం జీరామ్ పోలీసులు కేసుపెట్టకుండా ఉండేందుకు నాలుగు లక్షల రూపాయల లంచాన్ని మూడు వాయిదాల్లో ఇచ్చినట్టు కూడా ఆరోపణలు వచ్చాయి.

బాబు దావోస్ పర్యటన రద్దు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: దావోస్ పర్యటనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దు చేసుకున్నారు. ఆయన స్థానంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దావోస్ వెళ్లనున్నారు. రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు, రాజధాని అమరావతిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్రంలో సాంకేతికతను ఉపయోగించుకుని సృష్టిస్తున్న అద్భుతాలు వివరించేందుకు ప్రతి ఏటా జనవరిలో దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో చంద్రబాబు పాల్గొంటుంటారు.

'ఏకలవ్య' పోటీల్లో తెలంగాణ టాప్

111 పతకాలతో అగ్రస్థానం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: రాష్ట్ర గిరిజన వ్యవహారాల శాఖ సహకారంతో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ మీట్‌లో తెలంగాణ విజయబావుటా ఎగురవేసింది. 111 పతకాలను సాధించి అగ్రస్థానంలో నిలిచింది. అందులో 52 బంగారు పతకాలు, 43 వెండిపతకాలు, 16 రజతపతకాలున్నాయి. అథ్లటిక్ మీట్ చాంపియన్‌గా తెలంగాణకు చెందిన ఆర్ హరిలాల్ నిలవగా, బాలికల నుండి వీ స్వాతి చాంపియన్‌గా నిలిచారు. ఇద్దరూ తెలంగాణకు చెందిన వారు కావడం గమనార్హం. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రం నుండి 20 పాఠశాలలకు చెందిన 2వేల మంది పాల్గొన్నారు.

చాసో కథలు అజరామరం

యువ రచయిత షరీఫ్‌కు చాసో పురస్కారం

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 17: చాసో (చాగంటి సోమయాజులు) కథలు అజరామరాలని ఏపీ నాటక అకాడమీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని చాసో భవన్‌లో ఏర్పాటు చేసిన చాసో స్ఫూర్తి సాహిత్య పురస్కార కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాసో కథల్లో తెలియని ఆర్ద్రత ఉంటుందన్నారు. చాసో రాసిన 40 కథల్లో మానవీయ స్పర్శను స్పృశించారని వివరించారు. తన అనుభవ సారాన్ని, జ్ఞానామృతాన్ని కలగలిపి చాసో కథలు రాయడం వల్ల ఆయన కథల్లో శిల్పం విన్యాసం చేస్తుందన్నారు. జీవితాన్ని బాగా అధ్యయనం చేసిన వ్యక్తి చాసో అని, సూటిగా విశ్లేషించడం ఆయన నైజమని వివరించారు. ఈ సందర్భంగా చాసో స్ఫూర్తి ట్రస్ట్ అధినేత చాగంటి తులసీ, ముఖ్య అతిథుల చేతుల మీదుగా యువ రచయిత వేంపల్లె షరీఫ్‌కు చాసో స్ఫూర్తి సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రచయిత వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ ముస్లింలలో ఉన్న భిన్న ఉప కులాల మధ్య జరుగుతున్న సంఘర్షణను కథల రూపంలో తీసుకువచ్చానన్నారు. తాను రాసిన 'జుమ్మా' కథకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందన్నారు. కాగా, చాసో స్ఫూర్తి పురస్కారం అందుకోవడం అంతకంటే ఆనందంగా ఉందని వివరించారు. చాగంటి తులసి మాట్లాడుతూ సమాజంలో ఏ మార్పు రావాలని కథలు రాస్తున్నారో అటువంటి వాటికి ఇక నుంచి చాసో స్ఫూర్తి అవార్డును అందజేస్తామన్నారు. కళాత్మక విలువలు కలిగిన రచనలకే చాసో పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్లేషకురాలు రెహానా, రచయిత జీఎస్ చలం, తమిళ రచయిత వి.దివాకర్, చీకటి దివాకర్, రచయితలు జగద్ధాత్రి, రామతీర్థ, డాక్టర్ ఎ.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



చాసో స్ఫూర్తి సాహిత్య పురస్కారాన్ని అందుకుంటున్న యువ రచయిత వేంపల్లె షరీఫ్

1వ పేజీ తరువాయి

సభాపతిగా పోచారం

కూర్చోబెట్టడంతో స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ముగుస్తుంది. ఆ తర్వాత సభను ఉద్దేశించి స్పీకర్ ప్రసంగించడం, సభ్యులు స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం సభ వాయిదా పడుతుంది. అనంతరం స్పీకర్ అధ్యక్షతన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశమై సమావేశాల కార్యాచరణను ఖరారు చేస్తుంది. ఇలా ఉండగా స్పీకర్‌గా తనను ఎంపిక చేయడం పట్ల శాసనసభ ఆవరణలోని ముఖ్యమంత్రి కేసీఆర్ ఛాంబర్‌కు వెళ్లి పోచారం కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ మొదటి రోజు సమావేశాలు, స్పీకర్ నామినేషన్ కార్యక్రమాల అనంతరం జూబ్లీహాల్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సీఎం కేసీఆర్ భోజనం చేశారు. ఆ తర్వాత అదే హాల్‌లోని శాసనమండలి భవనం, ప్రాంగణానికి ఇటీవల చేసిన మరమ్మతులు, అలంకరణను సభ్యులతో కలిసి సీఎం పరిశీలించారు.

పోచారం రాజకీయ జీవితం...

తెలంగాణ శాసనసభ రెండో స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇదే నియోజకవర్గం నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వరుసగా ఆరుసార్లు ఎన్నికయ్యారు. అంతకు ముందు 1976లో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షునిగా పోచారం రాజకీయ జీవితం ప్రారంభమై, 1987లో డిసీసీబీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత తొలిసారిగా 1994లో బాన్స్‌వాడ ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టారు. 1998లో గృహనిర్మాణ మంత్రిగా, 1999లో గనులశాఖ మంత్రిగా, 2000లో పంచాయతీరాజ్ మంత్రిగా, 2011 నుంచి 2014 వరకు వ్యవసాయశాఖ మంత్రిగా పోచారం బాధ్యతలు నిర్వహించి, 2019లో శాసనసభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

కొలువుదీరిన సభ

కూడా నడవలేని స్థితిలో 'కర్ర' సాయంతో సభలోకి రావడమే కాకుండా ప్రమాణ స్వీకారానికి కూడా కర్ర సాయంతోనే పోడియంపైకి వెళ్లారు. గురువారం ప్రమాణం చేసిన వారిలో 101 మంది 'దైవసాక్షి'గా ప్రమాణం చేయగా, మిగతా 13 మంది 'పవిత్ర హృదయం' పేరుతో పదవీ స్వీకారం చేశారు. ఉదయం 11.10 గంటలకు సభలోకి మొట్టమొదట కరీంనగర్ నుండి ఎంపికైన గంగుల కమలాకర్ వచ్చారు. ఆ తర్వాత పద్మాదేవేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్, టి. హరీష్‌రావు, శ్రీనివాసగౌడ్, సి. లక్ష్మారెడ్డి వచ్చారు. ఉదయం 11.27 గంటలకు కేసీఆర్ సభలోకి ప్రవేశించారు. చివరగా కాంగ్రెస్ సభ్యులు ఉత్తంకుమార్‌రెడ్డి తదితరులు సభలోకి వచ్చారు. ప్రొటెం స్పీకర్ సరిగ్గా 11.29 గంటలకు వేదికపైకి రాగానే జాతీయగీతం జనగణమనతో సభ ప్రారంభమైంది. ఉమ్మడి అసెంబ్లీ సమావేశం హాలు, తెలంగాణ తొలి అసెంబ్లీ హాలుగా ఉపయోగించారు. అప్పట్లో 294 మంది ఎమ్మెల్యేలు కూర్చునేందుకు వీలుగా కుర్చీలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు 152 మంది కూచునేందుకు వీలుగా అసెంబ్లీ హాలులో కుర్చీలను ఏర్పాటు చేశారు.

ఇక రాహుల్‌దే నిర్ణయం

అభిప్రాయాలను సేకరించారు. సీఎల్‌పీ నేతగా తమకు అవకాశం ఇవ్వాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నల్లగొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి పార్టీ పరిశీలకునిగా విజ్ఞప్తి చేశారు. అలాగే పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తాము కట్టుబడి ఉంటామని వారు స్పష్టం చేసినట్టు సమాచారం. అలాగే మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని విడివిడిగా, ఉమ్మడిగా పార్టీ పరిశీలకునిగా స్పష్టం చేశారు. అనంతరం ఇదే విషయాన్ని శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఏఐసీసీ పరిశీలకుడు వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. తమ పార్టీ సభ్యులంతా సీఎల్‌పీ నాయకుడి ఎన్నిక నిర్ణయాన్ని పార్టీ అధినేత రాహుల్ గాంధీకి అప్పగిస్తూ ఏక వ్యాఖ్య తీర్మానం చేశారని ఆయన తెలిపారు. ఈ తీర్మానాన్ని పార్టీ అధిష్ఠానంకు తెలియజేయనున్నట్టు వివరించారు.

సరైన పంథాతోనే శాంతి

సత్సంబంధాలు, మన భద్రతకు ప్రాధాన్యత, వనరుల పరిరక్షణ విషయంలో చేపట్టాల్సిన చర్యలు గురించి ఈ పుస్తకంలో శేషగిరిరావు వివరించారని అన్నారు. ప్రపంచ యవనికపై భారతదేశం స్థాయిని పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు మన దార్శనికతకు నిదర్శనమని, ఇదే నేపథ్యంలో భారతదేశం ఉగ్రవాదం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని , తీరప్రాంత ఉగ్రవాదాన్ని సమగ్రంగా ఎదుర్కోవాలంటే భారత్ ఇతర దేశాల సహకారంతో కూడిన నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవాలని , ఆయా దేశాలకు ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో సహకారాన్ని అందించాలని సూచించారు. దేశ రక్షణ, వనరుల పరిరక్షణ, వాణిజ్యం, ఉగ్రవాద సమస్యలను అధిగమించి , కీలక సమయాల్లో స్వీయ రక్షణ కోసం చేసుకుంటున్న లెమో ఒప్పందాలు వ్యూహాత్మకమని, వీటిలో సముద్ర జలాల్లో రవాణా, దొంగల బారి నుండి సరకు రక్షణ వంటివి సాధ్యమని తెలిపారు. ఇలాంటి పుస్తకాల ద్వారానే భారతదేశ నిర్ణయాల పట్ల యువతకు అవగాహన పెరుగుతుందని పరిశోధించి ఇంత మంచి పుస్తకాన్ని అందించిన శేషగిరిరావును ఆయన అభినందించారు.

మోహన్ కందాకు అభినందనలు

మాజీ ఐఎఎస్ అధికారి మోహన్‌కందా తాను రాసిన ఎథిక్స్ ఇన్ గవర్నెన్స్ - రిజల్యూషన్ ఆఫ్ డైలమాస్ పుస్తకంలోని ప్రతి అక్షరం వాస్తవమని , సివిల్ సర్వీసుల్లోకి వచ్చే యువతకు ఈ పుస్తకం దిశానిర్దేశం చేస్తుందని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు ప్రశంసించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఉప రాష్ట్రపతికి మోహన్ కందా స్వయంగా తన పుస్తకాన్ని అందించారు. ఈ మధ్యనే తాను ఈ పుస్తకాన్ని పరిశీలించానని, పరిపాలనలో ధర్మపాలన- సందిగ్ధ సందర్భాలు సోదాహరణ పరిష్కారాలను కూడా సూచించారని, పాలనలో నీతి రీతి ఉండాలని వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. సివిల్ సర్వీసుల్లోకి వెళ్లాలనుకునే వారు ఈ పుస్తకాన్ని తప్పనిసరి చదివి తీరాలని చెప్పారు.

ఎన్‌ఐఏ దర్యాప్తుపై కోర్టుకు?

ఆరోపణలను ఏపీ పోలీసు ఉన్నతాధికారులు తప్పుపడుతున్నారు. ఎన్‌ఐఏ అధికారులకు సహకరిస్తున్నామని, జగన్ కేసులో సాక్ష్యాలను ఇప్పటికే కోర్టుకు అందజేశామని, అవసరమైతే ఎన్‌ఐఏ అధికారులు కోర్టు నుంచి తీసుకోవచ్చని అంటున్నారు. సహకరించడం లేదనే వాదన కొట్టిపారేస్తూ ఇప్పటికే ఎన్‌ఐఏ అధికారులకు పోలీసు ఎస్కార్ట్ కూడా ఇస్తున్నామని స్పష్టం చేస్తున్నారు. ఈ అంశంపై శుక్రవారం కోర్టు ఆదేశాలు వెలువడనున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా, జగన్ కేసును ఎన్‌ఐఏ విచారించడాన్ని వ్యతిరేకిస్తూ వస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కీలక నిర్ణయం తీసుకోనుంది. డీజీపీ ఠాకూర్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేక భేటీ సందర్భంగా జగన్ కేసు, ఎన్‌ఐఏకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీంతో జగన్ కేసును ఎన్‌ఐఏకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో శుక్రవారం ప్రభుత్వం పిటిషన్ వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. డీజీపీ సీఎంతో భేటీ కావడం ఇందుకు ఊతమిస్తోంది.

అభ్యర్థుల ఎంపికపై సీఎం కసరత్తు!

కడప, చిత్తూరులకు ప్రాథమిక ఎంపిక పూర్తి? తాజాగా అనంతపురంపై దృష్టి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఫిబ్రవరిలో వెలువడే అవకాశం ఉండటంతో టీడీపీ అభ్యర్థుల ఎంపికపై పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు ప్రారంభించారు. జిల్లాల వారీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశారు. సర్వే బృందాలతో పాటు పార్టీ అంతర్గతంగా తెప్పించుకున్న నివేదికల ఆధారంగా అభ్యర్థుల ఎంపికకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఆయన అనంతపురం జిల్లాపై దృష్టి సారించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో స్వగ్రామం వెళ్లిన చంద్రబాబు మంగళవారం రాత్రి తిరిగి ఉండవల్లి చేరుకున్నారు. అప్పటి నుంచి అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించారు. ఆంతరంగికులతో మంతనాలు సాగించారు. బుధవారం కూడా ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా పార్టీలోని కీలక నాయకుల జాబితాతో ఎంపిక ప్రక్రియపై దృష్టి సారించారు. ఇప్పటికే చిత్తూరు, కడప జిల్లాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసి ఒక అవగాహనకు రాగా, తాజాగా అనంతపురం జిల్లాపై దృష్టి సారించారు. ఇప్పటికే తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండనని ఎంపీ జేసీ దివాకరరెడ్డి ప్రకటించి, తన స్థానంలో తన కుమారుడు పవన్ రెడ్డి, జేసీ ప్రభాకర రెడ్డి బదులుగా ఆయన కుమారుడు అస్మిత్ రెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. ఈనేపథ్యంలో జేసీ సోదరులు గురువారం ముఖ్యమంత్రిని కలిశారు. రానున్న ఎన్నికల్లో పోటీపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.

కేటీఆర్, జగన్ భేటీపై చర్చ

వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు భేటీపై అందుబాటులో ఉన్న మంత్రులతో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చించారు. టీఆర్ఎస్, వైకాపా మధ్య ఉన్న ముసుగు ఈ భేటీతో తొలగిందన్న అభిప్రాయాన్ని సీఎం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమావేశంలో పాల్గొన్న మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నారాయణ, కాలవ శ్రీనివాసులు, గంటా శ్రీనివాసరావులతో తాజా రాజకీయ పరిస్థితులను చర్చించి వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు.

ఏపీ అంటే మోదీకి అసూయ

ప్రగతిలో గుజరాత్‌ను మించిపోతామని భయం

- బీజేపీ అజెండా అమలుకే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్
- తలసాని వ్యాఖ్యలు దుర్మార్గం
- బీసీలపై కపటప్రేమ
- టీడీపీపై షర్మిల ఫిర్యాదు దురదృష్టకరం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: ఆంధ్రప్రదేశ్ అంటే ప్రధాని మోదీకి అసూయ అని, అభివృద్ధిలో గుజరాత్‌ను ఏపీ మించిపోతుందన్న భయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎలక్షన్ మిషన్ - 2019 టీడీపీ బాధ్యులు, ప్రజాప్రతినిధులతో ఉండవల్లిలోని తన నివాసం నుంచి గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి చెందకూడదన్నది తెలంగాణ సీఎం కేసీఆర్ పంతమని, ఆయన చేతగానితనం బయటపడుతుందని భయమంటూ తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లాల్సి వస్తుందని వైకాపా అధినేత జగన్‌కు భయమన్నారు. అసూయాపరులంతా ఒకచోటుకు చేరి ఏపీపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గద్దల మాదిరిగా ఏపీపై వాలి కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని, మతాల మధ్య ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సెంటిమెంట్ రెచ్చగొట్టారని, ఇప్పుడు ఏపీలో కులాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసం ఎంతకైనా తెగిస్తున్నారన్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు స్పందన లేదని, దీంతో బుధవారం హడావుడిగా జగన్‌తో కేటీఆర్ భేటీ అయ్యారని ఎద్దేవా చేశారు. ఈ భేటీతో వైకాపా, టీఆర్ఎస్ ముసుగులు తొలగిపోయాయన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చాలని వారు కుట్రలు పన్నుతున్నారన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కాకుండా కుతంత్రాలు పన్నుతున్నారని విమర్శించారు. బీజేపీ అజెండా అమలుకే ఫెడరల్ ఫ్రంట్ అని, పార్టీలను గందరగోళంలోకి నెట్టి, ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నమని ఆక్షేపించారు. వైకాపా నేత షర్మిల టీడీపీపై పోలీసులకు ఫిర్యాదు చేయడం దురదృష్టకరమని ముఖ్యమంత్రి ఖండించారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసింది వైకాపానేనని, సోషల్ మీడియాలో అసభ్య ప్రచారం చేసింది ఆ పార్టీనేని స్పష్టం చేశారు. సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణపై కూడా మొదట్లో వైకాపా దుష్ప్రచారం చేసిందని గుర్తుచేశారు. జగన్‌పై విచారణ సాగకుండా చేయాలని కుట్రలు పన్నారన్నారు. దర్యాప్తు అధికారులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. చివరికి న్యాయమూర్తులపై కూడా దుష్ప్రచారానికి తెగబడ్డారని విమర్శించారు. పవన్‌కళ్యాణ్ పెళ్లిళ్లపై అసభ్య ప్రచారం చేశారని, టీడీపీ మహిళా నేతలపై కూడా అసభ్యంగా మాట్లాడారన్నారు. తన కుటుంబ సభ్యులపై కూడా దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు.

క్రీడాభూమి

పొరపాట్లు అందరూ చేస్తారు: గంగూలీ



ముంబయి, జనవరి 17: తప్పులు జరగడం సహజమని, పొరపాట్లు అందరూ చేస్తారని, అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు. కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌ని గంగూలీ వెనుకేసు కొచ్చాడు. గురువారం హిందీ మూవీ 22 యార్డ్స్ ట్రైలర్ లాంచ్‌లో పాల్గొన్న దాదా ఈ అంశంపై స్పందించాడు. నేను ఆ టీవీ షో చూడలేదు. కానీ ఈ కాలం క్రికెటర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలంటూ అందరినీ కలిపి ప్రకటన చేయడం సరికాదు. మనం మనుషులం. మెషీన్లం కాదు. వాళ్లు రోల్‌మోడల్స్ కావచ్చు. కానీ బాగా ఆడాలనే ఒత్తిడి వారిపై ఉంటుంది. ఇలాంటివి పట్టించుకోకుండా ముందుకెళ్లాలని సూచించాడు. పాత తరం క్రికెటర్లతో పోలిస్తే ఇప్పటి క్రికెటర్లు బాధ్యతాయుతంగా లేదన్న విమర్శను సౌరవ్ కొట్టిపాడేశాడు. సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి క్రికెటర్లు భారత్ నుంచి రావడం అదృష్టమని పేర్కొన్నాడు.

జట్టులో పాండ్యాది ముఖ్య భూమిక

- **ఓపెనర్ శిఖర్ ధావన్**

మెల్‌బోర్న్, జనవరి 17: భారత జట్టు సమతుల్యత రావడంలో హార్దిక్ పాండ్యా ముఖ్య భూమిక పోషించాడని ఓపెనర్ శిఖర్ ధావన్ పేర్కొన్నాడు. కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన క్రికెటర్ పాండ్యా గురించి ధావన్ మాట్లాడుతూ పాండ్యా జట్టులోకి వచ్చిన తర్వాత సమతుల్యత ఏర్పడింది. జట్టు బ్యాలెన్స్ కావడంలో పాండ్యా పాత్ర కీలకం. అతను జట్టులో చేరిన దగ్గర్నుంచీ కీలక సభ్యుడిగా మారిపోయాడు. అని పేర్కొన్నాడు. అలాగే యువ ఆటగాళ్లు మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్‌నూ ధావన్ వెనుకేసు కొచ్చాడు. వారింకా యువ క్రికెటర్లేనని, నేర్చుకునే దశలోనే ఉన్నారన్నాడు. రాబోయే కాలంలో వారిద్దరూ పరిణితి సాధిస్తారని చెప్పుకొచ్చాడు.

మూడో రౌండ్‌కు నొవాక్ జొకోవిచ్

మెల్బోర్న్, జనవరి 17: ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ ఆస్ట్రేలియా గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో మూడో రౌండ్ చేరాడు. రెండో రౌండ్‌లో అతను 'జెయింట్ కిల్లర్' జో విల్‌ఫ్రైడ్ సొంగాను 6-3, 7-5, 6-4 తేడాతో ఓడించి, ముందంజ వేశాడు. మిలోస్ రోనిక్ చేతిలో స్టానిస్లాస్ వావ్రిన్కా 7-6, 6-7, 6-7 తేడాతో పరాజయాన్ని చవిచూశాడు. జపాన్ క్రీడాకారుడు కెయ్ నిషికొరి 6-3, 7-6, 6-7, 7-5 స్కోరుతో ఇవో కర్లొవిచ్‌పై విజయం సాధించాడు. టైటిల్ సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్న ఆటగాళ్లలో ఒకడైన జర్మనీ యువ సంచలనం అలెగ్జాండర్ జ్వెరెవ్ 7-6, 6-4, 5-7, 7-6 ఆధిక్యంతో జెరెమీ చార్డీపై గెలుపొందాడు. వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన అలెక్సీ పాపిరిన్‌తో తలపడాల్సిన డామినిక్ థియేమ్ మొదటి రెండు సెట్లను 7-5, 6-4 తేడాతో గెల్చుకొని, మూడో సెట్‌లో 2-0 ఆధిక్యాన్ని సంపాదించాడు. ఈ దశలో కండరాలు పట్టేయడంతో రిటైర్ అయ్యాడు. అదృష్టం కలిసొచ్చిన పాపిరిన్ మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. డేవిడ్ గొఫిన్ 5-7, 7-5, 6-2, 6-4 తేడాతో మారియస్ లొపిల్‌ను ఓడించాడు.

సిరీస్‌పై టీమిండియా కన్ను

- **నేడు మెల్‌బోర్న్‌లో చివరి వనే్డ**
- **గెలుపుపై ఇరు జట్ల ధీమా**




మెల్‌బోర్న్ మైదానంలో సాధన చేస్తున్న భారత ఆటగాళ్లు

మెల్‌బోర్న్, జనవరి 17: ఆస్ట్రేలియా గడ్డపై 72 తర్వాత టెస్ట్ సిరీస్ గెలిచి రికార్డు సృష్టించిన టీమిండియా, వనే్డ సిరీస్‌పైనా కనే్నసింది. మూడు మ్యాచ్‌ల వనే్డ సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలవగా, చివరిదైనా వనే్డ నేడు మెల్‌బోర్న్‌లో జరగనుంది. సిరీస్ కోసం రెండు జట్లు పోటీ పడుతుండగా, ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్ విభాగాల్లో భారత్ జట్టే పైచేయిగా ఉంది. సిడ్నీ వేదికగా జరిగిన మొదటి వనే్డలో ఆసీస్ 34 పరుగులతో విజయం సాధించగా, అడిలైడ్‌లో జరిగిన రెండో వనే్డలో భారత జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఆస్ట్రేలియా గడ్డపై భారత్ ఇప్పటివరకు 1985లో వరల్డ్ ఛాంపియన్ షిప్, 2008లో సీబీ సిరీస్ గెలవగా, 2016లో 4-1తో ఓటమి చవిచూసింది. 2018-19లో ఇప్పటివరకు ఇక్కడ ఒక్క సిరీస్ ఓడని టీమిండియా, 2-1తో టెస్ట్ సిరీస్‌ని గెలుచుకుంది. అయితే ఐదో బౌలర్ విషయంలో కొంత సందిగ్ధత నెలకొంది. ఆస్ట్రేలియా టూర్ ముందు వరకు ఆ స్థానాన్ని ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో భర్తీ చేయగా, కొన్ని కారణాలతో పాండ్యా వనే్డ సిరీస్‌కు దూరమైన విషయం తెలిసిందే. దీంతో రెండో వనే్డలో ఐదో బౌలర్‌గా ప్రయోగించిన కలీల్ అహ్మద్ (0-55), మహ్మద్ సిరాజ్ (0-76) దారుణంగా విఫలమవ్వగా, భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీ, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ రాణిస్తుండడం భారత్‌కు కలిసొచ్చే అంశం. అయితే ఐదో బౌలర్‌గా కెప్టెన్ విరాట్ కోహ్లీ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడుని ప్రయోగించినా పెద్దగా కలిసిరాలేదు. మరోవైపు రాయుడు బౌలింగ్ యాక్షన్‌పై మ్యాచ్ రిఫరీ ఐసీసీకి ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఇదిలాఉంటే సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ స్థానంలో వచ్చిన ఆల్‌రౌండర్ విజయ్ శంకర్, మరో లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చాహల్‌ను చివరి వనే్డలో ఐదో బౌలర్‌గా తీసుకునే అవకాశముంది. వీరిద్దరూ గురువారం మెల్‌బోర్న్ మైదానంలో సాధన కూడా చేయడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. విజయ్ శంకర్‌ను తుది జట్టులోకి తీసుకుంటే మూడో ఫాస్ట్ బౌలర్‌తో పాటు బ్యాటింగ్ లైనప్ కూడా బలపడేందుకు అవకాశాలున్నాయి. మరోవైపు టీం మేనేజ్‌మెంట్, కెప్టెన్ కోహ్లీ మాత్రం ఇద్దరు సీమర్లు, ముగ్గురు స్పిన్నర్లతోనే తుది జట్టును ప్రకటించేలా ఆలోచనలు చేస్తున్నారు. ఒకవేళ విజయ్ శంకర్, కేదర్ జాదవ్‌ను జట్టులోకి తీసుకుంటే అంబటి రాయుడు, దినేష్ కార్తీక్‌ను పక్కనబెట్టే అవకాశముంది. దినేష్ కార్తీక్ రెండో వనే్డలో అద్భుత ప్రదర్శన కనబర్చిన విషయం తెలిసిందే. బౌలింగ్ విషయం అటుంచితే బ్యాటింగ్ కూర్పులో నాలుగో స్థానం భారత్‌కు కొంత ఇబ్బందిగా మారింది.

ఆ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్న అంబటి రాయుడు రెండు వనే్డల్లో పెద్దగా రాణించలేదు. ఇక జార్ఖండ్ డైనమెట్ మహేంద్ర సింగ్ ధోనీ చాలారోజుల తర్వాత జట్టులోకి వచ్చినా రెండు వనే్డల్లో అర్ధ సెంచరీలు చేసి తనలో సత్తా ఇంకా తగ్గలేదని నిరూపించుకున్నాడు. ఒకదశలో రెండో వనే్డ ఓటమి నుంచి భారత్ గట్టెక్కిందంటే ధోనీ బ్యాటింగే కారణం. ఇదిలాఉంటే ఆస్ట్రేలియా జట్టును బ్యాటింగ్ సమస్య ఇబ్బంది పెడుతోంది. రెండు వనే్డల్లోనూ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్స్ మాత్రమే రాణించారు. మెల్‌బోర్న్‌లో భారత్‌తో 14 మ్యాచ్‌లాడిన కంగారులు తొమ్మిదింటా గెలిచారు.

భారత్: విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్, విజయ్ శంకర్,

ఆస్ట్రేలియా: ఆరోన్ ఫించ్ (కెప్టెన్), అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), పీటర్ హ్యాండ్స్‌కాంబ్, ఉస్మాన్ ఖాజా, షాన్ మార్ష్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, జే రిచర్డ్‌సన్, పీటర్ సిడెల్, బిల్లీ స్టాన్‌లేక్, మార్కస్ స్టొయినిస్, ఆడం జంపా.

ఫామ్‌లోకి సెరెనా విలియమ్స్




- **ఆస్ట్రేలియా గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ మహిళల సింగిల్స్‌లో ముందంజ**

మెల్బోర్న్, జనవరి 17: కెరీర్‌లో ఇప్పటి వరకూ 23 గ్రాండ్ శ్లామ్ టైటిళ్లను కైవసం చేసుకున్న ప్రపంచ మాజీ నంబర్ వన్ సెరెనా విలియమ్స్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చినట్టు కనిపించింది. ఏడు పర్యాయాలు ఆస్ట్రేలియా ఓపెన్‌లో విజేతగా నిలిచిన ఆమె 2017లో చివరిసారి ఈ టైటిల్ సాధించింది. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఆమె యూగెనీ బుచార్డ్‌ను 6-2, 6-2 తేడాతో చిత్తుచేసి, మళ్లీ ఫామ్‌లోకి వచ్చానన్న సంకేతాలు పంపింది. ఖాతాలో ఇంత వరకూ ఏడు ఆస్ట్రేలియా ఓపెన్‌తోపాటు ఏడు వింబుల్డన్, మూడు ఫ్రెంచ్ ఓపెన్, ఆరు యూఎస్ ఓపెన్ టైటిళ్లను కూడా కైవసం చేసుకున్న సెరెనా కెరీర్‌లో 24వ గ్రాండ్ శ్లామ్‌ను సాధించాలన్న పట్టుదలతో ఉంది. కాగా, టాప్ సీడ్ క్రీడాకారిణి సిమోనా హాలెప్ 6-3, 6-7, 6-4 తేడాతో సోఫీ కెనిన్‌పై విజయం సాధించింది. నాలుగో ర్యాంకర్ నవోమీ ఒసాకా 6-2, 6-4 ఆధిక్యంతో తమరా జిడాన్‌సెక్‌ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. వీనస్ విలియమ్స్ 6-3, 4-6, 6-0 తేడాతో ఎలిజ్ కార్నెట్‌పై విజయం సాధించి, ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ ఆశలను సజీవంగా నిలబెట్టుకుంది. ఆరోసీడ్ ఎలినా స్విటోలినా 6-4, 6-1 స్కోరుతో విక్టోరియా కుజ్మోవాపై గెలుపొందింది. ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా 4-6, 6-1, 6-0 తేడాతో మాడిసన్ బ్రెంగిల్‌ను ఓడించగా, 17వ సీడ్ మాడిసన్ కీస్ 6-3, 6-4 తేడాతో అనస్తాసియా పొటపొవాపై గెలుపొంది, మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. మహిళల విభాగంలో ఈ ఏటి విజేత ఎవరనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. పోటీ తీవ్రంగా ఉండడమే అందుకు కారణం.

స్వల్పంగా పెరిగిన సెనె్సక్స్





ముంబయి, జనవరి 17: గత రెండు రోజుల మాదిరిగానే గురువారం కూడా ముంబయి స్టాక్ ఎక్ఛేంజ్ (బీఎస్‌ఈ)లో లావాదేవీలు లాభనష్టాల మధ్య ఊగిసలాడాయి. అయితే, చివరికి 52.79 పాయింట్లు (0.15 శాతం) పెరిగిన సెనె్సక్స్ 36,374.08 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా నిఫ్టీ 10,905.20 పాయింట్లు (0.14 శాతం) పెరగడంతో ట్రేడింగ్ ముగిసే సమయానికి 10,905.20 పాయింట్లుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ సూచీలు సానుకూల ధోరణులను ప్రదర్శించడంతో భారత స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో ముగిసింది. అయితే, ట్రేడింగ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకూ అనిశ్చితి కొనసాగింది. అమ్మకాల ఒత్తిడి కొంత సేపు పెరగడం, మరికొంత సేపు కొనుగోళ్ల తాకిడి ఏర్పడడంతో, సెనె్సక్స్ ఏ విధంగా ముస్తుందోనన్న అనుమానాలు తలెత్తాయి. కేంద్రం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు స్టాక్ బ్రోకర్లు, మదుపరులు మార్కెట్‌ను నిశితంగా గమనిస్తూ, ట్రేడింగ్ చేశారు. డిసెంబర్‌తో ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ముగిసిన నేపథ్యంలో, వివిధ భారీ కంపెనీల ప్రకటించబోయే ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. రూపాయి మారకపు విలువ బలోపేతం కాకపోవడంతో, ఐటీ కంపెనీల వాటాలకు డిమాండ్ తగ్గింది. రియల్ ఎస్టేట్ రంగం మాత్రం లాభాలను ఆర్జించింది. ఈ రంగం కొంతకాలంగా ఎదుర్కొన్న సమస్యలకు తెరపడిందని, ఇకపై రియాల్టీ రంగం భారీ లాభాలను ఆర్జిస్తుందని నిపుణులు అంటున్నారు. కాగా, ముడి చమురు ధర పెరుగుదల, రూపాయి మారకపు విలువ తగ్గడం వంటి అంశాలు కూడా స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేశాయి.

అయితే, దేశీయ మదుపరులు కొంత వరకూ కొనుగోళ్లు చేయడంతో, నష్టాలను అధిగమించిన స్టాక్ మార్కెట్ స్వల్ప లాభంతో ముగిసింది. లాభపడిన కంపెనీల్లో యాక్సిస్ బ్యాంక్ (1.91 శాతం), హెచ్‌సీఎల్ టెక్ (1.77 శాతం), హెచ్‌డీఎఫ్‌సీ (1.51 శాతం), టీసీఎస్ (1.34 శాతం), కోటక్ మహీంద్ర (1.24 శాతం), మహీంద్ర అండ్ మహీంద్ర (1.19 శాతం), పవర్ గ్రిడ్ (1.09 శాతం), వేదాంత (0.54 శాతం), హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.43 శాతం) లాభపడ్డాయి. వీటి లాభాలు సగటున 1.91 శాతంగా నమోదయ్యాయి. నష్టాలను ఎదుర్కొన్న కంపెనీల్లో సన్ ఫార్మా మొదటి స్థానంలో ఉంది. ఆ కంపెనీ వాటాలు ఏకంగా 5.78 శాతం పతనమయ్యాయి. ఎస్ బ్యాంక్, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ కంపెనీల వాటాలు సగటున 3.31 శాతం నష్టాలను చవిచూశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్), హెచ్‌యూఎల్ కూడా నష్టపోయినప్పటికీ, 1.12 శాతం పతనంతో కొంత వరకు ఊపిరి పీల్చుకున్నాయి.

వాణిజ్యభూమి

ఏడు మిలియన్ డాలర్ల సమీకరణ

- **ఫిన్‌టెక్ స్టార్టప్ ఇన్‌స్టామోజో ప్రకటన**

న్యూఢిల్లీ, జనవరి 17: ఫిన్‌టెక్ స్టార్టప్ ఇన్‌స్టామోజో తన ప్రస్తుత పెట్టుబడిదారుల నుంచి ఏడు మిలియన్ డాలర్లు (రూ.50కోట్లు) సమీకరించినట్టు బుధవారం నాడిక్కడ తెలిపింది. ఏసీపే, కలారి, బీనెక్ట్స్‌తోబాటు ఏంజెల్ ఇన్వెస్టర్ రష్మీక్వాత్రా సంస్థలు ఈ పెట్టుబడులు పెట్టాయని సంస్థ వివరించింది. కాగా సిరీస్-బీ రౌండ్‌లో జపాన్‌కు చెందిన గునోసీ సంస్థ కూడా తమ సంస్థ పెట్టుబడిదారుల్లో ఒకటిగా మారి ప్రగతికి దోహదం చేస్తోందని అధికారులు వివరించారు. ఇలావుండగా ఈ కంపెనీ మొత్తం 10 మిలియన్ డాలర్ల పెట్టుబడులు ఇప్పటి వరకు సమీకరించిందని ఇన్‌స్టామోజో సీఈవో, సహ వ్యవస్థాపకుడు సంపద్ స్వెయిన్ తెలిపారు. కొత్తగా సమీకరించిన నిధులను కంపెనీకి చెందిన రాయితీలు ప్రోత్సాహకాలతోబాటు, మొబైల్ విభాగం విభాగం విస్తరణకు, ప్రజ్ఞాపాటవాల పెంపునకు వినియోగిస్తామని ఆయన చెప్పారు. భారత మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) రంగంలో సరికొత్త విప్లవానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇటీవల లాజిస్టిక్ సర్వీసులోకి పెట్టుబడులు పెట్టడం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరం లోపు కంపెనీ మూడు నుంచి ఐదు అంకెల అభివృద్ధిని సాధిస్తుందని విశ్వసిస్తున్నామన్నారు. 2012లో ఈ కంపెనీని ఆకాష్ గెహానీ, ఆదిత్యసేన్ గుప్తా, స్వెయిన్ ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఈ కంపెనీ 2014లో తన తొలిరౌండ్ పెట్టుబడులను సమీకరించింది. తర్వాత జపాన్‌కు చెందిన 'ఏసీపే' సంస్థ సైతం సిరీస్ బీలో భాగస్వామిగా మారింది.

బులియన్

ముంబయిలో	
బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,166.00
8 గ్రాములు:	రూ.25,328.00
10 గ్రాములు:	రూ. 31,660.00
100 గ్రాములు:	రూ.3,16,600.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,386.096
8 గ్రాములు:	రూ. 27,088.768
10 గ్రాములు:	రూ. 33,860.96
100 గ్రాములు:	రూ. 3,38,609.6
వెండి	
8 గ్రాములు:	రూ. 332.00
10 గ్రాములు:	రూ. 415.00
100 గ్రాములు:	రూ. 4,150.00
ఒక కిలో:	రూ. 41,500.00

హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,108.00
8 గ్రాములు:	రూ. 24,864.00
10 గ్రాములు:	రూ. 31,080.64
100 గ్రాములు:	రూ. 3,10,800.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,324.064
8 గ్రాములు:	రూ. 26,592.512
10 గ్రాములు:	రూ. 33,240.64
100 గ్రాములు:	రూ. 3,32,406.4
వెండి	
8 గ్రాములు:	రూ. 332.00
10 గ్రాములు:	రూ. 415.00
100 గ్రాములు:	రూ. 4,150.00
ఒక కిలో:	రూ. 41,500.00

గిరిజన మండలికి నిధులు విడుదల చేయని బీజేపీ సర్కార్

- **త్రిపురలో వారం రోజుల పాటు నిరసన**
- **సీపీఎం సీనియర్ నేత బిప్లాబ్ కుమార్ దేవ్ వెల్లడి**

ఆగర్తలా, జనవరి 17:త్రిపుల గిరిజన స్వయంప్రతిపత్తి మండలికి నిధులు కేటాయించనందుకు నిరసనగా వారం రోజుల పాటు ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఎం ప్రకటించింది. త్రిపురలో బీజేపీ అధికారంలో ఉంది. ప్రతిపక్ష పార్టీగా అవతరించిన సీపీఎం నేత బిజన్‌ధార్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం స్వయంప్రతిపత్తి ఉన్న గిరిజన మండలికి రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. పక్షపాత ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. గత ఏడాది మార్చి నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోందన్నారు. బడ్జెట్‌లో నిధులను రూ.582 కోట్ల నుంచి రూ.117 కోట్లకు తగ్గించారన్నారు. ఈ నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేయడం లేదన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. తక్షణమే గిరిజన మండలి అవసరాలు తీర్చేందుకు రూ.95 కోట్లను విడుదల చేయాలన్నారు. గిరిజన మండలి ప్రాంతాల్లో పంచాయతీ వ్యవస్థలో మూడంచెల విభాగాన్ని ప్రవేశపెట్టాలన్నారు. కొక్ బరాక్ అనే స్థానిక గిరిజన భాషను రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్పించాలన్నారు. ఈ భాషను పరిరక్షించేందుకు ఇప్పటికే ఆరవషెడ్యూల్‌లో చేర్చారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో గిరిజనుల పట్ల వివక్ష తగదని ఆయన కోరారు. గిరిజన హక్కుల సంరక్షణకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

బంగారం మెరిసింది



న్యూఢిల్లీ, జనవరి 17: జాతీయ బులియన్ మార్కెట్‌లో గురువారం బంగారానికి డిమాండ్ పెరిగింది. పది గ్రాముల ధర 33,190 రూపాయలుగా మొదలైన మార్కెట్‌లో దేశీయ జ్యువెలరీ వర్తకులు, వ్యక్తుల కొనుగోళ్లు పెరిగాయి. దీనితో 110 రూపాయలు పెరిగిన పది గ్రాముల పసిడి ధర 33,300 రూపాయలకు చేరింది. అయితే, వెండి మాత్రం నష్టాలను ఎదుర్కొంది. కిలో వెండి ఏకంగా 300 రూపాయలు తగ్గడంతో, 40,200 రూపాయలకు పడిపోయింది. బుధవారం మార్కెట్ అనుకూలంగా ఉండడంతో 40,500 రూపాయలకు చేరుకున్న కిలో వెండి ధర ఈవారాంతం వరకూ అదే ధోరణిలో కొనసాగుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. కానీ, అందుకు భిన్నంగా వెండి రేటు పతనమైంది.

బంగారం వరుసగా నాలుగో రోజు కూడా లాభాలను ఆర్జించడం విశేషం. దేశీయ జ్యువెలరీ తయారీదారులు కొనుగోళ్ల పట్ల మొగ్గు చూపడంతో పసిడి ధర పెరిగిందని, ఈ వారం చివరి వరకూ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని అఖిల భారత సరఫా సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ సూచీలు కూడా సానుకూలంగా ఉండడం కూడా బంగారం ధర పెరగడానికి ఒక కారణమని పేర్కొంది.

వాటాల తాకట్టుకు.. రూ.700 కోట్ల పెట్టుబడులకు జెట్ ఎయిర్‌వేస్ సిద్ధం

న్యూఢిల్లీ, జనవరి 17: తమ వాటా 25శాతానికి తగ్గకుండా నిబంధనలు ఏర్పాటుచేస్తే తమ కంపెనీ జెట్ ఎయిర్ వేస్‌లో రూ.700 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ విమానయాన సంస్థ చైర్మన్ నరేష్ గోయెల్ గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తెలిపారు.ప్రస్తుతం జెట్ ఎయిర్ సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ వ్యూహాత్మక వాటాదారు ఎతిహాడ్ ఈ సంస్థకు క్రమంగా నిధులిచ్చి ఆర్థికంగా బలపరిచేందుకు కఠినతర నిబంధనలను ముందుకు తెస్తోంది. జెట్ ఎయిర్ వేస్ నుంచి చైర్మన్ గోయెల్ సైతం వైదొలగాలన్నది ఎతిహాడ్ నిబంధనల్లో ఒకటి. ఈక్రమంలో ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్‌కు జెట్ ఎయిర్ వేస్ చైర్మన్ గోయెల్ తాజాప్రదిపాదనలతో కూడిన లేఖ రాశారు. జెట్ ఎయిర్ వేస్‌కు రుణాలను అందజేసిన కన్సార్టియం ఆఫ్ ఇండియన్ బ్యాంక్స్‌లో ఎస్‌బీఐ నాయకత్వ బ్యాంకుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం తమ సంస్థ ద్రవ్య లోటును, బ్యాంకుల నుంచి రుణ గ్రౌండింగ్‌లో ఆలస్యాన్ని, పార్ట్‌నర్ ఎతిహాడ్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని తానీ లేఖ రాస్తున్నానని గోయెల్ ఎస్‌బీఐ చైర్మన్‌కు వివరించారు. తాను అన్ని ఆస్తులను తాకట్టుపెట్టేందుకు, 700 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా నరేష్‌కుమార్ గోయెల్ తెలిపారు. ఐతే తన వాటా 25 శాతం తగ్గకుండా ఉంచాలని ఆయన నిబంధన విధించారు. 'ఇది సాధ్యం కాకపోతే తాను ఎలాంటి నిధులనూ పెట్టుబడిగా పెట్టలేన'ని ఆయన తేల్చి చెప్పారు. లేదా ఒక వేళ తన వాటాలను బలోపేతం చేసుకునేందుకు ప్రత్యేక అనుమతిని ఇస్తే తప్ప తన సంస్థకు తాను అదనంగా నిధులు సమకూర్చుకోలేని పరిస్థితి ఉందన్నారు. కాగా గత డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జెట్ ఎయిర్ వేస్ సంస్థకు 5,79,33,665 షేర్లున్నాయి. ఇవి కంపెనీలో దాదాపు 51 శాతం వాటాను కలిగివున్నాయి. ఈ వైమానిక సంస్థ షేర్లు ప్రస్తుతం 3.54 శాతం తక్కువగా రూ.261.40 వంతున ట్రేడ్ అవుతున్నాయి. కాగా. వరుసగా రెండోరోజూ ఈ కంపెనీ షేర్ల పతనం కొనసాగింది. గురువారం సైతం 5 శాతం మేర షేర్లు తగ్గిపోయాయి.



..అనే నేను

ఇటీవల తెలంగాణాలో జరిగిన శాసన సభ ఎన్నికల్లో గెలుపొందిన టీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు చెందిన సభ్యులు గురువారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. కేటీఆర్, హరీష్‌రావు, పద్మాదేవేందర్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, సబితాఇంద్రా రెడ్డి, పద్మారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, నోముల నర్సింహయ్య, సయ్యద్ పాషాఖాద్రీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జగ్గారెడ్డి తదితరుల ప్రమాణస్వీకారం

మీలా శవరాజకీయాలు చేయం

చంద్రబాబుపై తలసాని ఫైర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శవరాజకీయాలు చేయడంలో దిట్టఅని అలాంటివి తాము చేయలేమని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబును చూస్తేనే ఆయన ఎలాంటివారో చెప్పేయవచ్చని చమత్కరించారు. 'తెలంగాణలో మీరు రాజకీయాలు చేస్తే సంసారం. అదే మేం ఆంధ్రాలో రాజకీయాలు చేస్తే వ్యభిచారామా?' అంటూ నిప్పులు చెరిగారు. ఆయనెప్పుడూ మోసపూరిత రాజకీయాలు చేస్తారని తలసాని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూసేది ఒక్క చంద్రబాబేనని ఎద్దేవా చేశారు. ఏపీ సీఎంలా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దొంగ రాజకీయాలు చేయరని ఆయన స్పష్టం చేశారు. కాగా ఏపీలో ఒక్క యాదవ సంఘానికే కాదు, అన్ని బీసీ సంఘాలకు తాము చేయూతనిస్తామని తలసాని ప్రకటించారు. తెలంగాణ వాళ్ల బంధాలు, బంధుత్వాల గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదని ఆయన విమర్శించారు. తాము దేవాలయాల వద్ద రాజకీయాలు చేయమని, అలాచేయదల్చుకుంటే ఎన్నికల బరిలో తేల్చుకుంటామని తలసాని హెచ్చరించారు. ఫెడరల్ ఫ్రంట్ లేదంటున్న చంద్రబాబుకు ఫ్రంట్ అంటే ఏమిటో త్వరలో తెలుస్తుందని ఆయన తెలిపారు. బాబు పదేపదే చిల్లర రాజకీయాలు చేస్తే తమ సమాధానాలు చాలా దీటుగా ఉంటాయని ఆయన చెప్పారు. మరో 15 రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆంధ్రాకు వస్తారని, అప్పుడు దమ్ముంటే ప్రతాపం చూపించాలని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సవాల్ చేశారు. ప్రజల సొమ్ములను ప్రకటనల పేరుతో వృథా చేస్తోంది బాబేనని ఆయన ఆరోపించారు. కులాల మధ్య గొడవలు పెట్టేది ఆయనేనని ఇది అందరికీ తెలిసిందేనని ఆయన విమర్శించారు. 'ఉమ్మడి రాష్ట్రంలో మీరు సీఎంగా ఉన్నప్పుడు నీళ్లు, కరెంటు లేదు. ప్రస్తుతం నీళ్లు, కరెంట్ సమస్య లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కింది'అని తలసాని వ్యాఖ్యానించారు. ఫెడరల్ ఫ్రంట్‌పై ఆంధ్రా మంత్రులు అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఊసరవెల్లి కూడా ఏపీ సీఎంను చూస్తే సిగ్గు పడుతుందని ఆయన చలోక్తివిసిరారు. ఆంధ్రాలో 100 శాతం రాజకీయాలు చేస్తామని తలసాని ప్రకటించారు. లోటు ఆదాయం ఉన్న ఆంధ్రాలో నవ నిర్మాణ దీక్షతో వందల కోట్ల వృథా చేస్తున్నారని చెప్పారు. ఏపీ సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా తాను అక్కడ పర్యటించానని ఆయన గుర్తు చేశారు.



రాష్ట్రంలో నూతన పార్టీ ఆవిర్భావానికి సిద్ధం

విజయవాడలో త్వరలో నామకరణం

పుంగనూరు, జనవరి 17: రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాజకీయాలోకి అడుగు పెడుతున్నాని పారిశ్రామిక వేత రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన చిత్తూరు జిల్లా పుంగనూరులోని ఆయన నివాసంలో విలేఖర్ల సమావేశం లో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో వైకాపా, టీడీపీ , బీజేపి, కాంగ్రెస్, జనసేన పార్టీలకు దీటుగా యువనాయకత్వంలో నూతన పార్టీ పురుడు పోసుకోనుందన్నారు. త్వరలోనే విజయవాడలో తమ పార్టీ ఆవిర్భావం, నామకరణం ఆవిష్కరిస్తామని రామచంద్రయాదవ్ తెలిపారు. తాను పుంగనూరు వాసినని ఈప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసమే తాను రాజకీయాలోకి వస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో న్యాయవాది వెంకటముని, చంద్రారెడ్డియాదవ్, బిసి సంఘ నేత అద్దాల నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి గురవుతున్న హెచ్-1బి వీసా ఉద్యోగులు



వాషింగ్టన్, జనవరి 17: అమెరికాలో హెచ్-1బి వీసాపై పనిచేస్తున్న ఉద్యోగులలో చాలామంది సరైన పనివాతావరణం మధ్య ఉద్యోగం చేయడం లేదని, వారు దోపిడీకి గురవుతున్నారని ఈ విషయంలో ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకురావాలని, ముఖ్యంగా జీతాల పెంపు, పనివాతావరణం మెరుగుపర్చడం వంటివి వెంటనే చేపట్టాల్సిన అవసరం ఉందని అమెరికాకు చెందిన ఒక అధ్యయన సంస్థ పేర్కొంది. ముఖ్యంగా హెచ్-1బి వీసాపై పలువురు భారతీయ ఐటి నిపుణులు, ఇతరులు అమెరికాలో ఎక్కువగా పనిచేస్తున్న నేపథ్యంలో సౌత్ ఆసియా సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ (థింక్-ట్యాంక్) వెల్లడించిన నివేదికలో ఉద్యోగులకు మంచి పని వాతావరణం కల్పించాలని, వారికి హక్కులు కూడా ఇవ్వాలని సూచించింది. హెచ్-1బి వీసాదారులకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, వారికి అమెరికా పౌరసత్వం కల్పిస్తామంటూ కొన్నిరోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తమకు నిపుణుల అవసరం ఉందని, వారికి తమ దేశం ఎప్పుడూ ఆహ్వానం పలుకుతుందని, హెచ్-1బి వీసా ఉన్నవారు సులభంగా తమ దేశ పౌరసత్వాన్ని కూడా పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతమున్న వీసావిధానం అమెరికా పౌరులకే కాక, దీనిపై వచ్చి ఇక్కడ పనిచేస్తున్న ఇతర దేశస్థులకు కూడా హాని చేస్తోందని నివేదికలో పేర్కొన్నారు. వారు చేస్తున్న పనికి తగిన వేతనం లభించడం లేదని, తరచూ మంచి పని వాతావరణం లేని చోట పనిచేయాల్సి వస్తోందని నివేదికలో తెలిపారు. దీనిని అధిగమించడానికి ప్రభుత్వం వారికి పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని, మంచి పని వాతావరణం సృష్టించాలని అప్పుడే ఇతర దేశస్థులతో పాటు అమెరికన్ల జీవితాలు సైతం మరింత మెరుగవుతాయని, పేర్కొంది. దీనివల్ల అమెరికాలో నిపుణుల కొరత భర్తీ అయ్యి దేశం ఆర్థికంగా మరింత అభివృద్ధిని సాధిస్తుందని అన్నారు.

అంతర్రాష్ట్ర బదిలీలకు గడువు పొడిగింపు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: విభజన చట్టంలో భాగంగా అంతరాష్ట్ర ఉద్యోగుల బదిలీలకు గడువును పెంచారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకూ ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఇరు రాష్ట్రాలకు చెందిన సమన్వయ కర్త, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎల్ ప్రేంచందర్‌రెడ్డి వెల్లడించారు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించన మార్గదర్శికాలపై ఆయన స్పష్టత ఇచ్చారు. లోకల్, జోనల్, జిల్లా కేడర్‌కు చెందిన ఉద్యోగులు బదిలీకి అర్హులని ఆయన చెప్పారు. భార్య,భర్తల బదిలీల ఉత్తర్వుల్లో ఆలస్యం అయ్యిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల బదిలీల్లో స్పష్టత ఇస్తూ గడువును జూన్ 30వ తేదీకి పెంచిందన్నారు.

ఐరాసలో సంస్కరణలు తేవాలి

- రాజకీయ సంకల్పంతోనే సాధ్యం
- ప్రపంచ దేశాలు సమష్టిగా నిర్ణయం తీసుకోవాలి
- భద్రతా మండలిలో సంస్కరణలు వెంటనే అమలు చేయాలి
- సాధారణ సభ అధ్యక్షురాలు మారియా ఫెర్నాండా ఎస్పినోసా



ఐక్యరాజ్యసమితి, జనవరి 17: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు వేగవంతమవుతాయనే ఆశాభావంతో ఉన్నట్లు ఐరాస అధ్యక్షుడు మారియా ఫెర్నాండా ఎస్పినోసా అన్నారు. బలమైన రాజకీయ సంకల్పం లేకుండా ప్రగతిని సాధించడం సంక్లిష్టమన్నారు. గత ఏడాది ఐరాస 73వ సదస్సులో ఆయన అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆమె గతంలో ఈక్వెడార్ దేశంలో విదేశాంగశాఖ మంత్రిగా పనిచేశారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రపంచదేశాలు సహకరించాలన్నారు. భద్రతా మండలిలో మార్పులు, చేర్పులు, విధి విధానాల్లో సంస్కరణలు తేవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ దిశగా అజెండా ఖరారు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది ఈ అంశంపై ప్రధాన దేశాల అధినేతలతో చర్చిస్తామన్నారు. ఈ అంశంపై బహిరంగంగా ఇప్పటికిప్పుడు మాట్లాడలేమని, కాని అంతరంగికంగా చర్చలను వేగవంతం చేసినట్లు ఆమె చెప్పారు. ఐరాసలో సంస్కరణలు రావాలని అన్ని దేశాలు 25 ఏళ్లుగా కోరుకుంటున్నాయన్నారు. కాని ఒక్క అడుగు కూడా ముందుకేయలేకపోతున్నామన్నారు. ఐరాసలో మార్పులు రావాలని తీర్మానం చేసిన సమయంలో తాను అంబాసిడర్‌గా ఉన్నానని చెప్పారు. అన్ని దేశాల్లో అధినేతలు, విదేశాంగ విధానాల్లో రాజకీయపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. భద్రతా మండలిలోసంస్కరణలు వేగవంతం చేయాలని పోరాడుతున్నదేశాల్లో భారత్ ముందంజలో ఉందన్నారు. 21వ శతాబ్ధం అవసరాలకు తగ్గట్టుగా ఐరాసను తీర్చిదిద్దాలన్నారు. శాశ్వత, తాత్కాలిక సభ్యత్వంపై సభ్యుల సంఖ్యను విస్తరించాలన్నారు.

ఆరోగ్య సమాజంగా మారుతున్న ప్రపంచం

బిల్‌గేట్స్ సతీమణి మెలిందా గేట్స్



వాషింగ్టన్, జనవరి 17: గత 20 సంవత్సరాలుగా ఆరోగ్యపరిరక్షణకు పెద్దయెత్తున నిధులు కేటాయిస్తుండటంతో ప్రపంచం ఆరోగ్య సమాజంగా పెనుమార్పు చెందుతోందని, అమెరికాకు చెందిన ప్రముఖ దాత, బిల్‌గేట్స్ సతీమణి మెలిందా గేట్స్ గురువారం తెలిపారు. బిల్, మెలిందా గేట్స్ ఫౌండేషన్ అంతర్జాతీయ సమావేశం అనంతరం ఆమె మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, తన భర్త బిల్‌గేట్స్‌తో కలిసి ఆమె విలేఖరులతో మాట్లాడుతూ భారత్, ఇండోనేషియా, వియత్నాం వంటి దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి బాటలు వేసుకుంటున్నాయని, దీంతో సహజంగానే ప్రజల జీవన స్థితిగతులు మెరుగయ్యాయని ఆమె అన్నారు. 1990 తర్వాత మరణాల శాతం కూడా తగ్గిందని ఆమె చెప్పారు. తాను, తన భర్త బిల్‌గేట్స్ ఆశావాదులమని ఆరోగ్యవంతమైన సమాజాన్ని చూడాలన్నది తమ కోరికని ఆమె అన్నారు. 2000 సంవత్సరం నుంచి ప్రపంచదేశాలు మనిషి ఆరోగ్యపరిరక్షణపై దృష్టిసారించాయని, దానిపై ఎక్కువ శాతం నిధులు కేటాయించడంతో ఆరోగ్యకరమైన సమాజం తయారవుతోందని అన్నారు. తాను, బిల్‌గేట్స్ కలిసి ప్రపంచంలోని పలు దేశాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడేటప్పుడు 1990 వరకు ప్రజలు హెచ్‌ఐవీ, మీజిల్స్, మలేరియా వంటి వ్యాధుల బారిన పడి మృతి చెందేవారని, ఇప్పుడు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని వివరించారన్నారు. పోలియో మహమ్మారి వ్యాధి గురించి ప్రపంచవ్యాప్తంగా పెద్దయెత్తున ప్రచారం సాగడంతో ఇంచుమించు అది నిర్మూలమైనట్టేనని ఆమె అన్నారు. ఇప్పటివరకు గ్లోబల్ ఫండ్ ద్వారా ఎయిడ్స్, టీబీ, మలేరియా వంటి వ్యాధులపై పోరాటం సాగిందని, ఇప్పుడు శిశు, ప్రసవ మరణాలను తగ్గించడంపై దృష్టి సారిస్తున్నారని తెలిపారు. 1999 నుంచి తమ ఫౌండేషన్ 10 బిలియన్‌ల యూఎస్ డాలర్లను కేవలం ఆరోగ్య పరిరక్షణకే ఖర్చు చేసినట్టు ఆమె వివరించారు. తాము ఖర్చు చేస్తున్న నిధులకు తగిన ప్రతిఫలాన్ని తాము చూస్తున్నామని, తమ సహాయం భవిష్యత్‌లో కూడా ఇలాగే కొనసాగుతుందని ఆమె తెలిపారు.

బొగ్గుగనుల్లోంచి మృతదేహం వెలికితీత

గనిలోపల పుర్రెలున్నట్టు గుర్తించిన డైవర్స్

న్యూఢిల్లీ/షిల్లాంగ్, జనవరి 17: మేఘాలయలోని బొగ్గుగనిలోకి వెళ్లి చిక్కుకుపోయిన వారిలో ఒకరి మృతదేహాన్ని నేవీ డైవర్స్ కనుగొన్నారు. గనిలోపల కొన్ని పుర్రెలు కూడా ఉన్నట్టు వారు గుర్తించారు. నేవీ అధికార ప్రతినిధి కెప్టెన్ డీకే శర్మ గురువారం న్యూఢిల్లీలో మాట్లాడుతూ గనిలోపల సుమారు 160 నుంచి 210 అడుగుల లోతున బుధవారం రిమోటెడ్ ఆపరేటెట్ వెహికల్ (ఆర్‌ఓవీ) ద్వారా డైవర్లు ఒక వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారని చెప్పారు. అయితే ఆ శరీరం ఎవరిదో ఇంకా గుర్తించలేదని డాక్టర్ల బృందం ఆ మృతదేహాన్ని పరీక్షిస్తోందని చెప్పారు. ఎలుక బొరియా లాంటి దాని ద్వారా గనిలోకి గత ఏడాది డిసెంబర్ 13న అక్రమంగా 15 మంది మైనర్లు ప్రవేశించారు. అయితే అప్పుడే వరదలు రావడంతో వారు అందులోనే చిక్కుకు పోయారు. వారిని వెలికితీయడానికి కోర్టు ఆదేశాల ప్రకారం డిసెంబర్ 30 నుంచి అధికారులు సహాయచర్యలు చేపట్టారు. లోపల ప్రవహిస్తున్న నీటిలో గంధకం శాతం ఎక్కువగా ఉండటం వల్ల మృతదేహాలు త్వరగా పాడైపోయాయని కెప్టెన్ డీకే శర్మ తెలిపారు. నేవీ డైవర్స్‌కు లోపల పలు పుర్రెలు ఉన్నట్టు ఆర్‌ఓవీ ద్వారా కన్పించిందని ఆయన చెప్పారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీయడం చాలాక్లిష్టమైనదని పైగా చాలారోజులు కావడం వల్ల వారందరూ మృతి చెంది ఉంటారని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు.

లాభదాయక వ్యవసాయానికి దీర్ఘకాలిక ప్రణాళిక

- అగ్రి -విజన్ సదస్సులో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- రైతుకు రెట్టింపు ఆదాయం కోసం కలిసి రావాలి
- ఆధునిక సాంకేతికతను అమలుచేస్తే లాభాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: వ్యవసాయ రంగం మీద సానుకూలమైన పక్షపాతం చూపుతూ , వనరుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని స్థిరమైన, మరింత లాభసాటి రంగంగా మార్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికపై ఈ రంగంలో నిర్మాణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో అగ్రి-విజన్ సదస్సును శుక్రవారం నాడు ఉప రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్పాదకత క్షీణించిందని, సహజ వనరుల లభ్యత తగ్గిపోతోందని, ఆహారం కోసం వేగంగా పెరుగుతున్న గిరాకీ , వ్యవసాయ ఆదాయాలు తగ్గిపోవడం, వ్యవసాయ భూమి తగ్గుతుండటం, వాతావరణ మార్పులు వంటి ఎన్నో సవాళ్లను భారతీయ వ్యవసాయ రంగం ఎదుర్కొంటోందని అన్నారు.



హైదరాబాద్‌లో అగ్రి-విజన్ సదస్సు మాట్లాడుతున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు పెరుగుదల చాలా కీలకమని , ఈ రంగం సాధికారత ద్వారానే పేదరికాన్ని తగ్గించడం సాధ్యపడుతుందని అన్నారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న రంగాల్లో లక్షలాది మందికి జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. భారతదేశ జీడీపీలో వ్యవసాయరంగానిది 18 శాతమని, అదే సమయంలో దేశంలో 50 శాతం మందికి ఉపాధిని అందిస్తోందని తెలిపారు. 2022 నాటికి వ్యవసాయ దారుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాలు, శాస్త్రీయ సమాజం , కృషి విజ్ఞాన్ కేంద్రాలు, రైతుల ఉమ్మడి ప్రయత్నం అవసరమని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో సంస్కరణల ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపట్టిందని, ఈ నేపథ్యంలో రైతులు సాంకేతికతకు మరింత చేరువయ్యే నీటిపారుదల సదుపాయాలు, గిడ్డంగులు, శీతల గిడ్డంగులు వంటి వ్యవసాయ మౌలిక సదుపాయాల పెంపకం, కనీస మద్దతు ధర పెరుగుదల వంటి వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ అనుబంధ రంగాల మీద కూడా దృష్టి పెట్టాలన్న ఉప రాష్ట్రపతి వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు కలవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇలాంటి చొరవ ఎగుమతులకు ఆస్కారంతో పాటు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు సాయపడతాయని, రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో అవగాహన ద్వారా వృధాను అరికట్టవచ్చని తెలిపారు. రైతు ఆదాయాన్ని పెంచేందుకు మార్కెట్‌తో వారికి సత్సంబంధాలు కీలకమని, సన్నకారు రైతులకు ఆ అవకాశాలు ఉండటం లేదని, 85 శాతం మంది రైతులు ఈ తరహా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , ఈనామ్ వంటి ఆధునిక పద్ధతులు ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చని అన్నారు. భారతదేశం ఆహార దిగుమతి మీద ఆధారపడి లేదని, స్వీయ ఆహార భద్రత మనకు చాలా కీలకమని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెరుగుతున్నాయని, సమర్థవంతమైన సంస్థాగత సంస్కరణలతో పాటు , జాతీయ , ప్రాంతీయ స్థాయిలో ఆహార , పోషకాహార భద్రతతో సహా వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సవాళ్లను అధిగమించడం కీలకమని అన్నారు.

వాతావరణ పరిస్థితులను అధిగమించే దిశగా వ్యవసాయంలో మార్పులు రావాలని, ఉత్పాదకతను పెంచేందుకు నవీన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన సాయిల్ హెల్త్ కార్డ్ స్కీమ్, ప్రధాన మంత్రి కృషి సించయ్ యోజన, పరంపరాగత్ కృషి వికాస్ యోజన , ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వంటి గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రాలు కృషి చేయాలని ఉప రాష్ట్రపతి సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో దేశంలో వివిధ వర్శిటీలకు చెందిన విద్యార్థులు, కార్నెల్ యూనివర్శిటీ విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులతో పాటు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అనిల్ కుమార్ ఏపూరు, సమీర్ గోయల్, టీఆర్ కేశవన్, కార్నెల్ వర్శిటీ డీన్ డాక్టర్ మ్యాక్స్ జే ఫీపర్, డాక్టర్ గిరీష్‌రెడ్డి, డి రాజు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy,
PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

C M Y K

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

శుక్రవారం, 18 జనవరి 2019



బాల్యాన్ని బహుమతిగా ఇద్దాం..



'నేటి బాలలే రేపటి పౌరులు.. బాలలే భారత భాగ్య విధాతలు..' -ఇలాంటి నినాదాలు వింటున్నప్పుడు మధురాతిమధురమైన అనుభూతి ఏదో మనల్ని మైమరిపిస్తుంది. మనం మన పిల్లలను నిజంగా ప్రేమిస్తున్నామా? ఈ విషయమై మనల్ని మనం ప్రశ్నించుకోగలమా? మన దేశంలో బాల్యం అనేక దృశ్యాలను ఆవిష్కరిస్తుంది. కొన్ని దృశ్యాలు మనసును పరవశింపచేస్తాయి. మరికొన్ని దృశ్యాలు గుండెను బరువెక్కిస్తాయి. బాల్యం ఎవరికైనా మధుర జ్ఞాపకమే. కానీ, అందరి బాల్యం ఒక్కలా ఉండదు. ఒక చోట బాల్యం ఉరకలెత్తే కడలి ప్రవాహం. మరోచోట అది ఎండిపోయిన సాగర గర్భం. కొందరికీ పట్టు మంచాలు సేద తీరిస్తే ,మరి కొందరిని కళ్లు తెరచీ తెరవక ముందే మృత్యువు వెంటాడుతుంది. మన దేశంలో ఏటా దాదాపు పన్నెండు లక్షల మంది శిశువులు నెల నిండకుండానే కన్నుమూస్తుండడం ప్రపంచంలో మరెక్కడా లేని విషాదం.

బాల్యం ఓ అద్భుత వరం.. పెద్దలకు బాల్యం గుర్తుకొస్తే చాలు భారమైన వయసు తేలికవుతుంది. అలనాటి జ్ఞాపకాలను మరోమారు మనసులోనే బాల్యం ఆవిష్కరింపజేస్తుంది. జీవితంలో ఒక్కసారైనా బాల్యాన్ని తలుచుకోని మనిషి ఉండడు. ముద్దు ముద్దు మాటలతో, అల్లరి చేష్టలతో ఇంటిల్లిపాదినీ అలరించే బాలలంటే అందరికీ ప్రేమే. ప్రకృతి సహా అందరి ప్రేమకు అర్హులైనవారు బాలలు మాత్రమే. వారికోసం ఏటా మనం ప్రత్యేకంగా బాలల దినోత్సవం నిర్వహిస్తున్నాం. బాలలంటే బడికి వెళ్ళే పిల్లలే కానక్కరలేదు. సాటి పిల్లల్లా విద్య ద్వారా ఉత్తమ భవిష్యత్తును అందుకోవాలని ఆశించినా, ఆర్థిక స్థితిగతుల వల్ల, బడికి దూరమై బ్రతుకు భారాన్ని అతి పిన్నవయసులో మోయవలసిన పరిస్థితిలో ఉన్నవారూ బాలలే. భవిష్యత్తంటే ఏ పూటకాపూట కడుపు నింపుకోవడమే అనే లక్ష్యానికి ఎదురీది బతికే ప్రతి బాలుడు, ప్రతి బాలిక బాల్యాన్ని ఆస్వాదించవలసిందే. మరి.. వారు బాల్యాన్ని ఎందుకు కోల్పోతున్నారు? అని ఆలోచిస్తే అనేక కారణాలు కనిపిస్తాయి. ప్రధాన కారణం మాత్రం బాలల హక్కులను కాలరాస్తున్న మన పాలకుల నిర్లక్ష్యధోరణి.

దేశంలో బాల్యాన్ని హాయిగా అనుభవిస్తున్న పిల్లల సంఖ్య చాలా తక్కువ. తల్లిదండ్రుల పేదరికం పిల్లలను ఆనందానుభూతుల్లోకి కాకుండా నరకంలోకి నెడుతోంది. బాలకార్మికులు, ఆకలితో అల్లాడే పిల్లలు మన దేశంలోనే ఎక్కువ. కొన్ని కోట్ల మందికి అసలు బాల్యమే లేదు. ఎందుకంటే పుట్టిన 5 ఏళ్ల లోపే వారు మరణిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మరణిస్తున్న ఐదేళ్ళ వయస్సు లోపు పసి పిల్లల సంఖ్య భారత్‌లోనే అత్యధికంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఐదేళ్ళ వయస్సు లోపున్న పిల్లల మరణాలలో మూడో వంతు మన దేశంలోనే జరుగుతున్నాయి. 2017 లో మరణించిన పిల్లల్లో 22 శాతం మంది భారత్‌లోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. భారత్‌లో పుట్టిన వెయ్యిమంది శిశువుల్లో 62 మంది ఏడాదిలోపే చనిపోతుంటే, మిగిలిన వారిలో కొంతమంది పోషకాహార లోపంతో మృతి చెందుతున్నారు. ఏటా 14.5 కోట్ల మంది పిల్లలు పుట్టిన రెండుమూడేళ్లకే తనువు చాలిస్తున్నారని ఐరాస తెలపడం మనదేశ పాలనలోని డొల్లతనాన్ని తెలియజేస్తుంది. శిశు మరణాలను నివారించడంలో ప్రభుత్వాలు ఘోరంగా వి ఫ ల వ కౌ త ు న్నాం ు ు. వాగాడంబరం... ఆచరణశ రాన్యత శైశవానికి శాపాలుగా మారుతున్నాయి. చాలా గ్రామాల ఆసుపత్రులలో మౌలిక వసతులు లేకపోవడం, ఆసుపత్రులున్నా డాక్టర్లు లేకపోవడం,మందులు లేకపోవడం ... మరణాల రేటు పెరగడానికి ప్రధాన కారణమవుతోంది. ఏజెన్సీ ప్రాంతాలలో సరైన వసతులు లేకపోవడం వలన కలిగే చిన్నారుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని పౌర సమాజం, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నా పాలకులకు చీమకుట్టి నట్లయినా లేకపోవడం భాధాకరం.



నేడు మనిషి తన బాల్యదశను క్రమ క్రమంగా కోల్పోతూ వస్తున్నాడు. నవ నాగరిక సమాజంలో బాల్యం చిదిమివేయబడుతోంది. లేనివాళ్లింటో ఆకలి, అనారోగ్యం, అవిద్యతోనూ బాల కార్మికులుగాను చిదిమివేయబడుతున్న బాల్యం, ఉన్నవాళ్లింట్లో రెండు మూడేళ్లకే ప్రారంభమవుతున్న ప్రైవేటు, కాన్వెంటు చదువులు, కార్పొరేట్ స్కూళ్లలో సర్వనాశనం అయిపోతోంది. మానవ ధర్మం ఛిద్రమైన ఈ సమాజంలోకి రావాలంటేనే శిశువుకు వేదన కలుగుతోంది. ఈ లోకంలో జరిగే అకృత్యాలను చూసే ధైర్యం లేక బాలలు మౌనంగా రోదిస్తున్నారు. అందుకే ఆరోగ్యవంతమైన శిశువులను స్వేచ్ఛగా ఎదగనిద్దాం.

మన దేశంలో కోట్లాది చిన్నారుల్లో చాలామంది శారీరకంగా మానసికంగా ఎదుగుదల లోపించి ఉంటున్నారు. ఆర్థిక, సామాజిక స్థితిగతుల కారణంగా ఈ అభివృద్ధి లోపం ఏర్పడుతున్నమాట వాస్తవం. రేపటి జ్ఞానవంతమైన శక్తిమంతమైన, ఆరోగ్యవంతమైన నవభారతాన్ని నిర్మించాలంటే... నేటి బాలల అవసరాలను తీర్చడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. అందుకు సమయమాసన్నమైనది.

ఇక బాలికల సంగతి చెప్పనక్కరలేదు ఇంట్లో, బడిలో, గుడిలో ఎక్కడా వీరికి సరైన రక్షణ లేదు. స్వేచ్ఛగా ఎదగడం సంగతి అటుంచి, నిర్భయంగా బతకలేని పరిస్థితి ఏర్పడుతోంది. చదువుకున్న తల్లిదండ్రులు, సంపన్న కుటుంబాల పరిస్థితి వేరు. వలస వెళ్ళేవారు, తల్లిదండ్రులు పట్టించుకోని వారు, తాగుబోతుల పిల్లలు, అనాథలు ఇలాంటి వారి పరిస్థితి గురించి తలుచుకుంటే ఎవరికైనా బాధ కలగడం ఖాయం. ప్రభుత్వ బాలికల వసతి గృహాలు, హాస్టళ్ల గురించి చెప్పనవసరం లేదు. వసతి గృహాలలో బాలికలు సౌకర్యాలకు నోచుకోవడం లేదు. పైగా పలురకాల వేధింపులకు లోనవుతున్నారు. హాస్టళ్లలో పేద బాలికలపై లైంగిక వేధింపులు యథేచ్ఛగా గురవుతున్నారు.

ఒకచోట బడి పిల్లలు రాజ కుమారుల్లా దర్శనమిస్తారు. మరోచోట యోగి వేమనల్లే ఎదురొస్తారు. ఒకరికి వంటినిండా మోయలేనన్ని బరువులు. షూ, టై, బ్యాడ్జి, రిబ్బన్, వీపు మీద బ్యాగ్. వీటిలో ఏది లోపించినా అది నేరం. వాటిని మరచిపోయినా, దుస్తులు మాసిపోయినా వళ్లంతా వాతలతో శిక్ష. మరొకరిది శరీరాన్ని కప్పుకోలేని దైన్యం. సుర్రున కాలే రోడ్డుమీద నడవాలన్నా, ముళ్ల బాటలో పరుగెత్తాలన్నా కనీసం చెప్పులేసుకోలేని దౌర్భాగ్యం కొందరిది. అతుకుల బొంతలే వారికి యూనిఫాం. ఎందుకీ దుస్థితి ? ఎవరిదా పాపం? బంగారు చెంచాలో తినాలని కొందరి నొసటఎవరు వ్రాసారు ? చెత్త కుప్పల్లో మెతుకులు ఏరుకొని తినమని మరికొందరికి ఎవరు చెప్పారు? ఇదంతా తలరాత అని సర్దుకుందామా ? ఏమిటీ దౌర్భాగ్యం ? మరెందుకీ దైన్యం? బాలబాలికలకు అందమైన బాల్యాన్ని ఇవ్వలేమా?

పిల్లలకి బహుమతిగా ఏమివ్వబోతున్నారు? ఖరీదైన ఎలక్ట్రానిక్ ఆట వస్తువులు, థీమ్ పార్కు, మాల్స్‌కు పర్యటనలు..? ఖరీదైన మొబైల్ ఫోన్ ఇస్తారా? భవిష్యత్తు గురించి బాగా ఆలోచించి.. ఆర్థిక బాండ్లూ, బీమా పథకాలను కానుకగా ఇవ్వాలనుకుంటున్నారా? వారి పేరు మీద లక్షలు కాదు కాదు కోట్లు కూడబెట్టాలనుకుంటున్నారా..? ఇవన్నీ చేయండి మంచిదే! కానీ వీటన్నింటికంటే మించినది ఒకటుంది అదే నేటి పిల్లలకి వాళ్ల బాల్యాన్నే వారికి బహుమతిగా ఇవ్వండి! నిజానికిది బహుమతి కూడా కాదు. వాళ్ల నుంచి మనం బలవంతంగా దూరం చేసిన ఒక అద్భుతమైన వరం. దాన్ని కచ్చితంగా వారికి తిరిగి ఇవ్వండి.



మనకున్న ఎన్నో కోరికల మధ్య వాళ్లని వర్తమానంలో పిల్లలుగా చూడటం మరిచిపోతున్నాం. మార్కుల కోసం కొందరు, ర్యాంకుల కోసం మరికొందరు, మంచి భవిష్యత్తునిస్తున్నామనే భ్రమలో ఇంకొందరు.. చిన్నారుల బాల్యాన్ని తీసేసుకుంటున్నాం! వారి నుంచి బలవంతంగా లాక్కుంటున్న దాన్ని మనం తిరిగివ్వాలి? ఉన్నదాన్ని ఎలా కాపాడాలి? తరగని ఆనందం, నియంత్రణలేని ఉద్వేగం... ఇవే బాల్యం లక్షణాలు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత గత ఏడు దశాబ్దాల కాలంలో నిశ్చితమైన నిబద్ధతతో కూడిన రాజ్యాంగం, చట్టనిబంధనల ద్వారా బాలల కోసం మనం ఏం చేశాం? వారి కోసం మరిన్ని అవకాశాలను, కార్యాచరణ విధానాలను, కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ శతాబ్దపు చివరి దశకంలో సాంకేతిక అభివృద్ధిలో భాగంగా ఆరోగ్యం, పోషణ, విద్య అంశాలతో బాటు నూతన ఆకాంక్షలను, అవకాశాలను పిల్లలకు కల్పించేలా ఎన్నో నిర్ణయాలు తీసుకున్నప్పటికీ వారి హక్కులను సంరక్షించే చర్యలు పూర్తి స్థాయిలో తీసుకోవడం లేదు. చిన్నారులపై ఎలాంటి ఒత్తిడి తేకుండా వారి మనోభావాలను, కనీస హక్కులను మనం గుర్తించాలి. మంచి బాల్యాన్ని బహుమతిగా అందించినపుడే వారి పట్ల మన బాధ్యతకు సార్థకత సమకూరినట్టు.

-కాళంరాజు వేణుగోపాల్ 8106204412

భలే.. భలే.. లెహంగాలు









పెళ్ళైనా, నిశ్చితార్థమైనా.. సంతోషకరమైన ఏ వేడుకైనా అమ్మాయిలు లెహంగాలకే ఓటేస్తున్నారు. లెహంగాలు దక్షిణ భారతదేశం సంప్రదాయం కాన ప్పటికీ ఉత్తర భారతదేశ సంప్రదాయ పోకడలు యువత ఎక్కువగా ఆచరించడం వల్ల పెళ్ళిళ్లలోని సంగీత్, మెహెందీ వేడుకల్లో లెహంగాలు ఆహా.. ఓహో.. అనిపిస్తున్నాయి. పెళ్ళికూతురుతో పాటు మిగిలిన అమ్మాయిలు కూడా పెళ్ళి వేడుకలైనా, కాస్త పెద్ద వేడుకలైనా వస్త్రధారణకు లెహంగాలనే ఎంచుకుంటున్నారు. ఇప్పుడు షాపింగ్‌మాల్స్‌లోనూ, బొటిక్స్‌లోనూ డిజైనర్ లెహంగాలు చాలా కొలువు తీరుతున్నాయి. కానీ వీటిని ఎంచుకునేందుకు కొన్ని చిట్కాలను తప్పనిసరిగా పాటించాలి. అవేంటంటే..

⁘ పెళ్లికోసం లెహంగాను ఎంచుకునేటప్పుడు కాస్త జాగ్రత్త వహించాలి. పెళ్లిలో ఎక్కువగా కూర్చోవడం, నిల్చోవడం, అటూ ఇటూ తిరగడం చేయాల్సి వస్తుంది. అందుకే లెహంగాను కొనుగోలు చేసేటప్పుడు ఒకసారి వేసుకుని చూసుకోవాలి. దానితో సులభంగానే నడవగలుగుతున్నారా? కూర్చుని తేలిగ్గా లేవగలుగుతున్నారా? లేక ఏవైనా ఇబ్బందులున్నాయా.. అని పరిశీలించుకోవాలి.

⁘ లెహంగా ఎత్తుకు సరిగ్గా సరిపోయేది కాకుండా కాస్త పొడవుగా ఉండేది ఎంచుకోవాలి. సరిగ్గా పాదాల వరకే వస్తే చూడటానికి అస్సలు బాగోదు. పైపెచ్చు ఎత్తు మడమలున్న చెప్పులు వేసుకుంటే లెహంగా పొట్టిగా కనిపిస్తుంది. కాబట్టి కాస్త పొడవుగా, నేలపై జీరాడేలా ఉన్న లెహంగాను ఎంచుకోవాలి.

⁘ షాపింగ్‌మాల్స్ ఆ వెలుగుల జిలుగుల్లో లెహంగాలు ఒక మాదిరిగా కనిపిస్తాయి. బయట సాధారణ వెలుగులో అవి మరోలా కనిపిస్తాయి. కాబట్టి లెహంగాను వేసుకుని ఫొటో తీసుకుంటే అది మీకు సరిగ్గా నప్పిందో లేదో తెలుస్తుంది.

⁘ బ్యాక్‌లెస్, నెట్టెడ్, డీప్‌నెక్, క్రాప్‌టాప్ ఎంచుకుంటే లో దుస్తుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒకసారి వాటిని కూడా వేసుకుని చూస్తే మంచిది.

⁘ లెహంగా డోరీలు కట్టుకోడానికి అనువుగా ఉన్నాయా లేదా కూడా చూసుకోవాలి. లెహంగా బరువు ఎక్కువగా ఉంటే డోరీలు లెహంగా బరువును ఆపలేవు. అప్పుడు వాటికి ప్రత్యామ్నాయాలు వెతుక్కోవలసి వస్తుంది. కాబట్టి లెహంగాను ఎంచుకునేటప్పుడే ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

⁘ వాతావరణాన్ని బట్టి లెహంగాలను ఎంచుకోవాలి. లెహంగాలకు వాడే వస్త్రం ఎలాంటిదో సరిచూసుకోవాలి. చలికాలం అయితే మక్‌మల్, సిల్క్ తరహావి, ఎండాకాలంలో కాటన్, ఇకత్ వంటివి ఎంచుకుంటే సౌకర్యంగానూ, ట్రెండీగానూ ఉంటాయి.

లెహంగాల గురించిన విషయాలను తెలుసుకున్నారుగా.. ఇంకెందుకాలస్యం వేడుకకు అనువైన ట్రెండీ లెహంగాలను ఎంచుకుని, అందరి చూపూ మీపైనే ఉండేలా అందంగా, ట్రెండీగా కనిపించండి మరి.

-మహి



అందమైన కళ్ల కోసం..

కళ్లు త్వరగా అలసిపోవడం, కళ్ల కింద నల్లని వలయాలు రావడం వంటివి కంప్యూటర్‌పై పని చేసేవాళ్లకు తరచూ జరుగుతుంటాయి. కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంతో పాటు కళ్లు ఆకర్షణీయంగా, మరింత అందంగా తయారవుతాయి.



⁘ కీరాని ముక్కలుగా కోసి రుబ్బి రసం తీయాలి. దాంట్లో కొద్దిగా రోజ్‌వాటర్‌ని కలిపి కళ్ల చుట్టూ పట్టించి అర గంట తర్వాత కడిగేసుకోవాలి.

⁘ గంధం పొడిలో కొద్దిగా నీళ్లు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఇందులో కొద్దిగా జాజికాయ పొడిని కలిపి రాత్రి పడుకునే ముందు కళ్ల చుట్టూ పట్టించాలి. తెల్లవారి కడిగేసుకుంటే కంటికి చలువే కాకుండా నల్లని వలయాలు కూడా తగ్గిపోతాయి.

⁘ బంగాళాదుంపని మెత్తగా రుబ్బి రసం తీయాలి. అందులో దూదిని ముంచి కనురెప్పలపై పదిహేను, ఇరవై నిముషాల పాటు ఉంచి కడిగేయాలి.

⁘ బేబీ ఆయిల్‌ని కళ్ల చుట్టూ సున్నితంగా మసాజ్ చేస్తే ఒత్తిడి తగ్గి రిలీఫ్ లభిస్తుంది.

⁘ కొబ్బరి నూనె చుక్కల్ని కళ్ల చుట్టూ వలయాకారంలో రాసి నెమ్మదిగా మసాజ్ చేస్తే కళ్ల కింద నలుపు తగ్గుముఖం పడుతుంది.

⁘ కనురెప్పలు దట్టంగా పెరగాలంటే క్రమం తప్పకుండా ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు కనురెప్పలకి ఆముదం రాయాలి.

⁘ కాచి వడబోసిన నీటిలో చిటికెడు ఉప్పు వేసి కళ్లను కడిగితే కళ్లు కాంతివంతంగా కనిపిస్తాయి.

⁘ టొమాటో రసాన్ని, నిమ్మరసాన్ని సమపాళ్లలో కలిపి కళ్లచుట్టూ పూయాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే కళ్ల కింద నలుపు తగ్గడమే కాకుండా ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుంది. ఈ మిశ్రమం రోజు విడిచి రోజు పూస్తే మంచి ఫలితం ఉంటుంది.

⁘ కీరాను చక్రాల్లా కోసి ఐదు నిముషాలు కళ్లమీద ఉంచినా కళ్లు తాజాగా ఉంటాయి.

⁘ ఒక గ్లాసు నీళ్లలో ఒక చెంచా ఉసిరికపొడిని వేసి అరగంటపాటు ఉంచాలి. ఈ తేటతో కళ్లను శుభ్రం చేసుకుంటే కళ్లు తాజాగా ఉంటాయి.

⁘ ప్రతిరోజూ ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవడం వల్ల కళ్లు అందంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ★

శ్రీనరసింహ శతకము

సీ. కర్ణయుగ్మమున నీ కథలు స ఓకినఁజాలు
పెద్ద పోగుల జోళ్ళు పెట్టినట్లు
చేతులెత్తుచు (బడఁజు జేయగల్గినఁ జాలుఁ
దొరియగ కడియాలు దొడిగినట్లు
మొనసి మస్తకముతో మ్రొక్కఁగల్గిన (జాలుఁ
జెలువమైన తురాయి చెక్కినట్లు
స్వరము నొవ్వంగ నీ స్మరణ గల్గినఁ జాలు
వింతగాఁగంఠీలు వేసినట్లు
తే: పూని నినుఁ గొల్చుటే సర్వభూషణంబు
లితర భూషణముల నిచ్చగింప నేల?
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: ఓ నరసింహ ప్రభూ! నీకథల్ని వినటమే చెవులకు పెద్ద దుద్దులు. చేతులెత్తి నిన్ను పూజిస్తే అవే చేతి కడియాలు, నీకు తలవంచి మనస్కరించటమే నెత్తిమీది కలికితురాయి. గొంతు నొప్పి పుట్టేట్లు నిన్ను చింతిస్తే ఆ చింతనమే కంఠాభరణం ప్రయత్నించి నిన్ను సేవించటమే అన్ని అలంకారాలు తాల్చినంత ఇతరాభరణాల అవసరం లేదు.



సాంప్రదాయక ఆధారాలైన ఈటెలు, వేట కొడవళ్ళు, బరిశెలు, వడిశాలలు, బాణా కర్రలూ ఉన్నాయి.

కళ్ళల్లో కసి, కోపం వుంది.

ఆయుధాల మీద బిగుసుకున్న పిడికిళ్ళలో అనంతమైన ప్రతిఘటనా శక్తి వుంది.

వాళ్ళ చూపుల్లో చురుకుదనం వుంది!

రాగ్యా కనిపిస్తాడా?

వాడు పెద్ద తప్పుచేసాడు. పెద్దల్ని ధిక్కరించాడు కట్టుబాట్లను కాలదన్ని, క్షంతవ్యం కాని నేరం చేశాడు.

భయపడి పారిపోతే అడవిలోనే ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోయేవాడు. లేదంటే పట్నానికి పోయేవాడు.

అలా చెయ్యలేదు వాడు!

తండా ఖాళీ చేయించి అడవి పుత్రుల జీవితాలతో చెలగాటమాడేందుకు వచ్చిన నాగరికులతో చేతులు కలిపాడు.

వాళ్ళ గుడారాల్లోనే తనూ వుండి ఏం కుట్రలు చేస్తున్నాడో!

మద్య మాంసాలకోసం రాగ్యా ఎన్ని అకృత్యాలైనా చేస్తాడు. ఉచ్ఛనీచాలు విస్మరించి ప్రవర్తిస్తాడు.

దానికితోడు చాంద్‌నీ తిరస్కారం, ఆమె చేసిన అవమానం అగ్నికి ఆజ్యం పోసింది!

రాజ్యా ఎంతకైనా తెగిస్తాడు!

అలాంటి ఆలోచనలతో అడవిపుత్రులు రాగ్యామీద మరింత కోపం పెంచుకొని గుణపాఠం నేర్పాలన్న సంకల్పంతో ఉన్నారు!

జాతర జనంలో ఎక్కడున్నాడో, రాగ్యా!

కనిపిస్తే వాడ్ని తాళ్ళతో బంధించాలి.

తండాకి తీసుకొని వెళ్ళి, పంచాయితీల చెట్టుదగ్గర చింత బరికలతో కొట్టాలి... వివరాలు ఆరా తియ్యాలి!

తెరవెనుక ఏం జరుగుతున్నదో, అంత మంది సాయుధ పోలీసులు ఎందుకక్కడ విడిది చేశారో, తండా ఖాళీ చేయించేందుకు జరుగుతున్న కుట్రలేమిటో తెలుసుకోవాలి!

వాళ్ళు డేగ కళ్ళతో రాగ్యాకోసం చూస్తూ, అణువణువూ గాలిస్తూ కొండ వైపుకు సాగిపోతున్నారు.

❊ ❊ ❊

కీ.శే.పెద్దిరెడ్డి కొడుకు ఎమ్మెల్యే పెంటారెడ్డి, గరుడాచలం కొండ దగ్గరికి వెళ్ళలేదు. ఎమ్మెల్లే గుడారంలో ఇద్దరూ కూర్చొని మంతనాలు చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొంటూ, అవసరమైన సూచనలు, సలహాలూ ఇస్తూ, ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నాడు ఎమ్మెల్లే!

అప్పగించిన పనులన్నీ రాగ్యా సక్రమంగా చేశాడని సమాచారం అందింది.

మఫ్టీ కానిస్టేబులు కనకయ్య అప్పటికే కొండ దగ్గరికి వెళ్ళాడు!



"దేవుడి మహిమగా భావించి పూనకాల నింకా నమ్ముతున్నారంటే ఆశ్చర్యంగా వుంది" అన్నాడు గరుడాచలం. పెదవి విరుస్తూ.

ఎమ్మెల్లే అదోలా చూసాడు!

"ఆకాశంలోకి దూసుకొని వెళ్ళి కొత్త గ్రహాల ఉనికిని తెలుసుకొంటుంటే- ఇప్పటికే మూఢ నమ్మకాలు, ఆచారాలు మనుషుల్ని విడిపోవటం వింతగా లేదూ?" గరుడాచలమే అడిగాడు.

"మూఢత్వం అని నువ్వే అన్నావు కదా"అని నవ్వాడు ఎమ్మెల్లే.

ఒక్క క్షణం ఆలోచించి-

"దేవర పూనింది నమ్ముతారా, అడవి పుత్రులు?" అని అడిగాడు.

"సందేహం లేదు! నమ్ముతారు."

"అంత నమ్మకంగా ఎలా చెప్తున్నాను."

"అదంతే! గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేసే డాక్టర్లే కొంతమంది దేవుడ్ని ధ్యానించి కానీ, థియేటర్లకు వెళ్ళరు. కొత్త గ్రహాల్ని కనుగొనేందుకు రాకెట్లు పంపించే శాస్త్రజ్ఞులు సైతం ముహూర్త బలం చూసి గానీ మీటలు నొక్కటం లేదు!

దేవుడి మీద పదవీ స్వీకార ప్రమాణం చేసి, పాలకులయ్యే నేతలు ఏనుగు వెలగ పండు తిన్నట్టు దేశాన్ని మింగుతున్నా, స్కాములతో లక్షల కోట్లు గడించి దాచుకున్నా పట్టించుకోడా దేవుడు.

అందుకే దేవుడి మీద ప్రమాణం చెయ్యటం.

ఉలుకూ పలుకూ లేని దేవుడు ఎంత మంచి వాడూ!?

నాగరికులే, ముక్కోటి దేవుళ్ళు చాలరన్నట్టు- కుక్కల్ని, పిల్లుల్ని, బల్లుల్ని, చీమల్ని, చిలకల్ని- దైవత్వం ఆపాదించి పూజిస్తుంటే, ఇక అమాయకులైన అడవి పుత్రులు నమ్మటంలో ఆశ్చర్యం ఏమున్నది? నమ్ముతారు నమ్మి తీర్తారు"అని గరుడాచలానికి ధైర్యం చెప్పాడు ఎమ్మెల్లే.

"నీకు దేవుడి మీద నమ్మకంవుందా" గరుడాలం అడిగాడు.

"దేవుడికి నామీద నమ్మకం వుంది! అందుకే ఎమ్మెల్లే అయ్యాను" అని, పగలబడి నవ్వాడు ఎమ్మెల్లే.

"జీవ రహస్యం తెలుసుకొనే 'బిగ్‌బేంగ్' ప్రయోగం పట్ల నీ అభిప్రాయం ఏమిటి" గరుడాచలం అడిగాడు.

"దేవుడ్ని నమ్మని వాళ్ళు పూర్తిగా నమ్మరు!"

"నమ్మేవాళ్ళో?"

"దృఢంగా నమ్ముతారు."

"అదెలా సాధ్యం."

"జీవి పుట్టుకకు కారణమైన 'దైవ కణం' అనబడే శూక్ష్మ మూల కణమే 'దైవ సృష్టి'అనుకుంటారు"అని ఎమ్మెల్లే చెప్పాడు.

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

కొంత సమయం మౌనంగా గడిచిపోయాక-

"చాంద్‌నీ విషయంలో అల్లర్లు జరుగుతాయేమో?"అని, ఎమ్మెల్లేవైపు చూశాడు గరుడాచలం.

"జరుగుతాయి." అన్నాడు ఎమ్మెల్లే.

"అడవి పుత్రులు వేల సంఖ్యలో వున్నారు."

"నీ భావం అర్థమైంది! మంది బలం చూసుకొని వాళ్ళు రెచ్చిపోతేనే మంచిది! అల్లర్లు జరగాలి. కాల్పులదాకా వెళ్ళాలి. విధ్వంసం విలయ తాండవం చెయ్యాలి."

"ప్రయోజనం."

"పనిలోపనిగా తండా ఖాళీ చేయించొచ్చు" అన్నాడు ఎమ్మెల్లే.

(ఇంకా ఉంది)

అనుక్షణికం

-వడ్డెర చండీదాస్

ఆ తర్వాత అతనికి పెళ్లి అయినాక, తన భార్య శాంత కూడా వేదవది లాంటిదే కావచ్చునన్న అనుమానం అతన్ని వేధిస్తుంది. ఆ సంఘర్షణ అతన్ని ఆత్మహత్య చేసుకునేదాకా నెడుతుంది. చివరి క్షణంలో శాంత ప్రోద్భలంతో తన సంఘర్షణను వివరించి-మనసు తేలిక చేసుకొని అప్పటినుంచీ ప్రశాంతంగా ఆనందంగా జీవిస్తాడు.

సుబ్రమణ్యం లాంటి చాలామంది మగవాళ్లకు యిది కనువిప్పు కాగలదు. ఇక్కడితో ఈ పాత్రను ముగిస్తే బాగుండేదని అనిపిస్తుంది. ఆనక సుబ్రమణ్యం బ్యాంక్‌లో దొంగ డిడిల కేసులో చిక్కుకోవటం, అతనికి పిచ్చి ఎక్కడం తిరిగి శాంత జీవితం కష్టాలపాలు కావటం- సుబ్రమణ్యం సఫర్డ్ మోర్ దేన్ హి డిజర్వ్‌డ్‌లా అన్పిస్తుంది.

అంకినీడు, విజయ్‌కుమార్, రంగారెడ్డి-వీళ్లంతా సెక్స్ కక్కుర్తిగాళ్లు. రంగారెడ్డి కొంచెం మానవత్వమున్నవాడు. అమ్మాయిలను మోసం చెయ్యటం, వేశ్యలతో గడపటం మిగతా ఇద్దరికీ రొటీన్ కార్యక్రమం. అంకినీడు, 'నళిని'తో పెళ్లికావటం, సినిమాను తీసి నష్టపోవటం, ఆ తర్వాత నళిని అతన్ని అన్ని విధాలా అదుపులో పెట్టడం ఈ పాత్రకు జరిగిన ముగింపు. విజయ్‌కుమార్ విప్లవ కమ్యూనిస్టు పార్టీ ముసుగులో ధన, కామ కక్కుర్తిని తీర్చుకోవటం, అతని బాధలకు తట్టుకోలేక మొదటి భార్య సీత ఆత్మహత్య చేసుకోవటం, రెండవ భార్య కనకదుర్గ అతన్ని అదుపులో పెట్టడం, అంతలో ఒక దొంగ నోట్ల కేసులో చిక్కుకొని అరెస్టు కాబడి, బెయిల్‌మీద బయటకు వచ్చి, ఆత్మరక్షణలో పడటం అతని పాత్ర విషయంలో చూస్తాము.

వెంకటావధాని, అతని ప్రేయసి 'స్రవంతి', స్రవంతి నాన్న రాఘవరెడ్డిల మధ్య నడిచిన కథ ఒక డిటెక్టివ్‌లా నడుస్తుంది.

విజయ్‌కుమార్ చేతుల్లో మోసపోయి ఒక కొడుకుని కని, ఆ కొడుకుని హాస్టల్‌లో చదివిస్తూ, పోషణార్థం పడుపువృత్తిలో దిగిన శ్రీగంధం కస్తూరి పాత్ర పాఠకుడిని విపరీతంగా కదిలిస్తుంది. అలానే తండ్రి చనిపోతే కుటుంబ పోషణార్థం చదువుకుంటూనే లాడ్జిలకు వెళ్ళే జయంతి పాత్ర కూడా జాలిని కల్గిస్తుంది. కుంటి అవధాని 'జయంతి'ని పెళ్లాడటం మరో మలుపు.

మరొక ప్రత్యేకమైన విచిత్ర మనస్తత్వం కలిగిన పాత్ర రాజమండ్రి రమణిది. నిజానికి ఈనవలలో ఈ పాత్రను చూపించాల్సిన అవసరం లేదు. అయితే సెక్స్ యొక్క మరొక వికృతభావం జీవితాన్ని ఎంతటి విషాద స్థితికి తీసుకెళ్తుందో చూపటానికే ఈ రమణిని ప్రవేశపెట్టినట్లు అనిపిస్తుంది. రమణి జీవితం భయంకర ముగింపు. జాలిని రమణిమీద కలిగేలా చేస్తుంది- జుగుప్సను మించి.

వినమరుగైన..

రామిశెట్టి చంద్రశేఖర అజాద్

ఇలా ఎన్నెన్నో పాత్రలను చూస్తాం. ఒక్కొక్కరు ఒక్కొక్కరకమైన మనస్తత్వానికి టిపికల్ రిప్రజెంటేటివ్స్‌గాకనపడతారు. చదివిన ప్రతి పాఠకుడూ తనను ఏదో ఒక పాత్రలోనో, లేక పాత్రలలోనో ఐడెంటిఫై చేసుకుంటాడు. తనకు తెలియకుండానో, తెలిసో తనకు తాను సరిచేసుకోవటానికి కనీసం ప్రయత్నిస్తాడు. అది ఈ నవల వల్ల కలిగే సాహితీ ప్రయోజనం? కులాల, మతాల, రాజకీయ ద్వేషాలమధ్య సెక్స్ ప్రధానంగా యిన్ని పాత్రలను సహజంగా ప్రెజెంట్ చేసినందుకు రచయితను తప్పనిసరిగా అభినందించాల్సిన పని వుంటుంది.


ఇందిరాగాంధీ ఎన్నికను కోర్టు తప్పు పట్టటం, ఆ తర్వాత ఎమర్జెన్సీ విధించబడటం, అప్పటి ఆగడాలు, ఆనక జనతా ప్రభుత్వం ఏర్పడటం, ఆ అతుకుల బొంత విశేషాలు- తిరిగి చిక్‌మగ్‌లూరు నుంచి ఇందిర ఘన విజయం- ఈ రాజకీయ నేథ్యంలో మొత్తం నవల నడుస్తుంది.

- సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన -
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

మాటాట

నిర్వహణ: సుధామ 1848



అడ్డం	ఆధారాలు	నిలువు
2. నందమూరి తారక		1. జలక్రీడ
5. చరఖా		3. తల్లి
7. స్వర్గము		4. అడుగునుండి పొగరంగు గల ఆవు
8. ప్రభువు, ఏలిక		6. స్త్రీ
9. ఒక అలంకారం, పోలిక,10. ప్రాగ్దిశ		8. సామర్థ్యము, చాతుర్యము
11. మత్స్యము, 12. కొంచెం ఎరుపు, లేతకావి		9. చిన్న ఈక, వ్రాసెడు కలము
13. మండూకము		10. క తూ లి సరిచేయండి
14. శాపము కాదు		11. సమీపము

అడ్డం	మాటాట-1847	సమాధానాలు	నిలువు
1. కుంభీపాకం	9. చాన	2. పాపులు	7.దినము
5. కంప	10. కుండ	3. సైగలు	10. కుందేలు
7. దిల్	12. కౌలు	4. నాకం	11. కులుకు
8. రుంజ	14. కుచేలుడు	6. పరుండ	13. దౌడు

ఇతిహాసాలే జాతి దిక్సూచికలు

రామాయణం, మహాభారతం, భగవద్గీత, భాగవతం మానవజాతికి సరియైన దారిలో నడిపించే దిక్సూచికలు అంటారు. మనిషి జన్మ పొందిన వారు ఎలా నడుచుకోవాలి. ఏవిధమైన నడవడి ఉంటే ఎలాంటి జీవితం ఉంటుంది. మరుజన్మలో ఏవిధంగా ఉంటుందో చెప్తాయి. దేనికోసం అన్వేషించాలో కూడా ఇవి చెబుతాయి.

కౌరవుల్లో దుర్యోధనుడు అహంభావి. దురాలోచనాపరుడు. ఇతరులను హింసించి తాను ఆనందపడేవాడు. అందులోను పాండవులంటే అసలే పడదు. వారిని హింసిస్తే చాలా ఆనందం వస్తుందనుకొనేవాడు. అనేక సందర్భాల్లో తన మాటలు, చేతలతో శ్రీకృష్ణుఢు, బలరాముని ముందు పరాభవాలు పాలైనాడు. 'లక్షణ' దుర్యోధనుని అందాల కూతురు. ఆమెను శ్రీకృష్ణ జాంబవతిల కుమారుడు 'సాంబుడు' వివాహం చేసుకోజూసి ఎత్తుకెళ్లాడు. దుర్యోధనుడు, ఆయన సోదరులు దీన్ని పరాభవంగా భావించారు.

అందుకే సైన్యంతో మధుర వెళ్లి లక్షణతోపాటు సాహసవంతుడైన సాంబుడిని బంధించి హస్తినాపురానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న బాలరామకృష్ణులు, యాదవులు ఆగ్రహంతో ఊగిపోయారు. అప్రమత్తమైన యాదవ సైన్యం దండయాత్రకు సిద్ధపడింది. "మనం ఇప్పుడు కౌరవులతో వియ్యం కోరుకోవాలి కానీ, కయ్యం కాదు" అని బలరాముడు వారిని శాంతపరిచాడు. ఆయన బ్రాహ్మణులు, యాదవ పెద్దలను వెంటబెట్టుకొని గౌరవ మర్యాదలకు లోటురాకుండా హస్తినకు బయలుదేరాడు.

హస్తినాపురంలో బలరాముడు, యాదవ పెద్దలు కౌరవులకు అనేక విధాలుగా నచ్చచెబుతూ సాంబునితో లక్షణ వివాహం జరిపించ ఒప్పించడానికి ప్రయత్నించారు. అందుకు దుర్యోధనుడు ససేమిరా అన్నాడు. - పదిమంది యోధులు కలిసి ఒక్క కుమారున్ని బంధించి, తమ రాజ్యానికి తెచ్చుకోవడం న్యాయ సమ్మతం కాదు కాబట్టి, చేసిన తప్పొప్పుకొని పశ్చాత్తాపం చెందాలని బలరాముడన్నాడు. కానిఅదీ కుదరదని దుర్యోదనుడు అన్నాడు.

అంతవరకు ఎంతో ప్రశాంతంగా ఉన్న బలరాముడు కోపాగ్ని జ్వాలలు చిమ్మే కండ్లతో, పొంగిన నరాలతో "దుర్యోధనా! నీ తమ్ములు, శకుని, కర్ణుడూ మొదలైన వారి బలం చూసుకొని నువ్వింతగా మాటలు తూలుతున్నావ. కానీ త్వరలో వీటన్నిటికి మూల్యం చెల్లించుకోక తప్పదు"అని హెచ్చరించాడు.

దానితో ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని కురుపెద్దలు భయాందోళనలకు గురయ్యారు. బలరాముడు బలవం తుడైనా కూడా మధురలో తన మంత్రులను, యాదవ పెద్దలను కూర్చోబెట్టి తక్షణ కర్తవ్యన్ని సూచించవలసిందిగా కోరాడు. చాలాసేపు తర్జన భర్జనలు జరిగాయి. అందరూ ముక్తకంఠంతో జాగుచేయక ధనమదాంధులైన కౌరవులకు తగిన బుద్ధి చెప్పవల్సిందేనని అన్నారు.

అపుడు బలిష్ఠుడైన బలరాముడు, కౌరవుల నామరూపాలు లేకుండా చేస్తానంటూ తన హలంతో హస్తినాపురాన్ని పెకలించి ఎండుటాకు వలె ఎత్తి సముద్రంలో పడవేశాడు.

అంటే హస్తిన నీటిపై తేలియాడసాగింది. ప్రజల హాహాకారాలు ఆకాశాన్నంటాయి. అపుడు ఇక చేసేదేమీ లేక దుర్యోధనుడు, ఆయన సోదరులు విచారంలో కూరుకునిపోయారు. భీష్మ ద్రోణ కృపాచార్యులు ఇది బలరాముని పనియేనని అనుకొన్నారు. ఆలస్యం చేయక లక్షణ సాంబుల వివాహం జరపడమే ఏకైక మార్గమని దుర్యోధనునికి సలహా ఇచ్చారు.

అపుడు వేరే ఆలోచనే లేక బలరామునికి బుద్ధి వచ్చిందని క్షమాపణ చెప్పుకుని లక్షణ సాంబుల వివాహం జరిపించాడు. ఎపుడూ అహంకారంతో మెలగ కూడదు. పెద్దలను గౌరవించాలి. పిన్నలు ఆదరించాలి. పరులను హింసించకూడదు. చేయగలిగితే సాయం చేయాలి. అదే పుణ్యం అవుతుంది. గర్వంతో నడిస్తే ముందుకు పడి దెబ్బలు తగులుతాయి. కనుక అహంకారం వదిలి చేయించేది చేసేవాడు భగవంతుడే అని నమ్మి నడవడిని తీర్చిదిద్దుకోవాలి. భగవంతుడు మెచ్చేట్టు పని చేయాలి.

- సుజాత

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
అపకీర్తి రాకుండా జాగ్రత్తపడుట మంచిది. మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరమేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి. నూతన వ్యక్తుల జోలికి వెళ్లరాదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనంవల్ల ఆరోగ్యం చెడిపోతుంది. చిన్నవిషయాల్లో మానసికాందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్ని విధాలా శ్రేయస్కరం. ఆవేశంవల్ల కొన్నిపనులు చెడిపోతాయి.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఆకస్మిక ధనలాభంతో, ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శతృబాధలు దూరమవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తొలగిపోతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా వుంటాయి. అనుకూల పరిస్థితులేర్పడతాయి.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. క్రీడాకారులు, రాజకీయ రంగాల్లోవారు ఉత్సాహంగా ఉంటారు. స్త్రీలు సంతోషంగా కాలక్షేపం చేస్తారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
కుటుంబంలో చిన్న చిన్న గొడవలు వచ్చే అవకాశం వుంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణ ప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు ఆలస్యంగా లభిస్తాయి.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఆకస్మిక ధనలాభంతో ఋణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొనుటకు కృషి చేస్తారు. స్త్రీలు, బంధు మిత్రులను కలుస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
క్రొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ప్రతి విషయంలో వ్యయ ప్రయాసలు తప్పవు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. వృత్తిరీత్యా క్రొత్త సమస్యల నెదుర్కొంటారు. బంధు, మిత్రులతో కలహాలేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
మిక్కిలి ధైర్యసాహసాలు కలిగివుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శతృబాధలు తొలగిపోతాయి. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు. ఆకస్మిక లాభాలుంటాయి.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఋణప్రయత్నం ఫలిస్తుంది. చెడు సహవాసం వైపు వెళ్లకుండా వుంటే గౌరవం దక్కుతుంది. క్షణికావేశం పనికిరాదు. అనుకోకుండా కుటుంబంలో కలతలేర్పడే అవకాశముంది. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. అనారోగ్య బాధలు అధికమవుతాయి.

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

నిద్రించుటకు శయ్యమీద వాలినా వెంటనే ఓంకారాన్ని జపించు. నిద్రవచ్చేవరకు ఆ జపాన్ని కొనసాగించు. ఆ స్మరణలోనే నిద్రపో. వాసనామయ శరీరం అణగిపోతుంది. దానివలన ప్రయోజనమెంతో ఉంటుంది''.

పరమాత్మ ధ్యానం చేత సకల దురితాలు నశిస్తాయి. స్వప్నమంటే అది కేవలం మిథ్యయే. జాగ్రద్దశలోని సంస్కారాల ఖేలనమే స్వప్నం. ఈ స్వప్నాన్ని గూర్చి వేదమిలా హెచ్చరించింది.

యత్‌స్వప్నే అన్నమస్నామి ప్రాతరధిగమ్యతే
సర్వం తదస్తు మే శివం నహి తద్ దృశ్యతే దివా

భావం:''స్వప్నంలో నేను తిన్న అన్నం ఉదయాన అది లభించదు. అది పగటిపూత కనబడదు గాన అదంతా నాకు శుభదాయకమే అగుగాక''- అంటే కనబడిన కల అంతా కేవలం మనోఖేలనమే. దీనిని దృష్టిలో పెట్టుకొనియే-

తన్మే మనః శివ సంకల్పమస్తు

''నా మనస్సు శుభసంకల్ప పరిపూర్ణమగుగాక'' -అన్నప్రార్థన శుక్ల యజుర్వేదంలో కనబడుతుంది. దీనిని బట్టి దైవనామ స్మరణరూపమైన శుభసంకల్పంతో మనస్సు పరిపూర్ణమై దురితం దూరమైపోయి జీవితం శివమయం (ఆనందమయం) కాగలదని అథర్వవేద ప్రార్థనా సందేశం. దీనిని శిరసావహించి జనులందరు జీవితాన్ని శివమయం చేసికొందరు గాక!

ఆతతాయులను వధించు

ఇంద్ర జహి పుమాంసం యాతుధానముత స్త్రియం
మాయయా శాశదానామ్। విగ్రీవాసో మూర దేవా ఋదంతు
మా తే దృశ్యన్ త్సూర్యముచ్చరంతమ్॥ అథ.8-44-24॥

భావం:- ఓ రాజా! తమ దుర్మార్గ ప్రవర్తన చేత ఇతరులకు దుఃఖాన్ని కలిగించే రాక్షస ప్రవృత్తి గల ఆతతాయులు- హంతకులు, మోసకారులు స్త్రీలే కాని పురుషులే కాని వారిని చంపివేయి. హింసయే ప్రధాన స్వభావం గల వారు శిరచ్ఛేదం పొంది నాశనం కావాలి. ఉదయించే సూర్యుణ్ణి ఇక వారు చూడనే చూడరాదు.

వివరణ:- రాజుకు ప్రధాన ధర్మం దేశంలో శాంతి భద్రతలను కాపాడటమే. ఈ ధర్మాన్ని రాజు నిర్వహించకుంటే దేశంలో శాంతిభద్రతలు కోల్పోవుటేగాక రాజ్యంలో ధన ధాన్య సమృద్ధి- ఆర్థికాభివృద్ధి, విజ్ఞానాభివృద్ధి, నాగరికతాభివృద్ధి ఇలా అన్నివిధాల అభివృద్ధులు కుంటుపడిపోతాయి. వీటిని అరికట్టి దేశాన్ని పురోగామిగా నడిపించడమే రాజుకు ప్రధాన ధర్మంగా వేదం పేర్కొంది. విప్రులకు సంధ్యావందనమెంత విధ్యుక్తధర్మమో రాజులకు రాజధర్మాన్ని నిర్వహించడం విధ్యుక్తధర్మంగా ఆధునిక మహర్షులైన దయానందులు తమ సత్యార్థప్రకాశంలో (6వ సముల్లాసంలో) ఇలా వ్రాసారు.

''రాజు తన రాజధర్మ నిర్వహణలో సదా నిమగ్నుడు కావాలి. బ్రాహ్మణులకు సంధ్యాపాసన వేదాధ్యయనం మొదలగువని వలె రాజు రాత్రింబవళ్లు ఈ రాజధర్మ నిర్వహణలో జాగరూకుడై ప్రవర్తిస్తూ రాజధర్మాదులు చెడిపోకుండ శ్రద్ధవహించాలి.''

ఏ కారణం చేతనయినా రాజ్యంలో రాజ్యధర్మ నిర్వహణకు భంగం కలిగిస్తూ ప్రజలు హింసించే రాక్షస ప్రవృత్తిగల ఆతతాయులు అనగా 1. హత్యలు చేసేవారు 2. గృహాలకు నిప్పుపెట్టేవారు 3. విషప్రయోగం చేసి జనులను చంపేవారు- ఆయుధాలతో చంపేవారు 4. స్త్రీలను- స్త్రీ ధనాదులను అపహరించేవారు 5. దోపిడీ దొంగతనాలు చేసేవారు ఇట్టి అనేక రాక్షస కృత్యాలు చేసేవారు విజృంభిస్తే వారి ఎడల 'ఇంద్రో యాతూనామ భవత్ పరాశరో హవిర్మథీనామభ్యావివసతామ్'॥ (అ.8-4-21)

''జనుల జీవన సాధనాలను నాశనంచేసి వారిని నిర్వాసితులనుగాచేసే రాక్షసులు అంటే ఆతతాయుల ఎడల ప్రభువు వినాశకుడు కావాలి''అని అథర్వణ వేదం సంపూర్ణాధికారాన్ని రాజుకు ప్రదానం చేసింది.

196

ఈ అధికార ప్రదానంలో వేదం లింగ వివక్ష చూపలేదు. ఆర్యధర్మంలో స్త్రీలు అవధ్యులు (చంపరానివారు)గా గౌరవింపబడ్డారు. కాని పై విధంగా రాక్షసులవలె దుర్మార్గపు పనులను చేసేవారు స్త్రీఅయితే అంతమాత్రంచేత వారిని శిక్షింపక విడిచిపెట్టరాదని నిర్దాక్షిణ్యంగా రాజునకు అథర్వవేద మనుమతించింది. ఈ ఆదేశం ప్రస్తుత మంత్రంలోని ప్రథమ వాక్యం ''ఇంద్రం జహి....శాసదానామ్''అనే దానిలో స్పష్టంగా కనబడుతుంది. అంటే ఏమిటి? స్త్రీలు అవధ్యులు అన్నమాట వారు రాక్షసులుగా ఆతతాయి పనులను చేయనంతవరకే వేదం సమ్మతించిందని ఈ మంత్రార్థాన్నిబట్టి గ్రహించాలి. మనుస్మృతికారుడు ఈ మంత్రార్థాన్నే క్రింది శ్లోకాలలో యథాతథంగా పేర్కొన్నాడు.

గురుం వా బాలవృద్ధౌ వా బ్రాహ్మణం వా బహుశ్రుతమ్।
ఆతతాయినమాయాంతం హన్యాదేవా విచారయన్॥ (మనుస్మృతి 8-350).

భావం:- ''గురువుగాని, పుత్రుడు గాని, బాలుడు గాని, తల్లిదండ్రులు గాని, వేదవేదాంగాలను చదివినవాడు గాని, బహుశ్రుతుడు గాని ధర్మాన్ని విడిచి అధర్మాసక్తుడై నిరపరాధులను హత్యలుచేస్తూ ఆతతాయిగా ప్రవర్తిస్తూ ఉంటే విచారించకనే రాజు వధించాలి'' కాబట్టి ధర్మశాస్త్రానుసారం ''ఆతతాయిలను చంపితే చంపిన వానికి పాపం సంభవించదు.''

కాబట్టి వేదం ఆతతాయులకు, రాక్షసులకు పూర్తి వ్యతిరేకం.

ఇంకావుంది...

ఋషి-శ్వేన సంవాదం



102 మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

మనం ఎన్నో విషయాలు చూస్తాము. కాని వాటిని పరీక్షించి నిర్ధారించాలి. బలవంతుడైన రాజు ఇంకొకరిని చంపడం తప్పు. అతన్ని నీవే మంత్రిగా నియమించావు. అతను మంచి పేరు తెచ్చుకున్నాడు. అలాంటి వ్యక్తి అరుదుగా లభిస్తాడు. అతను సహృదయుడు. కనుక అతన్ని రక్షించు. నిర్దోషులను దండించే రాజు దుష్టులైన మంత్రులతో కలిసి తొందరగా నశిస్తాడు.''

అప్పుడు ఆ శత్రుసమూహం నుండి ఒకడు బయటకు వచ్చి గోమాయువుకు జరిగిన అపకార మోసం గురించి చెప్పాడు. అంతా విన్న రాజు జరిగిన మోసం గ్రహించి గోమాయువును ఈ అభియోగం నుండి విముక్తుని చేశాడు. కాని గోమాయువు ఈ అవమానంతో బాధపడి ప్రాయోపవేశం చేయాలనుకొంది. కాని శార్దూలం దాన్ని అన్ని విధాలా సత్కరించి దాన్ని ప్రాయోపవేశం చేయకుండా ఆపింది.

కాని కన్నీళ్లతో గోమాయువు రాజుతో ఇలా అంది. ''రాజా! మీరు మొదట సత్కరించారు. తర్వాత అవమానించారు. నేను మీ వద్ద ఉండడానికి తగను. గౌరవమైన పదవులనుండి తొలగింపబడిన వారు ఇతరుల మోసాలకు గురైనవారు, లుబ్ధులు, గర్వితులు ధనం కోల్పోయిన వారు, కపటంతో నిండినవారు వీరంతా శత్రువులకు సాధనాలుగా మారుతారు. నేను ఒకసారి స్థానభ్రష్టత్వం, అవమానం పొందినవాడిని. నన్ను ఎలా నమ్మగలరు? నేనెలా ఉంటాను? ఇలా అవమానం పొందిన నాకు ఇక్కడ విశ్వాసం ఉండదు. మీకు నామీద విశ్వాసం పోయింది. అందువల్ల నాకు భయం కలుగుతున్నది.

నా యందు స్నేహభావం లేని వారిని నేను తృప్తి పరచలేను. ఎంతో కష్టం మీద ప్రేమ బంధం అతుక్కుంటుంది. అలా అతుక్కున్న ప్రేమ బంధం అతికష్టం మీద విడిపోతుంది. అలా విడిపోతూ, కలుస్తూ ఉండే ప్రేమలో స్నేహం ఉండదు. ఎవరో ఒక్కరు ప్రభువు హితం కోరే వారుంటారు. మిగిలిన వారు తమ స్వార్థం చూసుకునేవారే. స్నేహభావం గలవారు దుర్లభులు. యోగ్యులైన వారి గురించి తెలుసుకోవడం రాజులకు కష్టం. వారి చిత్తం చంచలంగా ఉంటుంది. కనుక వందల్లో ఒక్కడు నమ్మకస్తుడు దొరుకుతాడు.

అకస్మాత్తుగా గౌరవించడం, అకస్మాత్తుగా అవమానించడం మేలు చేసి కీడు చేయడం, గొప్పదనం కల్పించి దిగజార్చడం ఇవన్నీ రాజులకుండే చిన్న బుద్ధి లక్షణాలు'' ఇలా రాజుకు అనేక విధాలుగా నచ్చ చెప్పి, రాజును సంతృప్తి పరిచి గోమాయువు అడవిలోకి వెళ్ళిపోయింది. రాజు మాటలు పట్టించుకోక ప్రాయోపవేశం చేసి తన శరీరాన్ని విడిచి స్వర్గాన్ని పొందింది.

ఋషి - శ్వేన సంవాదం

ఒక మహారణ్యంలో ఫలాలు, కందమూలాలు ఆహారంగా తీసుకుంటూ, ఇంద్రియ నిగ్రహంతో, నియమ వ్రతాలతో తపస్సు చేసుకుంటున్న ఒక మానీశ్వరుడు ఉండేవాడు. అతను చాలా శాంత స్వభావం కలవాడు. ఉపవాసాల శుచివల్ల పవిత్రుడైనాడు. సత్త్వ గుణ సంపన్నుడు. అతని గుణాలను చూసి ఆ అరణ్యంలో తిరిగే వన్యమృగాలు అతని దగ్గరికి వచ్చేవి. సింహ శార్దూలాలు, మదగజాలు, భల్లూకాలు మొదలైన క్రూర మృగాలు ఎన్నో అతని దగ్గరకు వచ్చేవి. ఆ జంతువులు మాంసాహార్లులైనా అతని వద్ద చాలా నమ్రతగా తలవంచి కూర్చునేవి. అవి అతని సుఖం గురించి ప్రశ్నించి ఎలా వచ్చినవి అలా వెళ్ళిపోయేవి. ఒక గ్రామ శునకం మాత్రం ఆ మునిని వదిలి వెళ్ళేది కాదు. అది మునికి భక్తుడు అయింది. అది కూడా మునిలాగే ఉపవాసాలు చేసి కృశించి పోయింది. ఫలాలు, కందమూలాలు, నీళ్ళు ఆహారంగా తీసుకుంటూ శాంతంగా ఉండే సాధు పురుషునిలాగ ప్రవర్తించేది. అది



ఎప్పుడూ ముని పాదాల దగ్గర ఒక స్నేహితుని లాగ ఉండి అతనితో స్నేహ భావాన్ని పొందింది.

ఒకసారి మాంసాహారి, మహాక్రూరమైన ఒక చిరుతపులి ఆ కుక్కను పట్టుకోవడానికి దాని మీదకు దూకింది. క్రూరంగా తన మీదకు వస్తున్న చిరుతను చూసి కుక్క తన ప్రాణ రక్షణ కోసం మునితో ఇలా ప్రార్థించింది. ''స్వామీ! ఈ చిరుతపులి కుక్కలకు శత్రువు. అది నన్ను చంపాలని చూస్తున్నది. నా మీద అనుగ్రహం చూపి దీని భయం నాకు లేకుండా చేయండి. నువ్వు సర్వజ్ఞుడవు నీకు అంతా తెలుసు''.


ముని సిద్ధుడు సకల ప్రాణుల భాషలు తెలిసినవాడు. కనుక కుక్క సమస్య అర్థం చేసికొని దాని భయాన్ని పోగొట్టడానికి ఆ కుక్కను కూడా చిరుతపులిగా మార్చాడు.

ఇప్పుడు కుక్క చిరుతపులిగా మారిపోయింది. దాని శరీరం నిండా మచ్చలు వచ్చాయి. నోట్లో కోరలు మొలిచాయి. అప్పుడు తన ఎదుట ఉన్న చిరుతను చూసి దానికి వైరభావం పోయింది. అది నిర్భయంగా అడవి అంతా తిరుగసాగింది. కొంత కాలం ఈ విధంగా జరిగింది. ఒకసారి ఒక పెద్ద పులి పెద్దగా నోరు తెరుచుకొని దాని మీదకు వచ్చింది. చిరుతపులి ప్రాణ రక్షణకోసం మళ్ళీ మునిని ఆశ్రయించింది. తనను ఆశ్రయించుకుని ఉన్న శునకం పైన వాత్సల్యం కల ముని దానిని వెంటనే పెద్ద పులిగా మార్చాడు. అప్పుడు కుక్క కూడా శార్దూలం అయిపోయి హాయిగా మాంసం తింటూ బలిష్టమైంది. దానికి ఇక ఫలాలు కందమ్మలాలు తినాలన్న కోరికపోయింది. అది నిత్యం అడవి జంతువులని చంపి తినాలని కోరుకుంటున్నది. అది మృగాలను చంపి తింటూ ముని కుటీరం సమీపంలోనే నిద్రిస్తున్నది. ఒకరోజు మేషంలాంటి ఒక మదగజం ఆ కుటీరం దగ్గరకు వచ్చింది. అది మదగజం. దాని గండ స్థలం నుంచి మద జలం కారుతున్నది. దానికి పొడవైన దంతాలు ఉన్నాయి. కుంభ స్థలం విశాలంగా ఉంది. దాని శరీరం చాలా పెద్దది. దాని ఘీం కారం మేఘ గర్జనలాగ ఉంది. దానిని చూసి పెద్దపులి భయపడిపోయింది ముని వద్దకు శరణుకోరుతూ పోయింది. దయకల ముని దానిని వెంటనే ఒక మదగజంగా మార్చేశాడు. ఇప్పుడు అది మదగజం. కనుక తామర కొలనులోకి స్వేచ్ఛగా తిరుగసాగింది. అలా అది ముని కుటీరం దగ్గరగా తిరుగసాగింది. ఇలా చాలా రోజులు గడిచాయి. ఒక రోజు ఒక సింహం అక్కడికి వచ్చింది. అది పెద్ద జూలుతో భయంకరంగా ఉంది. ఆ సింహాన్ని చూసి ఏనుగు భయపడి పోయింది. అది మళ్ళీ మునిని శరణు కోరింది. దానిపై జాలితో ముని దానిని సింహంగా మార్చేశాడు. ఇప్పుడు అది సింహం అయిపోయింది. తన జాతిదే కనుక బయట సింహం ఈ వన్య సింహాన్ని పట్టించుకోలేదు. కాని వన్య సింహం ఆ కొత్త సింహాన్ని చూసి భయపడింది. అందువల్ల ఆ అరణ్యంలో అది ఆశ్రమం దగ్గరగా ఉండసాగింది. దాన్ని చూసి భయపడి ఇతర మృగాలు ఆశ్రమం వైపు రావడం మానేశాయి. ఇలా కొంతకాలం గడిచింది. ఒకసారి సమస్త ప్రాణులను హింసించే శరభమృగం ఒకటి సింహాన్ని చంపాలని ఆశ్రమం వైపు వచ్చింది. ఆ మృగం రక్తాన్ని మరిగి, చాలా బలిష్టంగా ఉంది. దాన్ని చూసి అన్ని జంతువులు భయపడతాయి. ఎనిమిది కాళ్ళు కలిగి భయంకరమైన కళ్ళతో అది అందరికీ దడ పుట్టిస్తుంది.

ఆ మృగాన్ని చూసి వణుకుతూ సింహం ఆశ్రమం వైపు పరిగెత్తింది. అది మునిని వేడుకుంది. ముని కరుణతో దానిని శరభంగా మార్చి వేశాడు.

-ఇంకావుంది

సుందరకాండ



దాని నుండి దాని వరకూ వృద్ధి క్షయాలుంటాయి. అమ్మవారి స్వరూపమూ అట్టిదే. సాధకుడు అసాధ్య సిద్ధి అయ్యే వరకు అట్టి శ్రద్ధను పొంది ఉండాలి. ఇక్కడ 'ధ్రువం హి సీతా' అనే మాటకు 'ధ్రువా హి సీతా' అనే అర్థం. కాని ఇంతలో-

దృష్టమంతఃపురం సర్వం దృష్ట్వా రావణ యోషితః
న సీతా దృశ్యతే సాధ్వీ వృథాజాతో మమశ్రమః

రావణాంతఃపురం అంతా వెదికేను. రావణ స్త్రీలనందరిని చూసేను. ఆ మహాపతివ్రత సీత కనబడలేదు. నా శ్రమంతా వృథా అయింది అని అనుకొంటాడు.

కాలాన్ని అతిక్రమించి పౌరుషాన్ని విడిచి పెట్టి సీత కనబడలేదని సుగ్రీవుని దగ్గరకు వెడితే ఇంకేమైనా ఉందా! ఆయన మహాబలవంతుడు. తీవ్ర దండన విధి వున్నవాడు. అంతే కాదు-సముద్రం దాటి వెళ్లి ఏం చేసేవని మా వానరులడుగుతారు. అంగద, జాంబవంతాది పెద్దలకు ఏమని సమాధానం చెప్పను.

ఇదీ స్వామి బాధ.

సాధనలో వున్నవానికి కొంతకాలం గడుస్తుంది. కానీ లక్ష్య నిర్దేశం కాదు. పైగా చెరువు మరుపులు వస్తాయి. కానిది అయినట్లనిపిస్తుంది. కాదనీ తెలుస్తుంది. అసలు సాధ్యమైనదేది ఉన్నదో అది దొరకదని అనిపిస్తుంది. అలసట వస్తుంది. అలసటవలన చాలా శ్రమ పడ్డానన్న భావం పుడుతుంది. ఫలితం దక్కనప్పుడీ శ్రమ ఎందుకనే నిర్వేదం కలుగుతుంది.

నిర్వేదంవలన దుఃఖం పుడుతుంది.
దుఃఖంవలన నిరాశ కలుగుతుంది.
నిరాశ కార్యవిఘ్నతకు కారణమవుతుంది.
అందువలన

అనిర్వేదశ్శియోమూల మనిర్వేదః వరం సుఖం
అనిర్వేదోహి సతతం సర్వార్థేషు ప్రవర్తకః

నిర్వేదములు లేని స్థితి ఉన్నదే-అదే సర్వ సంపదలకు మూలం, సర్వ సుఖములకు మూలం. నిర్వేదము లేనివాడే సర్వకార్యాలలోనూ ప్రవర్తించే ఉత్సాహాన్ని పొందుతాడు.

బుద్ధిమంతుడే ధైర్యవంతుడు.

మనం సుందరకాండ పారాయణ వలన పొందవలసిన మానసిక పరిపుష్టి ఇది.

చతురంగుళ మాత్రో పి నావకాశస్స విద్యతే
రావణాంతః పురే తస్మిన్ యం కపిర్నజగామ సః

నాలుగు అంగుళాల చోటు కూడా విడువలేదు. రావణాంతపురమందు ఆ స్వామి చూడవలసినదీ లేదు.

వివిధాకారాలలో వున్న రాక్షస స్త్రీలను చూసేడు. అక్కడెక్కడ ఆ జానకి కనపడలేదు. లోకమందు సాటిలేని రూపవతులయిన విద్యాధర స్త్రీలను చూసేడు. అక్కడా ఆ రాఘవ నందిని కనబడలేదు.

శ్రేష్ఠలైన నాగకన్యలలో వెదికేడు. అక్కడ సీత కనబడలేదు. బలాత్కారంగా అపహరింపబడి తీసికొని వచ్చిన నాగకన్యలున్నారట. అక్కడ జనక నందినీ దర్శనం కలుగలేదు. ఇలా ఎంతోమంది స్త్రీలను చూసేడు, కాని సీత చూడలేకపోయిన స్వామికి విషాదం అలముకొన్నది. వానర ప్రభువుల ప్రయత్నం ఈ సముద్ర తరణం అన్నీ వ్యర్థమయ్యేయి అని స్వామి బాధపడుతూ ఆ విమానాన్ని దిగి-

చింతాముపజగామాథ శోకోపహత చేతసః

అయితే ఏమై ఉంటుంది? ఆవిడ కనబడకపోవడానికి ఆమెయే కారణం. అంతే కాని నా ప్రయత్నం కాదు అనుకొంటాడు. సాధకునికి ఇదొక దశ.

దైవికమైన విషయంలో ఆలోచిద్దాం.

జపం చేస్తూ ఉంటాడు. లేదా ఏదో నియమాన్ని అనుసరిస్తూ ఉంటాడు. కొంతకాలం అవుతుంది. అది ఫలించదు. వెంటనే దైవంపై అవిశ్వాసం కలుగుతుంది. ఇంత జపం చేసేను. ఇన్ని వ్రతాలు చేసేను. దైవం అంటూ ఉంటే ఫలితాన్ని ఈయవద్దా! అనుకొంటాడు. ఎప్పటికి ఫలితం వస్తుందో అప్పటి వరకూ ఆ పనిని చేస్తూనే ఉండాలి అనే ధృతిని కోల్పోతాడు.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము



114.పేరుప్రతిష్ఠలకై దేవులాడు వారు భ్రాంతిలో పడి కొట్టుకొనుచున్నారు. విధాతయే లేక సర్వేశ్వరుడే సమస్తము నియమించుచున్నాడనియు, అన్నిటికిని అతడే కర్త అనియు గమనింపజాలరు. వారు పాపము! ''సర్వేశ్వరా! అన్నిటికిని నీవే కర్తవు, నీవే నియామకుడవు'' అని బుద్ధిమంతుడు భావించును. పామరులును భ్రాంతిమతులను 'నేను, నేను' అని ప్రలాపింతురు.

పక్వాహంకారము - అపక్వాహంకారము

115.అహంకారము రెండు విధములుగానున్నది. ఒకటి- పక్వము, రెండవది అపక్వము. 'నాదేమియు లేదు, నేనేమి చూచినను, చేసినను, అనుభవించినను, వేయేల- ఈ శరీరము సైతము నాది కాదు; నేను నిత్య ముక్త బుద్ధస్వరూపుడను'' -ఇట్టిభావములతో గూడినది పక్వమైన అహంకాము. 'ఇది నా యిల్లు, నా బిడ్డ, నా భార్య, నా తనువు' -ఈ విధమైన భావన కలుగజేయునది అపక్వమైన అహంకారము.

116.'నేను భగవంతుని సేవకుడను' అని భావించుట భక్తుని అహంకారమునకు లక్షణము. ఇట్టిది విద్యాహంకారము. ఇదియే పక్వాహంకారమనియు జెప్పబడును.

117.''తంటాలమారి అహంత'' అనగా ఎటువంటిది? ''ఏమి! వారు నన్నెరుగరా? నేనింత ధనవంతుడను గదా, నన్ను మించిన ధనికులెవరు? నాకంటె అధికులెవరు?'' అని మిట్టిపడు నహంతయే 'తంటాల మారి అహంత', హానికరమైన అహంత.

118.నరుని లౌకికునిగను కామినీ కాంచనములకు దాసునిగను జేయు నహంకారమే హానికరమగు నహంకారము. జీవాత్మకును పరమాత్మకును నడుమ ఈ అహంకారము వచ్చి పడుట చేతనే వారిరువురును వేరుపడుచున్నారు. నీటిమీద కఱ్ఱను వేసినయెడల ఆ నీరు విభాగమైనట్లు కన్పించును. అహంకారమే యీ కఱ్ఱ. దీనిని తొలగించితివా, నీరు మరలా అభిన్నమై కాన్పించును.

అహంకారమును జయించుటెట్లు?

119. 'నేను' అను దానిని గూర్చి దాని ఆనుపానులను గని పట్టవలయునని ప్రయత్నించి యెడల అది కేవలము అహంకారమునకు సంజ్ఞ అని తెలియవచ్చును. కాని దానిని తొలగించుకొనుట కడు దుర్లభము. కావున సాధకుడిట్లు భావింపవలయును. 'ఓ పాపిష్టమైన అహంకారమా! ఏ విధముగను నీవు నన్ను విడువకున్న యెడల భగవంతుని దాసురాలవై యుండుము''. భగవంతుని సేవకుడనని భావించు నహంకారమునే పక్వాహంకారమందురు.

120.శంకరాచార్యులను ఒక శిష్యుడు చిరకాలము సేవించుచుండెను. కాని వారాతని కేమి యుపదేశము చేసి యుండలేదు. శంకరులొకప్పుడు ఒంటరిగా గూర్చుండి యుండ వెనుక నుండి ఎవ్వరో వచ్చుచున్నటుల కాలి చప్పుడు విననయ్యెను. ఆచార్యులు, 'ఎవరక్కడ?' అనిరి. 'నేనే' అని ఆ శిష్యుడు పలికెను. శంకరాచార్యులు అప్పుడాతనికిట్లు బోధించిరి- ఈ 'నేను' అనునది నీకంత ప్రియమైన యెడల దానిని అనంతముగా పెంచుము. (అనగా విశ్వమంతయు నీవేయని గ్రహింపుము) లేదా, దానిని పూర్తిగా విడిచిపెట్టుము.

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

సహనం విలువ

సామెతలన్నీ అనుభవసారపు పాఠాలే. సామెతల్లోని విషయాలు ప్రతివారికి అనుభవంలోకి వచ్చేవే. పెద్దలంతా అనుభవంతోనో, లేక శ్రుతిస్మృతి వల్ల వచ్చిన జ్ఞానం పరంపరగా వచ్చినవి ఆచారాలు, సంప్రదాయాల పేరిట కట్టుబాట్ల పేరిట తరతరాలకు అందిస్తూ వస్తున్నారు. ''అనేవాడికి పడేవాడు లోకువ'', ''చెప్పేవాడికి వినేవాడు లోకువ'' వంటి సామెతలు ఎన్నో సందర్భాలలో ఎక్కువగా అనుభవంలోకి వస్తూ వుంటాయి. తిట్టే నోరు తిరిగే కాలు ఊరికే ఉండవు అని కొంతమందికి ఏదోపని కట్టుకుని ఇతరులలోని లోపాలను ఎంచుతూ ఏదో ఒకటి అంటూ వుండడం అలవాటుగా వుంటుం ది. ఈ సామెత మాత్రం అందరిలోను కొద్దో గొప్పో ఉండనే ఉంటుంది. సామెతలు అన్నారని కాదు కానీ ఎవరికి వారు తరచి చూసుకొంటే చాలు వెన్ను మీద చరిచినట్టు తెలుస్తుంది. చూశారా ఈ విషయం చెప్పడానికి సామెతనే పనికివచ్చింది. సామెతను పండి తులకైనా, పామరులకైనా నిత్యమూ నోట్లో నానేదే.

మాకు అన్నీ తెలుసు ఎవరి అనుభవం కాని ఎవరు చెప్పింది మాకు అక్కర్లేదు అనుకొన్నా ఒంటికొమ్ము సొంటిరాయి అనే సామెత అనకుండా ఉండలేము. ఎందుకంటే వారు వారితెలివితేటలతో పనిచేసి చివరకు అజ్ఞానంలో కూరుకుపోయి అహంకారంతో మిడిసిపడి కూర్చున్న చోటు నుంచి ఇంకాస్త కిందకు దిగజారుతారు. అందుకే ఎంత తెలిసి ఉన్నా అనుభవంతో చెప్పే మాటలు విని తీరాలి. చదువుకున్న డాక్టరు కన్నా రోగి చెప్పేమందు మేలు అంటే రోగి చెప్పే మందు అనుభవంతో వచ్చింది డాక్టరు కేవలం చదువుకోవడం వచ్చింది కనుకనే అది ఒక్కో సారి పనిచేయక పోయినా రోగి చెప్పే మందు పనిచేసి తీరుతుంది.

పెద్దలు మాటలు వినడానికి సహనం అవసరం. వారు అనుభవంతో చెప్పే వైనా ఒక్కోసారి వారు అర్థం చేసుకున్న తీరు,దాన్ని చెప్పే తీరు వేరుగా ఉంటుంది. దావివల్ల ఇపుడు వినేవారిలో కొంత అసంతృప్తిని మిగులుస్తుంది. ఇంతేనే అనే భావం కూడా కలిగిస్తుంది. ఇలాంటపుడు కూడా సామెతలు తెలిసిఉంటే క్లిష్టసమస్యలైనా సులభంగా పరిష్కరించుకోవచ్చు. సామెతలు తెలుసు కొని ఉంటే ఎటువంటి పరిస్థితులనైనా సులభం గా ఎదుర్కోవచ్చు

సామెతల వల్ల కేవలం అనుభవజ్ఞానమే కాదు నీతి, నిజాయితీ ధర్మాచరణ వల్ల వచ్చే ఫలితమూ తెలుస్తుంది. ఒక్కోసారి నీతితప్పిన వారు చివరకు ఏ దశకు వస్తారో కూడా కళ్లకు కట్టినట్టు తెలుస్తుంది. అదే నీతితోను నిజాయితీతోను వ్యవహరించిన వారు వర్తమానంలో ఎన్ని కష్టాలు పడినా చివరకు వారు పరమశాంతిని పొందుతారు. వారిని భగవంతుడు కూడా మెచ్చుతాడు. అబద్ధాలతోను, అవినీతితోను కాలం గపిపిన వారు అప్పటికప్పుడు విందులు వినోదాలతో ఉన్నట్టు అనిపించిన లోలోపల వారు భయపడుతూనే ఉంటారు. చివరకు తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు అన్నట్టుగానే వారు చేసిదానికి శిక్ష వేయనే వేస్తారు. దానితో పశ్చాత్తాపపడకమానరు. అట్లాంటి చూసినపుడు కూడా సామెతలు ఎంత ప్రభావవంతమైనవో తెలుస్తుంది.

ఎదుటివారు కీడుచేసినా మేలుపొంది నట్లుగా భావించేవారు పురాణాల్లో నే కాదు ఈ కలియుగంలోను కనిపిస్తుంటారు. అలాంటి వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. పైగా వారికి ప్రచారాలు ఉండవు కనుక చాలామందికి తెలిసే అవకాశం తక్కువ. అందుకే పనికట్టుకునైనా ఇలాంటి వారిని రోజు స్మరించుకుంటూ ఉండాలి. వారిని ఆదర్శమూర్తులుగా పెట్టుకోవాలి. అపుడు నీతి నిజాయితీలతోను, సమాజంలో మంచి మనుషులుగా ఇతరులు స్మరించుకునే అవకాశం కలిగించుకున్న మను ష్యులుగా మారుతారు. ఒకసారి ప్రళయం వచ్చింది. నీరు పంటలు అన్నీ ఎండి పోయా యి. అలాంటి రోజుల్లో మానవులందరూ నీటి కోసం అలల్లాడుతున్న కాలంలో గౌతముడు వరుణినికోసం తపస్సుచేస్తాడు. దానివలన పైరులను సస్యశ్యామలం అవుతాయి. గౌతముని ఆశ్రమంలో ఉంటున్న కొందరు స్వార్థపరులు గోహత్యా పాతకానికి గురి అయ్యేట్టు చేసినా వారే తిరిగి ఆ పాపం దూరం కావడానికి శివునిగురించి తపస్సుచేయమని చెప్పినా కించిత్తు అయినా ఖేదం లేకుండా గౌతముడు శివునికోసం తపస్సుచేసి గంగను తెప్పించిన మహానుభావుడాయన. అట్లాంటి మహర్షులను స్మరించుకుంటూ జీవితాన్ని గడపాలి.

- వాణీప్రభాకరి

కోలుకుంటున్న బ్రహ్మానందం



ప్రఖ్యాత తెలుగు హాస్య నటుడు బ్రహ్మానందం ఆస్పత్రిలో ఉన్నారనే విషయం తెలిసి అభిమానులు, సన్నిహితులు కలవరపడ్డారు. అయితే ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తనయుడు హీరో గౌతమ్ వెల్లడించాడు. కొన్ని నెలలుగా ఛాతిలో అసౌకర్యంగా అనిపించడంతో హైదరాబాద్‌లోని ప్రముఖ వైద్యుల సలహామేరకు శస్త్రచికిత్స కోసం ముంబైలోని 'ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్'లో సోమవారం ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఐసీయు నుంచి సాధారణ గదికి మార్చారని తనయుడు గౌతమ్ పేర్కొన్నాడు. అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ పరిశ్రమలోని ప్రముఖులు ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబుచేస్తున్నారని, అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సులతో ఆయన ఆరోగ్యం మెరుగుపడిందన్నారు. బ్రహ్మానందం కుమారులు రాజా గౌతమ్, సిద్ధార్థలు తండ్రితోపాటు ముంబైలో ఉన్నారు.



కనెక్టయ్యారు...

మెగాపవర్ స్టార్ రాంచరణ్ హీరోగా మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వినయ విధేయ రామ'. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దానయ్య నిర్మించిన భారీ చిత్రమిది. సంక్రాంతి కానుకగా జనవరి 11న విడుదలైన మంచి టాక్ తెచ్చుకుంది. సంక్రాంతి రేసులో మంచి కలెక్షన్స్‌తో రాణిస్తున్న సినిమా గురించి నిర్మాత దానయ్య మాట్లాడుతూ 'మెగా పవర్‌స్టార్ చిత్రం అదీకూడా బోయపాటి శ్రీను దర్శకత్వంలో అని తెలియగానే సినిమాపై భారీ అంచనాలుంటాయనే సంగతి తెలిసిందే. మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించాం. హీరోను మాస్ యాంగిల్‌లో దర్శకుడు బోయపాటి ప్రజెంట్ చేశారు. అన్నదమ్ముల మధ్య అనుబంధం, ఫ్యామిలీ ఎమోషన్స్ కుటుంబ కథాచిత్రాల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, డ్యాన్సులకు మాస్ ఆడియెన్స్ కనెక్టయ్యారు. సినిమా సక్సెస్‌ఫుల్ కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులు ప్రతి ఒక్కరికీ థాంక్స్' అన్నారు.



దేవ్ వస్తున్నాడా?

కోలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. అది -హీరో సూర్య కొడుకు దేవ్ స్క్రీన్‌కు రానున్నాడని. అంత కొడుకున్నాడా? అన్న సందేహాలు వద్దు. ఎనిమిదేళ్ల వయసుకే ప్రధాన పాత్ర పోషించనున్నాడట. హీరోల కొడుకులు స్క్రీన్ మీద ఆసక్తి చూపించడం కొత్తేమీ కాదు. 'వర్మ' చిత్రంతో విక్రమ్ కొడుకు ధ్రువ్ స్క్రీన్‌కు వస్తుంటే, స్టార్ హీరో విజయ్ కొడుకు సంజయ్ డైరెక్షన్‌పై ఆసక్తి చూపిస్తున్నాడు. కాకపోతే, కాస్త అర్లీగా సూర్య కొడుకు ట్రాక్ వేసుకుంటున్నాడంతే. సూర్య సొంత నిర్మాణ సంస్థ 2డి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కొత్త దర్శకుడి సారథ్యంలో ఎనిమిదేళ్ల దేవ్ లీడ్ రోల్‌తో ఓ సినిమా డిజైన్ అయిపోయిందని వినికిడి. పెట్ డాగ్‌తో పిల్లాడికున్న అనుబంధం ప్రధాన ఇతివృత్తంగా చిత్రం ఉండబోతోందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే చైల్డ్ ఆర్టిస్టులతో ఆడిషన్స్ నిర్వహించి 30మందిని ఎంపిక చేశారని, వాళ్లతో సూర్య కుమారుడు లీడ్ రోల్ చేయవచ్చన్న కథనాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని సూర్య అధికారికంగా ప్రకటించడమే తరువాయి.

ఎందరికో స్ఫూర్తి ఎల్వీ

ఎల్వీ ప్రసాద్. తెలుగు సినిమాకు ఆద్యుడు, దిక్సూచి. తెలుగు చలన చిత్ర పరిశ్రమ వేళ్లానుకోడానికి ఆయన చేసిన ప్రయత్నాలు, ఓర్చిన కష్టనష్టాలను కథలుకథలుగా చెప్పుకోవాలి. ప్రస్తుత ఆంధ్ర రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు సమీపంలోని సోమవరప్పాడులో 1908 జనవరి 17న జన్మించారు అక్కినేని లక్ష్మీవరప్రసాద్. తొలితరం నటుడిగా ప్రత్యేక స్థానం సంపాదించి, తరువాత అభిరుచిమేరకు దర్శక, నిర్మాతగా మారారు. ఆయన 111వ జయంతి వేడుకలు ఎల్వీ ప్రసాద్ తనయుడు రమేష్ ప్రసాద్, కుటుంబీకుల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నటుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ -తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఆద్యుడు ఎల్వీ ప్రసాదేనని గుర్తు చేశారు. తెలుగు పరిశ్రమ సత్తాను భారతదేశానికి చాటిన మహనీయుడి దర్శకత్వంలో వచ్చిన 'షావుకారు' చిత్రంలో తన తండ్రి ఎన్‌టి రామారావు నటించారన్నారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు నిఘంటువులాంటి ఎల్వీ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుందని, సామాన్యుడిగా పుట్టి కృషితో మహనీయుడిగా ఎదిగిన వ్యక్తి ఎల్వీ ప్రసాద్ అన్నారు. నటుడిగా తనలో స్ఫూర్తినింపిన వ్యక్తుల్లో ఎల్వీ ప్రసాద్ ఉన్నారని చెప్పుకున్నారు. ఏ రంగంనుంచి ఎదిగారో అదే రంగానికి పదింతలు తిరిగిచ్చిన ఎల్వీ ప్రసాద్ జీవితం ఆదర్శప్రాయమన్నారు.



దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ తెలుగు సినిమా ప్రపంచంలో ఎల్వీ ప్రసాద్, ఎన్టీఆర్‌లు దిగ్గజాలని, వాళ్ల వారసత్వాన్ని పిల్లలూ కొనసాగించడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ చరిత్రను తరువాతి తరాలకు తెలియజెప్పేందుకు 'బయోపిక్' తీస్తున్నట్టే -ఎల్వీ వారసులు సైతం ఆయన గొప్పతనం తరువాతి తరాలకు తెలిసేలే బయోపిక్ తీయాలని సూచించారు.

సీనియర్ నటి గీతాంజలి మాట్లాడుతూ 'సీతారామకల్యాణం' చిత్రం చేసిన తరువాత తనను అంతా సీతమ్మగా పిలుస్తున్నారంటే కారణం ఎల్వీ ప్రసాద్ అన్నారు. ఎల్వీ ప్రసాద్ సినిమా పరిశ్రమకు చేసిన సేవలను పలువురు కొనియాడారు.

రైతు కుటుంబంలో పుట్టి నటనపై ఆసక్తితో సినీరంగానికి వచ్చిన ఎల్వీ, తొలుత ముంబయిలోని వీనస్ ఫిల్మ్ కంపెనీలో సహాయకుడిగా పనిచేశారని, తరువాత స్టార్ ఆఫ్ ది ఈస్ట్ అనే నిశ్శబ్ద చిత్రంలో చిన్న పాత్ర పోషించారని వక్తలు గుర్తు చేసుకున్నారు. 1931లో భారతదేశ మొదటి టాకీ 'ఆలం అరా'లో నటించిన ఎల్వీ, మొదటి తమిళ టాకీ 'కాళిదాస్'లోనూ చిన్న పాత్ర పోషించారు. తొలి తెలుగు టాకీ భక్తప్రహ్లాద సహా, తెలుగు, హిందీ, తమిళ భాషల్లో కొన్ని చిత్రాల్లో నటించిన ఆయన తరువాత దర్శకుడయ్యారు. 1940వ దశకంలో గృహప్రవేశం, పల్నాటి యుద్ధం, ద్రోహి, మనదేశం చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆయన 1950లో సంసారం, షావుకారు, మిస్సమ్మ లాంటి గొప్ప చిత్రాలను తెరకెక్కించారు. మన దేశం చిత్రం ద్వారానే ఎన్టీఆర్, ఎస్వీఆర్, అమర గాయకుడు ఘంటసాలనూ పరిచయం చేశారు. తాను సంపాదించింది సినీరంగంలోనే పెట్టుబడులు పెట్టి కళామతల్లికి ఎనలేని సేవలు అందించారని వక్తలు కొనియాడారు. సినిమా రంగంకోసం స్టుడియోస్, లాబ్స్ దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయడమే కాదు, హైదరాబాద్‌లో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని నెలకొల్పి ఎందరికో చూపునిచ్చారు. ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న ఎల్వీ ప్రసాద్ నెలకొల్పిన సంస్థలు నేటికీ దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.



సరిహద్దులో తనీష్



మనిషికి, మనిషికి... దేశాలకు, ప్రాంతాలకు మధ్య కొన్ని హద్దులు ఉంటాయి. ఎవరి పరిధిలో వాళ్లున్నంతవరకూ అవి సరిగానే ఉంటాయి. కానీ ఒక్కసారి ఆ సరిహద్దులు అతిక్రమిస్తే సంఘర్షణ మొదలవుతుంది. దేశాలు, ప్రాంతాల మధ్య ఈ సరిహద్దు సంఘర్షణలు తీవ్ర పరిణామాలకు దారితీయొచ్చు. ఒక్కోసారి అది జాతీయ సమస్యగానూ మారొచ్చు. అలా మారకుండా చూసే శక్తి ఆర్మీ. సైనికుడు సరిహద్దుకు కాదు దేశానికే రక్షకుడు. ఇదే కాన్సెప్ట్‌తో యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తనీష్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. తనీష్ గత సినిమా రంగుతో విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న కార్తికేయ ఈ చిత్రానికి దర్శకుడు. అంటే రంగు కాంబినేషన్ రిపీట్ అవుతోందన్నమాట. నేషనలైజ్డ్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం టైటిల్ కూడా 'సరిహద్దు'. ఈ సందర్భంగా దర్శకుడు కార్తికేయ మాట్లాడుతూ.. భాషను నేర్చుకొని జ్ఞానాన్ని సంపాదించాలనుకొని.. ప్రతి భాషకు ఒక 'తెగ"అనీ.. కొన్ని తెగలకు ఒక 'కులం' అనీ.. కొన్ని కులాలు కలసి ఒక 'మతం'అనీ విడిపోతూ మృగాలనుండి మనుషులుగా.. మనుషులనుండి 'తెగలుగా'..తెగల నుండి .. 'కులాలు'... కులాలనుండి 'మతాలుగా" మతాల నుండి 'రాష్ట్రాలుగా' రాష్ట్రాల నుంచి 'దేశాలుగా'.. సరిహద్దుల్ని గీసుకొంటూ.. బతుకుతున్నాం. ఈ కాన్సెప్ట్‌తో సరిహద్దు రూపొందబోతుంది' అన్నారు. దర్శకుడు కార్తికేయ, హీరో తనీష్ 'రంగు' సినిమాతో అద్భుతమైన ప్రశంసలు అందుకున్నారు. అందుకే మరోసారి వీరి కాంబినేషన్‌లో సినిమాకు రంగం సిద్ధమైంది. ఈసారి అంచనాలు కూడా ఉంటాయి. వాటికి ఏమాత్రం తగ్గకుండా ఓ అద్భుతమైన కథతోనే మళ్లీ వస్తున్నారు ఈ ఇద్దరు. తెలుగుతోపాటు హిందీ భాషలోనూ విడుదల చేయబోతోన్న 'సరిహద్దు' మూవీ షూటింగ్ మార్చి 16నుంచి ప్రారంభం కాబోతోంది.

టెక్నికల్‌గా హైస్టాండర్డ్స్‌లో ఉండబోతోన్న ఈ చిత్రంలో తెలుగుతోపాటు హిందీ భాషా నటులు కూడా నటిస్తారు. ప్రస్తుతం టైటిల్‌తోనే విపరీతంగా ఆకట్టుకుంటోన్న ఈ టీమ్.. సినిమాకు సంబంధించిన వివరాలతోపాటు ఇతర ఆర్టిస్టులు, టెక్నీషియన్స్‌కు సంబంధించిన వివరాలను ఈనెలాఖరులో తెలియజేయబోతున్నారు.




చార్లీ.. సీక్వెల్

చాలాకాలం క్రితం చార్లిచాప్లిన్ టైటిల్‌తో కితకితలు పెట్టిన ప్రభుదేవా -మరోసారి సీక్వెల్‌తో కడుపుబ్బ నవ్వించేందుకు రంగం సిద్ధమైంది. అమ్మా క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న చార్లిచాప్లిన్-2లోనూ ప్రభుదేవాయే హీరో. ప్రభుదేవాతో నిక్కీగల్రానీ, ఆదాశర్మ జోడీ కట్టారు. కీలక పాత్రను నటుడు ప్రభు పోషిస్తున్నాడు. సీక్వెల్‌కు శక్తి చిదంబరం దర్శకత్వం వహిస్తే, సంగీతాన్ని అమ్రీష్ గణేశ్ సమకూర్చాడు. ప్రాజెక్టుపై దర్శకుడు శక్తి మాట్లాడుతూ -పదహారేళ్ల క్రితం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విజయం సాధించిన చార్లి చాప్లిన్ మళ్లీ సీక్వెల్‌గా వస్తున్నాడు. ఈ సినిమా కోసం చాలామందే ఆసక్తిగా చూస్తున్నారు. ఆడియన్స్ అంచనాలకు తగ్గట్టుగానే చిత్రం ఉంటుదని నమ్మకంగా చెబుతున్నా అన్నాడు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. యాక్షన్ ఎపిసోడ్స్‌తోపాటు ప్రభుదేవా స్టయిల్ డ్యాన్స్‌లతో చిత్రం ఉంటుందని అర్థమవుతోంది. 'జీవితంలో చేసిన చిన్న పొరబాటు -ఎన్ని అగచాట్లకు దారితీసిందో'నన్న ఇతివృత్తాన్ని ఇందులో చూపించే అవకాశం ఉందని అంటున్నారు.

ఒంగోలులో మొదలెట్టాడు


'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా కొత్త సినిమా మొదలైంది. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మాతలుగా అర్జున్ జంధ్యాలను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఒంగోలులో ప్రాజెక్టు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా హీరో కార్తికేయ మాట్లాడుతూ 'ఆర్‌ఎక్స్ 100' తర్వాత చాలా కథలు విన్నానని, వాటిలో అర్జున్ జంధ్యాల చెప్పిన కథ బాగా నచ్చి ఓకే చెప్పానన్నాడు. రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని, లొకేషన్‌లోకి ఎప్పుడెప్పుడు వెళ్తానానని ఆసక్తిగా చూస్తున్నా'నన్నాడు. దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ 'బోయపాటి శ్రీను దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన అనుభవంతో కార్తికేయకు కథ చెప్పానని, నమ్మి సినిమా చేయడానికి ముందుకొచ్చాడన్నారు. నిర్మాతలు కథమీద నమ్మకంతో కాంప్రమైజ్ కాకుండా సినిమా చేయాలనే ఫ్యాషన్‌తో ఉన్నారని, కథానుగుణంగా ఒంగోలులో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తా'మన్నాడు. నిర్మాతలు అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ 'సినిమా రంగంలో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. నేటినుంచి ఫిబ్రవరి 8 వరకు ఒంగోలు పరిసరాల్లో తొలి షెడ్యూల్ చిత్రీకరిస్తాం. కీలక సన్నివేశాలు, రెండు పాటలను తెరకెక్కిస్తాం. సినిమా టైటిల్‌ను త్వరలోనే వెల్లడిస్తాం' అన్నారు. చిత్రానికి సంగీతాన్ని చైతన్య భరద్వాజ్ సమకూరుస్తున్నాడు.

ఊరంతా అనుకుంటున్నారు..



రోవాస్కైర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. నవీన్ విజయ్‌కృష్ణ, శ్రీనివాస్ అవసరాల హీరోలు. మేఘాచౌదరి, సోఫియాసింగ్ నాయికలు. బాలాజి సానల దర్శకుడు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పిఎల్‌ఎన్ రెడ్డి, ఎ పద్మనాభరెడ్డి నిర్మాతలు. టైటిల్ లోగోను సూపర్ స్టార్ కృష్ణ, ఫస్ట్‌లుక్‌ను విజయనిర్మల, హీరో ఫస్ట్ లుక్‌ను నరేష్, నవీన్ లుక్ టీజర్‌ను కృష్ణ, విజయనిర్మల విడుదలచేశారు. హీరో నవీన్ విజయ్ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసింది. కృష్ణ, విజయనిర్మల మాట్లాడుతూ.. 'టైటిల్ బావుంటే సగం సినిమా సక్సెస్ అయినట్టే. అందులోనూ ఈ సినిమాకు 'ఊరంతా అనుకుంటున్నారు' అనే నేటివ్ టైటిల్ దొరికింది. నవీన్‌లో ఈజ్ ఉంది. ఆర్టిస్ట్‌గా మంచి ఫ్యూచర్ ఉంటుంది. నవీన్‌కి ఈ సినిమాతో ఫ్యాన్ ఫాలోయింగ్ రావాలి' అన్నారు. కెఎం రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. 'నవీన్ పాత్ర చాలా బావుంటుంది. కథాబలం ఉన్న సినిమా. గ్రామీణ నేపథ్యంతో సాగుతుంది' అన్నారు. నవీన్ మాట్లాడుతూ 'పాలకొల్లులో సినిమా కోసం షూటింగ్ చేశామని, అక్కడి వాతావరణం చూస్తే అక్కడే సెటిల్ కావాలనిపించింది. చాలా మంచి సినిమా అవుతుంది' అన్నారు. నరేష్ మాట్లాడుతూ 'నందిని నర్సింగ్ హోమ్‌తో నవీన్ హీరోగా పేరుతెచ్చుకున్నాడు. ఆర్టిస్ట్‌గా నిలదొక్కుకోవాలనేది అతని తాపత్రయం. 5, 6 స్క్రిప్ట్‌లు విన్నాక, ఈ కథ మాకు బాగా నచ్చింది. నేను బావున్నాయన్న సినిమాలు 99 శాతం ఫెయిల్ కాలేదు. ఇది మంచి ఎంటర్‌టైనర్ అవుతుంది. టైటిల్ బావుంది. మిగిలిన తారాగణం బావుంది. నేను ప్రివ్యూ చూశాను. నిర్మాతలకు టేస్ట్ ఉందనిపించింది. డబ్బింగ్ జరుగుతోంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో అందంగా సాగే సినిమా ఇది. క్యూట్ విలేజ్ బోయ్‌గా నవీన్ మెప్పిస్తాడు. కొత్త జోనర్ సినిమా అవుతుంది. నవీన్‌లోని పలు షేడ్స్ ఈ సినిమాలో ఆవిష్కృతమవుతాయి' అన్నారు.

చూశాకే.. మాట్లాడాలి



మలయాళీ భామ ప్రియా ప్రకాశ్ వారియర్ నటించిన 'శ్రీదేవి బంగ్లా' ట్రైలర్ విడుదలైన దగ్గర్నుంచీ వివాదం మొదలైంది. ప్రశాంత్ మాంబుల్లి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే, ట్రైలర్ కంటెంట్‌ను బట్టిచూస్తే అలనాటి తార శ్రీదేవి జీవితాన్ని తెరకెక్కించినట్టే ఉందన్న కథనాలు గుప్పుమన్నాయి. దీంతో దివంగత శ్రీదేవి భర్త, నిర్మాత బోనీకపూర్ ప్రాజెక్టుపై స్పందించడమే కాదు, చిత్రబృందానికి నోటీసులూ పంపారు. అయితే, బోనీ నోటీసులపై ఇటు దర్శకుడు మాంబుల్లి, అటు ప్రధాన పాత్రధారిణి ప్రియా ప్రకాశ్ స్పందించారు. 'శ్రీదేవి బంగ్లా చిత్రం క్రైం థ్రిల్లర్ నేపథ్యంతో తెరకెక్కింది. బయోపిక్ కాదు. అనుమతి లేకుండా బయోపిక్‌ను తెరకెక్కించకూడదన్న స్పృహ మాకూ ఉంది. ఒక నటి లండన్‌లో ఎదుర్కొన్న పరిస్థితులే మా కథాంశం. విడుదలకు ముందే సస్పెన్స్‌ను రివీల్ చేయమంటే ఎలా? పాత్రపేరు శ్రీదేవి, బాత్ టబ్ సన్నివేశం కనిపిస్తోంది కనుక నటి శ్రీదేవి జీవిత కథేనంటూ కథనాలు అల్లేస్తున్నారు. బాత్‌టబ్‌లో పడి ఇంకెవ్వరూ చనిపోరా? చనిపోకూడదా? మమ్మల్ని సినిమా విడుదల చేయనివ్వండి. ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రియా చెప్పినట్టుగా అది ఎవరి కథ అన్నది ప్రేక్షకులే నిర్ణయిస్తారు. బోనీ నోటీసుల్ని ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు' అంటూ ట్విట్టర్‌లో స్పందించాడు. ఇంతకుముందే వివాదంపై స్పందించిన ప్రియా 'నా పాత్ర పేరు శ్రీదేవి, ఆ పాత్ర సినీ నటి కావడం కాకతాళీయకం. ట్రైలర్‌కు మంచి స్పందన రావడంతో రాద్ధాంతం చేస్తున్నారు. నటి శ్రీదేవి జీవిత కథో కాదో సినిమా విడుదలైన తరువాత ప్రేక్షకులే తేలుస్తారు' అని వ్యాఖ్యానించింది.